


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 09, సంచిక: 308 | గురువారం | 08-10-2026 | కరీంనగర్ Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## ఇఎంఐలు మరింత భారం

**రెపో రేటు 25 బేసిస్ పాయింట్లు పెంపు**

**ముంబయి:** భారతీయ రిజర్వ్ బ్యాంకు బుధవారం రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. సుమారు రెండున్నరేళ్ల తర్వాత రెపో రేటు పెంచారు. ప్రస్తుతం రెపో రేటు 5.5 శాతానికి చేరుకుంది. ద్రవ్యోల్బణం, పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రెపో రేటును పెంచాల్సి వచ్చినట్లు తెలుస్తోంది. రేటు పెంచడం వల్ల ఇంటి రుణాలు, వాహన రుణాలు, కార్పొరేట్ రుణాలు మరింత ప్రియం కానున్నాయి. ప్రస్తుతం ఇఎంఐ కడుతున్న వారిపై మరింత భారం పడే అవకాశాలు ఉన్నాయి. గతంలో అవలంభించిన విధానాలకు విరుద్ధంగా ఆర్‌బిఐ తాజాగా రెపో రేటు పెంచింది. 2023, ఫిబ్రవరిలో రెపో రేటు పెంచారు. అప్పుడు 0.25 శాతం పెంచి, 6.50 శాతానికి చేర్చారు. 2023–24 సీజన్‌లో రెపో రేటు తరువాయి 8లో

## ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డిఏలు

- 2024 జనవరి, జులై డిఏల విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డిఏలను (కరవు భత్యం) రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రెండు డిఏలు కలిపి 6.27 శాతం పెరిగింది. 2024 జనవరి, జులై డిఏలను విడుదల చేయగా, అక్టోబరు వేతనంతో కలిపి ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేయనుంది.ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా జిఒ 128,130 రెండు వేర్వేరు ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. సిపిఎస్ ఉద్యోగులకు మొదటి డిఎ 33, రెండో కరవు భత్యాన్ని 27 వాయిదాల్లో చెల్లించనున్నారు. డిఏల పెంపుతో రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.2,500 కోట్లను చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డిఏల్లో రెండు మంజూరు తరువాయి 8లో




జంతర్‌మంతర్ వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకోవడంతో రాజ్యాంగం ప్రతిని పట్టుకుని రోడ్డుపై పడుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపి ప్రియాంక గాంధీ

# వెనక్కి తగ్గని ప్రతిపక్షాలు

**జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ రెండో రోజూ ఇండియా కూటమి పార్టీల నిరసన**



పోలీసులు దౌర్జన్యంలో టిఎంసి ఎంపి మహువా మొయిత్రా చెంపకు, చేతికి గాయాలు



సందోష్‌కుమార్‌ను ఈడ్చుకెళ్లిన పోలీసులు

- బస్సులో ఇసి కార్యాలయానికి వెళ్తుండగా జంతర్‌మంతర్ సమీపంలో అడ్డుకున్న పోలీసులు
- రాహుల్, ప్రియాంక సహా పెద్దసంఖ్యలో ఎంపిల నిర్బంధం
- బస్సుల నుంచి బయటకు వచ్చి రోడ్డుపై ఆందోళన
- మహిళా నేతలతో కలిసి రోడ్డుపై పడుకుని నిరసన తెలిపిన ప్రియాంక
- ఎంపిలను ఈడ్చుకెళ్లిన ఖాకీలు

## ఓటు చోరీపై మరోసారి దద్దరిల్లిన ఢిల్లీ

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా, సిఇసి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా ఐక్య సంఘటన చేపట్టిన నిరసన మరోసారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జంతర్ మంతర్ వైపు వెళ్తున్న ప్రతిపక్ష ఎంపిలను పోలీసులు అడ్డుకోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా అనేక మంది ప్రతిపక్ష నేతలు, ఎంపిలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఆకాశవాణి భవన్ వద్ద రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు సుమారు ఎనిమిది గంటల పాటు ధర్నా నిర్వహించి, ఎన్నికల కమిషనర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసిన సంగతి విదితమే. బుధవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్వర్యంలో హోటల్ సాగర్ రత్నలో జరిగిన అనంతరం సిఇసి జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఇండియా ఐక్యసంఘటన ఎంపిలు మరోసారి ఆందోళన చేపట్టారు. ఆ తర్వాత బస్సుల్లో ఎన్నికల సంఘం కార్యాలయానికి బయలుదేరగా... జంతర్ మంతర్‌కు సుమారు 100 మీటర్ల ముందు ప్రతిపక్ష తరువాయి 8లో

## సిపిఐ ఎంపి సందోష్‌కుమార్‌పై దురుసు ప్రవర్తన

వందలాది మంది ఇండియా కూటమి ఎంపిలతో కలిసి జంతర్ మంతర్ వైపు వెళుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి, ఎంపి పి.సందోష్ కుమార్‌ను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పట్ల దురుసుగా ప్రవర్తించారు. 'ఓట్ చోర్' జ్ఞానేశ్ కుమార్ కాపాడటానికి మోదీ, అమిత్ షా ఢిల్లీని ఒక పోలీస్ దండన రాజ్యంగా మార్చేశారని సందోష్ కుమార్ మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఎంపిలను, పౌరులను అదుపులోకి తీసుకుని, శారీరకంగా హింసిస్తున్నారని విమర్శించారు.



## విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించబోం

- రికార్డు స్థాయిలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం
- యాదాద్రి ఆలస్యానికి గత పాలకుల తప్పిదాలే
- హరీశ్‌రావు విమర్శలు వాస్తవాలను కప్పిపుచ్చలేవు: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

డిస్కంలు, ట్రాన్స్‌కో, జెన్‌కోలను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమన్నారు. యాదాద్రి ప్లాంట్ ఆలస్యం, బొగ్గు కొరత, అధిక తరువాయి 8లో



## సైబర్ మోసగాళ్లపై మెరుపుదాడులు

- టిజిసిఎస్‌బి సమన్వయ ఆపరేషన్‌లో 101 మంది అరెస్ట్
- మ్యూల్ ఖాతాల ద్వారా రూ.17 కోట్ల లావాదేవీలు గుర్తింపు..
- వెలుగులోకి 1,172 సైబర్ నేర లింకులు:టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశవ్యాప్తంగా విస్తరించిన సైబర్ నేరాల ముఠాలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిబిసిఎస్‌బి) భారీ దాడికి దిగింది. దక్షిణ భారతదేశంలోని ఆరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతంలో రెండు వారాల పాటు నిర్వహించిన సమన్వయ ఆపరేషన్‌లో 101 మంది నిందితులను అరెస్టు చేయడంతో పాటు రూ.17 కోట్ల మేర జరిగిన అనుమానాస్పద సైబర్ మోసాల లావాదేవీలను గుర్తించింది. అరెస్టయిన వారిలో 18 మంది మహిళలు ఉండగా.. మోసాలకు వినియోగించిన మ్యూల్ బ్యాంకు తరువాయి 8లో







# వడ్డీ రేటు పెంపు సామాన్యుడిపై పెను భారం!

బ్యాంకులకు ఇచ్చే రుణాలపై వర్తింప చేసే వడ్డీ, 'రెపో', రేటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) 25 బేసిస్ పాయింట్లు పెంచడం ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన సాంకేతిక నిర్ణయంలా కనిపించినా, దాని ప్రభావం ఎక్కువగా సామాన్యుడిపైనే ఉంటుంది. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం, ఆర్థిక వ్యవస్థలో నగదు ప్రవాహాన్ని నియంత్రించడం, ధరల స్థిరత్వాన్ని కాపాడటం వంటి లక్ష్యాలను, సుమారు నాలుగేళ్ల తర్వాత జరిగిన తొలి పెంపును ఆర్‌బిఐ ముడిపెట్టినప్పటికీ, ఈ చర్య రుణగ్రహీతలపై పడే భారం పెంచుతుంది. ముఖ్యంగా గృహ రుణం, వ్యాపార రుణం తీసుకున్న మధ్యతరగతి కుటుంబాలు, చిన్న వ్యాపారులు ఈ ప్రభావాన్ని నేరుగా ఎదుర్కోవాల్సి రావచ్చు. రెపో రేటు పెరిగినప్పుడు బ్యాంకులకు నిధుల వ్యయం పెరుగుతుంది. ఆ పెరిగిన వ్యయాన్ని బ్యాంకులు కొంత మేరకు రుణగ్రహీతలపైకి బదిలీ చేయడం సహజం. ఫలితంగా, రుణగ్రస్థులు చెల్లించే నెలవారీ చెల్లింపులు లేదా ఇఎంఐ కొనసాగే కాలపరిమితి పెరగవచ్చు. ఇప్పటికే కుటుంబ ఆదాయంలో గణనీయమైన భాగం రుణ వాయిదాలకు వెళ్తున్నప్పుడు, వడ్డీ పెరుగుదల అదనపు ఆర్థిక భారంగా మారుతుంది. ఇది కేవలం ఇంటి రుణానికి పరిమితం కాదు. వ్యాపార రుణాలపై వడ్డీ పెరిగితే చిన్న, మధ్యతరహా వ్యాపారాల నిర్వహణ ఖర్చులు పెరుగుతాయి. నిర్వహణ మూలధనం కోసం బ్యాంకు రుణాలపై ఆధారపడే వ్యాపారులకు ఈ భారం మరింత కష్టం. చిన్న వ్యాపారి తన వ్యాపారాన్ని కొనసాగించడానికి బ్యాంకు రుణంపై ఆధారపడుతుంటాడు. రుణ వ్యయం పెరిగితే అతని లాభాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఆ భారాన్ని వినియోగదారుడిపైకి బదిలీ చేస్తే వస్తువులు, సేవల ధరలు పెరిగే ప్రమాదం ఉంటుంది. అలా చేయలేని పరిస్థితిలో వ్యాపారి తన లాభాన్ని తగ్గించుకోక తప్పదు. కొత్త పెట్టుబడులు పెట్టడం, వ్యాపారాన్ని విస్తరించడం, కొత్త ఉద్యోగాలు కల్పించడం వంటి నిర్ణయాలు సైతం వాయిదా పడతాయి. దేశంలోని అత్యంత నిరుపేదలకు పెద్దగా బ్యాంకు రుణాలు లేకపోవచ్చు. అయినా వడ్డీ రేట్ల పెంపు వారిని కూడా ప్రభావితం చేస్తుంది. వ్యాపారాల ఖర్చులు పెరిగితే వస్తువులు, సేవల ధరలపై ఒత్తిడి తప్పదు. ఉపాధి అవకాశాలు, చిన్న వ్యాపారాల కార్యకలాపాలు కూడా ప్రభావితమవుతాయి. పేద కుటుంబాలకు ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలు పరిమితంగా ఉంటాయి. కాబట్టి జీవన వ్యయం పెరిగినా, రుణభారం పెరిగినా, దాని ప్రభావాన్ని తట్టుకోవడం వారికి మరింత కష్టం. ధనిక కుటుంబం అదనపు ఖర్చును కొంతకాలం భరించగలిగినా, పేద కుటుంబానికి అదే పరిస్థితి తీవ్రమైన సమస్యగా మారుతుంది. ఇక బ్యాంకులు తమ అదనపు నిధులను ఆర్‌బిఐ వద్ద ఉంచినప్పుడు పొందే వడ్డీ, 'రివర్స్ రెపో' ఆకర్షణీయంగా మారితే, ఆ నిధుల్లో కొంత భాగం మార్కెట్‌కు వెళ్లకపోవచ్చు. ఫలితంగా రుణాల లభ్యతపై ఒత్తిడి వస్తుంది. ముఖ్యంగా చిన్న వ్యాపారాలు, కొత్తగా వ్యాపారం ప్రారంభించాలనుకునే వారు, గృహ రుణం కోసం ఎదురుచూసేవారు దీనిని ఎదుర్కోకతప్పదు. అందుకే, 'రెపో', 'రివర్స్ రెపో'ను ఆర్థిక నిపుణులకు సంబంధించిన పదాలుగానూ, ఆర్‌బిఐ అనుసరించే వివిధ పాలనాపరమైన అంశాలుగానూ పరిగణించడానికి వీల్లేదు. అవి బ్యాంకు రుణాల ధర, రుణాల లభ్యత, పెట్టుబడులు, వ్యాపార కార్యకలాపాలు, చివరకు కుటుంబ రాబడి ఖర్చులపై ప్రభావం చూపే అంశాలు.

అయితే, ఇక్కడ మరో ముఖ్యమైన విషయాన్ని విస్మరించలేం. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం కూడా సామాన్యుడి ప్రయోజనమే. ధరలు అదుపు తప్పితే ఆహారం, విద్య, వైద్యం, రవాణా, ఇతర నిత్యావసరాల ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యంగా తక్కువ ఆదాయ కుటుంబాలపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. కాబట్టి, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ఆర్‌బిఐ కఠినమైన ద్రవ్య విధానాన్ని అనుసరించడం వెనుక ఆర్థిక కారణం ఉంది. కానీ, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే క్రమంలో రుణగ్రహీతలపై అధిక భారం పడకుండా జాగ్రత్త వహించాల్సిన బాధ్యత కూడా విధాన నిర్ణేతలపై ఉంది. తాజాగా రెపో రేటును పెంచడం ద్రవ్యోల్బణ నియంత్రణకు అవసరమైన చర్య కావచ్చు. కానీ ఒక ఆర్థిక నిర్ణయం విజయాన్ని కేవలం మార్కెట్ల ప్రతిస్పందనతోనే కొలవలేం. గృహ రుణం చెల్లించే కుటుంబం పరిస్థితి ఏమిటి? చిన్న వ్యాపారి రుణభారాన్ని భరించగలుగుతున్నాడా? కొత్తగా వ్యాపారం ప్రారంభించాలనుకునేవారికి రుణం అందుబాటులో ఉందా? పేద కుటుంబాల జీవన వ్యయం ఎలా మారుతోంది? అనే ప్రశ్నలకు కూడా సమాధానం ఉండాలి. ఆర్థిక స్థిరత్వం అనేది ధరలను అదుపులో ఉంచడానికి మాత్రమే పరిమితం కాదు. ప్రజలకు అందుబాటులో ఉండే రుణం, చిన్న వ్యాపారాలకు అవసరమైన మూలధనం, కుటుంబాలకు భరించగలిగే ఇఎంఐలు కూడా ఆర్థిక స్థిరత్వంలో భాగమే. వడ్డీ రేటు పెంపు ద్వారా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలన్న లక్ష్యం సమర్థనీయమే. కానీ ఆ భారాన్ని సామాన్యుడు ఎంతవరకు భరించగలడో కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని చెప్పాలంటే బ్యాంకుల బ్యాలెన్స్‌షీట్లతోపాటు, ఇంటి రోజువారీ కేటాయింపుల పరిస్థితులు కూడా బలంగా ఉండాలి. రెపో, రివర్స్ రెపో రేట్లను ఆర్‌బిఐ సుదీర్ఘ కాలం తర్వాత పెంచడాన్ని తప్పుపట్టకూడదనే వాదన వినిపించవచ్చు. అది కొంత వరకూ సమర్థనీయం కూడా. అదే సమయంలో, 2026–27 ఆర్థిక సంవత్సరానికి, రీటైల్ ఇన్‌ఫ్లేషన్ ముందుగా ఊహించిన 5 శాతానికి మించి, 5.2గా ఉంటుందని ఆర్‌బిఐ చేసిన ప్రకటనను గమనించాలి. ద్రవ్యోల్బణం 'సహించగల స్థాయి'ని దాటుతున్నప్పుడు, నివారణ చర్యలు అత్యవసరం. ఉత్పత్తి దారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం నుంచి ధరల నియంత్రణ వరకూ వివిధ రకాల చర్యలు చేపట్టాలి. కేవలం రెపో రేటును పెంచడం ద్వారా మార్కెట్‌లో ద్రవ్య సరఫరాలను, వినియోగాన్ని నియంత్రించవచ్చని, తద్వారా డిమాండ్ తగ్గితే ధరలు కూడా అదుపులోకి వస్తాయని వాదించడం సరైనది కాదు. ఆర్‌బిఐని స్వతంత్ర సంస్థగా పేర్కొంటున్నప్పటికీ, అది కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కనుసన్నల్లో నడుస్తుందని, కేంద్ర కేబినెట్ తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగానే తీర్మానాలు చేస్తుందన్నది బహిరంగ రహస్యం. పెరుగుతున్న ధరలపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్న తరుణంలో, ఆర్‌బిఐని కేంద్ర ప్రభుత్వం ఒక 'నియంత్రణ మార్గం'గా ఎంచుకొని ఉండవచ్చు. రెపో రేటు పెంపుదలతో పెరుగుతున్న ధరల సూచీకి కళ్లెం వేయాలని ఆశిస్తుండవచ్చు. అదే సమయంలో, సామాన్యుడిపై పడే భారాన్ని, అతనికి ఊరట కల్పించే మార్గాలను కూడా అన్వేషించి, ప్రకటించి ఉంటే బాగుండేది. ఆర్‌బిఐ నిర్ణయంతో తలెత్తే పరిణామాలను సమీక్షించి, సామాన్యుడు తీవ్రమైన ఆర్థిక ఒత్తిడికి లోనుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ద్రవ్యోల్బణ నియంత్రణకు ఆర్‌బిఐ ఇతరత్రా చర్యలు కూడా తీసుకోవాలి. లేకపోతే, రెపో రేటు పెంపు ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపడం ఖాయం. ●



## ఎఫ్ఐఆర్ నాకు మెడల్ వంటిది

**నాపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100 కావాలని ఉంది. నాపై వంద ఎఫ్ఐఆర్‌లు పెట్టాలని కోరుకుంటున్నాను. నాకు ప్రతి ఎఫ్ఐఆర్ ఒక పతకం (మెడల్) లాంటిది. మోదీ, అమిత్‌షాలు జ్ఞానేశ్‌కుమార్ ద్వారా ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారు. అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడితే నాపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారు.**

– ఆకాశవాణి భవన్‌లో ప్రవేశించినందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ

## గోండుల సూర్యుడు... కొమరం భీమ్



1724 నుంచి 1940 (1948) వరకు అనగా అసఫ్జా నిజాం ఉల్ముల్క్ నుంచి 9వ(చివరి) నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ బహదూర్ దాకా 9 మంది నిజాం నవాబుల సుమారు 224 ఏళ్ల దుష్ట పాలన కాలంలో నిజాం హైదరాబాద్ రాజ్యంలోని ఆసిఫాబాద్, ఆదిలాబాద్ అటవీ ప్రాంత గ్రామాల్లో అడవి బిడ్డలకు అడవి మీద ఏమాత్రం అధికారం లేదు. అడవిలో కనీసం పుల్ల కూడా ముట్టుకోరాదు. కట్టుకునేందుకు గోచీలు తప్ప అంగీలు లేవు. అడవి బిడ్డలు చేసుకున్న కష్టఫలాన్ని ఉద్యోగులు గద్దర్ల తన్నుకు పోతారు. అధికారులు, పోలీసులు, పట్వారీలు, పటేళ్లు, దొరలు, పెత్తందార్ల దుర్మార్గాలు, అరాచకాలు, దోపిడీలు, అత్యాచారా లు, మానభంగాలు, హత్యలు, చిత్రహింసలు అంతా ఇంతా కావు. హింసించి పట్టి పేరా బలవంతంగా డబ్బులు దోచుకునేవారు. ఇలా అడవి బిడ్డలు రాక్షస పాలనలో అనుభవిస్తున్న కష్టాలు చూసి సర్కారుపై కొమరం భీమ్ రగిలిపోయాడు. తన గోండు జాతి జనులను కాపాడుకోవడానికి దుష్ట నిజాం నవాబుతో యుద్ధానికి నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో గోండులందరిని ఏకం చేయాలనుకున్నాడు. వాళ్ల హక్కులను అడవులపై వారికి గల అధికారాలను నిజాం నవాబు పై యుద్ధం చేసి గెలుచుకొని వారికి సుఖశాంతులను ఇవ్వాలని తనకు తాను కర్తవ్య బోధ చేసుకున్నాడు. తన అనుచరులైన కురిసెంగ సాము, జుమ్నాక పైకు, కుమార లింగు, ఆత్రం రఘు, మడావి సోము, జాకో, కరిపెత్త బాదు, రాజు పటేల్, సీడం భూజీరావు, సోనేరావులతో కూడిన 500మంది సైనికులను తయారు చేశాడు. వారికి ఆయుధాలుగా తుపాకులు, కత్తులు, గుత్పలు ఇచ్చాడు. అడవి బిడ్డల హక్కులైనా ఆదివాసీల స్వయంపాలన 'జల్ జంగల్ జమీన్' సాధన నినాదంతో పదేళ్లకు పైగా 1931 నుంచి 1940 అక్టోబర్ 8 దాకా అమర త్వం పొందే వరకు ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలైన జోడేఘాట్, బాబే జరి, పట్నాపూర్, టోకెన్ల వాడ, చల్ భరిడి, శివ గూడా, భీమన్ గోంది, కల్లెగావ్, అంకుతాపూర్, నర్సాపూర్, కోషగూడ, లైన్ టవల్ అనే 12 గూడేల ఆదివాసీల స్థితిగతులను మార్చి వారికి బంగారు జీవితాలను ప్రసాదించడానికి ప్రాణాలను తృణప్రాయంగా ఎంచుకొని తిరుగులేని గెరిల్లా యుద్ధ వ్యూహంతో సమరం సాగించా డు. కాగా కొమురం భీం 1901 అక్టోబర్ 22న పుట్టాడు. 39 ఏళ్ల వయసులో గోండుల కోసం సాగించిన విప్లవోద్యమంలో నేలకొరిగాడు. కాగా మా మిత్రులు ప్రముఖ దర్శక నిర్మాత అల్లాని శ్రీధర్ కొమరం భీమ్ చిత్రాన్ని నిర్మించి భీమ్ వీరోచిత గాథ ను ప్రపంచానికి తెలిపారు. ఈ చిత్రం జాతీయ సమగ్రత చిత్రంగా ఎంపికైంది. ఉత్తమ దర్శకుడు గాను ఎంపిక కాగా శ్రీధర్‌కు 2 నంది అవార్డులను తెచ్చి పెట్టింది.

తాళ్లపల్లి యాదగిరి గౌడ్, 9949789939

## మనుస్మృతి అడుగుజాడల్లో

# రాజ్యాంగాన్ని మారుస్తారా?

**సునీల్ ముఖోపాధ్యాయ్**
రచయిత, జర్నలిస్టు

*గత లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా మెజారిటీ సాధించడంలో విఫలమైన తరువాత, భారత రాజ్యాంగ ప్రతిని తన తలపై ఉంచుకుని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొత్త పార్లమెంటు భవనంలోకి ప్రవేశించినప్పుడు, ఆయనకు రాజ్యాంగం పట్ల విశ్వాసం ఉండవచ్చని కొందరు భావించారు. భారత రాజ్యాంగం సామ్యవాద, ప్రజాస్వా మ్య, సమాఖ్య, లౌకిక స్వభావాన్ని మార్చాలని భారత ప్రజలు కోరుకోవడం లేదని ఆయన బహుశా గ్రహించి ఉంటారని వారు అనుకున్నారు. అణగారిన వర్గాలకు అంటే షెడ్యూల్డ్ కులాలు, తెగలతో సహా అన్ని వెనుకబడిన కులాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ఆయన గౌరవిస్తారని భావించారు. మోదీ విషయంలో సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా ఆలోచించాలని కొందరు నాకు సలహా కూడా ఇచ్చారు. కానీ త్వరలోనే అసలు విషయం బయటపడింది. ప్రధానంగా రాజ్యాంగాన్ని మార్చేందుకు, ప్రతిపక్ష ప్రాంతీ య పార్టీల ఎంపిలను తమ వైపు తిప్పుకోవడం, పార్లమెంటు ఉభయ సభలలో (లోక్‌సభ, రాజ్యసభ) మూడింట రెండు వంతుల ఎంపిల మద్దతును కూడగట్టుకోవడం అనే వ్యూహం పట్ల మోదీ, ఆయన బృందం ఆసక్తి చూపారు.*

రాజ్యాంగ పీఠిక నుండి 'లౌకికవాదం', 'సామ్యవాదం' అనే పదాలను తొలగించాలని గతంలో భారతీయ జనతా పార్టీకి చెందిన అనేకమంది నాయకులు అన్నారు. ఇప్పటికీ అంటూనే ఉన్నారు. అసలు రాజ్యాంగ పీఠికలో ఈ రెండు పదాలు లేవని, అవి తర్వాత చేర్చబడ్డాయని వారి వాదన. అది నిజమే; బి.ఆర్. అంబేద్కర్ ఆధ్వర్యం లో రూపొందించిన రాజ్యాంగం అసలు పీఠికలో ఈ రెండు పదాలు లేవు. ఎందుకంటే, భారతదేశం ఒక లౌకిక, సామాజిక న్యాయంతో కూడిన ప్రజాస్వామ్య దేశంగా ఉంటుందనే భావనను రాజ్యాంగంలోని నిబంధనలు, ఉపనిబంధనలు అప్పటికే ప్రతిబింబించేలా ఉన్నాయి. కానీ ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంస్థలు ఈ రాజ్యాం గ విలువలపై తీవ్రమైన దాడులు చేయడం ప్రారంభించినప్పుడు, 1976లో భారత రాజ్యాంగంలో పీఠిక 'లౌకిక' 'సామ్యవాద' అనే పదాలను చేర్చారు.

మోదీ, ఆయన మద్దతుదారులలో మార్పు వచ్చింద ని భావించిన వారు ఒక సాధారణ సత్యాన్ని విస్మరించారు. బిజెపి అనేది రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) రాజకీయ విభాగం. ఆర్‌ఎస్‌ఎస్ అనేది కఠినమైన క్రమశిక్షణతో కూడిన, అంటే కచ్చితమైన నియంత్ర ణ కలిగిన క్యాడర్ ఆధారిత సంస్థ. కాబట్టి, ఎన్నికల్లో గెలిచేందుకు బిజెపి తన వ్యూహాలను మార్చుకున్నప్పటికీ, సంస్థాగత, సైద్ధాంతిక అంశాలపై ఆర్‌ఎస్‌ఎస్ విధానా లు, ఆదేశాలను పాటించాల్సిన అనివార్యత దానికి ఉంటుంది. ఆర్‌ఎస్‌ఎస్ పట్ల బిజెపి నాయకులు బహిరంగంగానే తమ విధేయతను ప్రకటిస్తారు. ఈ రెండు సంస్థల నాయకుల మధ్య వ్యక్తిగత విభేదాలు ఉండవచ్చు కానీ, భావజాలపరంగా అందరూ ఏక తాటిపైనే ఉంటారు.

హిందూ మితవాద సంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్‌లో 'గురూజీ'గా పిలువబడే మాధవ సదాశివరావు గోల్వాల్కర్, 1939లో ప్రచురితమైన తన 'We, or Our Nationhood defined' (మనం, లేదా మన జాతీయత నిర్వచనం) అనే పుస్తకం ద్వారా ఈ సంస్థకు భావజాల పునాదిని వేశారు. వీరు జర్మనీకి చెందిన ఫాసిస్ట్ నియంత అడాల్ఫ్ హిట్లర్‌ను ఆరాధించేవారు. గోల్వాల్కర్ ఇలా రాశారు: 'జాతి, దాని సంస్కృతి స్వచ్ఛతను కాపాడుకోవటానికి, సెమిటిక్ జాతులైన యూదులను దేశం నుండి తొలగించడం ద్వారా జర్మనీ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇక్కడ అత్యున్నత స్థాయి జాత్యాభిమానా న్ని ప్రదర్శించింది. మూలస్థాయిలోనే భిన్నత్వాలు కలిగిన జాతులు, సంస్కృతులు ఒకే మాదిరిగా కలిసిపోవ డం ఎంత అసాధ్యమో చెప్పేందుకు, హిందుస్థాన్‌లోని మనకు అది చూసి నేర్చుకొని, ప్రయోజనం పొందడానికి ఒక మంచి పాఠం' (పేజీ 35). ఆయన 'సెమిటిక్ జాతి' అనే పదాన్ని చాలా ఉద్దేశపూర్వకంగానే ఉపయోగించారు. ఎందుకంటే ఇందులో కేవలం యూదులే కాకుం డా ముస్లిం, అరబ్ జాతులు కూడా ఉంటాయి. వాస్తవం ఏమిటంటే, దేశ విభజనకు ముందు, తర్వాత కూడా, మన జనాభాలో గణనీయమైన భాగం ముస్లింలే ఉన్నారు.



### గోల్వాల్కర్‌కు హిట్లర్ స్ఫూర్తి

హిట్లర్ బోధనల నుండి ప్రేరణ పొందిన గోల్వాల్కర్, శతాబ్దాల క్రితమే హిందుస్థాన్‌లో (అంటే హిందూ మెజారిటీ కలిగిన భారతదేశంలో) శాశ్వతంగా స్థిరపడిన ముస్లింల భవిష్యత్తు ఎలా ఉండాలో కూడా ఆ పుస్తకంలో స్పష్టంగా వివరించారు. ఆయన ఇలా రాశారు: 'హిందుస్థాన్‌లోని విదేశీ జాతులు తప్పనిసరిగా హిందూ సంస్కృతిని, భాషను స్వీకరించాలి. హిందూ మతాన్ని గౌరవించడం, ఆరాధించడం నేర్చుకోవాలి, హిందూ జాతి, సంస్కృతిని (అంటే హిందూ దేశాన్ని) కీర్తించడం తప్ప వేరే ఆలోచనలు కలిగి ఉండకూడదు. హిందూ జాతిలో కలిసిపోవడానికి తమ ప్రత్యేక ఉనికిని వదులుకోవాలి. లేదా వారు దేశంలోనే ఉంటూ హిందూ దేశానికి పూర్తిగా లోబడి ఉండాలి. వారు ఏమీ ఆశించకూడదు, ఎలాంటి ప్రత్యేక హక్కులకు లేదా ప్రాధాన్యతకు అర్హులు కారు, కనీసం పౌర హక్కులకు కూడా కాదు. వారు అనుసరించేందుకు వేరే మార్గం లేదు, ఉండకూడదు కూడా. మనది ఒక ప్రాచీన దేశం;'మన దేశంలో నివసించేందుకు ఎంచుకున్న విదేశీ జాతులతో, ప్రాచీన దేశాలు వ్యవహరించాల్సిన విధంగానే మనం వ్యవహరిద్దాం (అదే గ్రంథం, పేజీలు 47–48). కాబట్టి, ఈ దేశంలోని ముస్లింలు పాకిస్తాన్ లేదా బంగ్లాదేశ్‌కు వలస వెళ్ళిపోవాలని మోదీ గారి మద్దతుదారులు చెప్పడం వారి కొత్త నినాదం కాదు. వాస్తవానికి వారు తమ గురూజీ నేర్పిన దానినే పునరావృతం చేస్తున్నారు. అలాగే, 1946 జులై 14న నాగ్‌పూర్‌లో జరిగిన ఒక సభలో గోల్వాల్కర్ మాట్లాడుతూ, కాషాయ జెండా భారతీయ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. ''అది దైవ స్వరూపం. ఒక రోజు దేశమంతా ఈ జెండా ముందు తలవంచుతుందని మేము సంపూర్ణంగా విశ్వసిస్తున్నాము.'' (గోల్వాల్కర్, 'సంగ్రహ రచనావళి', హిందీ ఎడిషన్, సంపుటి 1, పేజీ 98) 1947 ఆగస్టు 14న ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసేందుకు భారత ప్రజలు చొరవ తీసుకున్న అదే రోజున, ఆర్‌ఎస్‌ఎస్ అధికారిక ఆంగ్ల పత్రిక 'ఆర్గనైజర్' ఇలా రాసింది: 'అదృష్టవశాత్తు అధికారంలోకి వచ్చిన వారు త్రివర్ణ పతాకాన్ని మాకు అప్పగించాలనుకోవచ్చు. కానీ హిందువులు దానిని ఎప్పటికీ అంగీకరించరు; దానిని గౌరవించరు. 'మూడు' అనే సంఖ్య అశుభమైనది. ఒకవేళ ఏదైనా జెండాలో మూడు రంగులు ఉంటే, అది కచ్చితంగా మానసికంగా చెడు ప్రభావాన్ని చూపుతుంది, దేశానికి కీడు కలిగిస్తుంది.' విప్లవకారుడి నుండి హిందుత్వ ప్రవక్తగా మారిన వినాయక్ దామోదర్ సావర్కర్ అప్పటికే ఇలా అన్నారు: 'మనుస్మృతి నేటి హిందూ ధర్మశాస్త్రం (హిందూ కోడ్).

'నిజానికి, భారత రాజ్యాంగం అన్ని మతాలు, వర్గాలు, లింగాలు, జాతులకు సమాన హక్కులను నొక్కిచెప్పింది. కానీ ఆర్‌ఎస్‌ఎస్ మాత్రం 'మనుస్మృతి' ఆధారిత రాజ్యాంగాన్ని కోరుకుంది. భారత రాజ్యాంగ పరిషత్ 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఖరారు చేసింది. నాలుగు రోజుల తర్వాత, నవంబర్ 30న 'ఆర్గనైజర్' పత్రిక సంపాదకీయంలో ఆగ్రహంతో ఇలా రాసింది: ''ప్రాచీన భారతదేశంలో రూపొందించిన విశిష్టమైన రాజ్యాంగ నియమాల ప్రస్తావన మన రాజ్యాంగంలో ఎక్కడా లేదు. స్పార్టాకు చెందిన లైకర్గస్ లేదా పర్షియా కు చెందిన సోలోన్ కంటే చాలా కాలం ముందే మనుస్మృతి రచించబడింది. మనుస్మృతిలో పేర్కొన్న నియమాలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసించబడుతున్నాయి, స్వచ్ఛందంగా అనుసరించబడుతున్నాయి''.

ఈ వాదనలో ఏమాత్రం వాస్తవం లేదు. మనుస్మృతి లో పేర్కొన్న కుల వ్యవస్థ విభజనలు గానీ, లేదా అత్యల్ప నేరానికి కూడా శూద్రుల నాలుకను లేదా చేతిని నరికేసే నిబంధనలు గానీ ప్రపంచంలోని ఏ నాగరిక దేశంలోనైనా ఆచరణలో ఉన్నాయా? ఏ నాగరిక దేశంలోనైనా కుల ఆధారిత వివక్ష ఉందా? అదృష్టవశాత్తూ, భారత శిక్షాస్మృతి (ఐపిసి) కూడా ఏ నేరానికీ అటువంటి అమానుషమైన శిక్షలను గుర్తించదు. మనువు ప్రకారం, లోక కల్యాణం కోసం బ్రాహ్మణు లు బ్రహ్మ దేవుని ముఖం నుండి, క్షత్రియులు ఆయన చేతుల నుండి, వైశ్యులు ఆయన తొడల నుండి, శూద్రులు ఆయన పాదాల నుండి ఉద్భవించారు. విశ్వాన్ని రక్షించటానికి, సృష్టికర్త వారిలో ప్రతి ఒక్కరికీ వేర్వేరు బాధ్యతలను కేటాయించారు. బ్రాహ్మణులు వేదాలను పఠించడం, బోధించడం, ఇతరుల శ్రేయస్సు కోసం దానధర్మాలు స్వీకరించడం/ఇవ్వడం వంటివి చేస్తారు.

క్షత్రియులు ప్రజలను రక్షిస్తారు. వైశ్యులు పశుపోషణ, వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తారు. ఇక శూద్రుల పని ఏమిటంటే, పై మూడు వర్ణాల వారికి, అంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకుసేవ చేయడం. పై వర్ణాల వారికి వేదాలను అధ్యయనం చేసే, విద్యను అభ్యసించే హక్కు ఉన్నప్పటికీ, శూద్రులకు ఆ హక్కు లేదు. ఒకవేళ ఎవరైనా శూద్రుడికి ఏదైనా జ్ఞానాన్ని బోధిస్తే, బోధకుడు, విద్యార్థి ఇద్దరూ నరకానికి వెళ్తారు. **(ఇంకా ఉంది)**

# ఆర్టీసి కార్మికులకు పరీక్షా సమయం

## 9వ తేదీ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో వివేకంతో ఓటు భవిష్యత్తుకు బాట : తొత్తు సంఘాలను గెలిపిస్తే మొదటికే మోసం

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్టీసి) ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుంది. కార్పోరేషన్, ప్రభుత్వంలో విలీనానికి మధ్య ఊగిసలాడుతుంది. ఈ సంక్లిష్ట స్థితిలో దశాబ్దకాలం తర్వాత కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నాయి. విలీన ప్రక్రియ సజావుగా పూర్తి కావాలంటే కార్మిక పక్షపాత సంఘాలను గెలిపించాల్సిన అవసరం ఉన్నది. ఆర్టీసిలో 36వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. వేలకోట్ల రూపాయల ఆస్తులు ఆర్టీసికి ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ పూర్తయినా తెలంగాణలో మాత్రం ఆ ప్రక్రియకు పలు అడ్డంకులు ఎదురవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016లో గుర్తింపు సంఘానికి సంబంధించి ఎన్నికలు జరిగాయి. 2019 నుండి అప్పటి ప్రభుత్వం ఆర్టిసిలో యూనియన్లను రద్దు చేసింది. ఎప్పుడైతే యూనియన్లు రద్దయ్యాయో అప్పటి వరకు యూనియన్ లీడర్లుగా చలామణి అయిన అనేక మంది ముఖం చాటేశారు.

కార్మిక సమస్యలను పట్టించుకోలేదు. సంఘం లేనప్పుడు ఎవరు ఏమైతే ఏమన్న భావనతో ఉండగా ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ మాత్రం నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతూనే ఉంది. కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసింది. ధర్నాలు, గేట్ మీటింగ్‌లు, నిరాహార దీక్షలు, నిరసనలు, చలో హైదరాబాద్, చలో ఇందిరా పార్కు, చలో బస్ భవన్, అసెంబ్లీ ముట్టడి లాంటి ఎన్నో కార్యక్రమాలను నిర్వహించింది. ఎంప్లాయీస్ యూనియన్‌తో పాటు టిఎంయు, ఎన్‌ఎంయు మరికొన్ని సంఘాలతో కలిసి ఈ ఏడాది ఏప్రిల్‌లో మూడు రోజుల పాటు సమ్మె చేసి ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించేందుకు ప్రభుత్వాన్ని ఒప్పించడంలో సఫలీకృతులయ్యారు. అంతే కాదు 2021 వేతన సవరణకు ఈ ప్రభుత్వాన్ని ఎంప్లాయీస్ యూనియన్ కూటమి ఒప్పించగలిగింది, ఇది చారిత్రక సత్యం. డ్రైవర్, కండక్టర్ల ఉద్యోగ భద్రతపై ఒక కమిటీని వేయించి ఆ కమిటీ రిపోర్టును కూడా ప్రభుత్వం అంగీకరించే విధంగా చేయడంలో జెఏసి విజయం సాధించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి 56 వేలమంది ఉన్న కార్మికుల సంఖ్య ఇప్పుడు 36వేలకు పడిపోయింది. అయినా ఉన్న కార్మికులు ఆర్టిసి ఆదాయానికి గండిపడకుండా నిరంతరం శ్రమిస్తున్నారు. ఇదే సమయంలో తీవ్రమైన శ్రమదోపిడీకి గురవుతున్నారు. ఎనిమిది గంటల డ్యూటీ అనేది భూతద్దంతో చూసినా కనిపించడం లేదు. పని భారంతో విధుల్లోనే ఉంటూ కార్మికులు ప్రాణాలను కోల్పోతున్నారు. 16 నుంచి 18 గంటల పాటు డ్యూటీలు చేయిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. బదిలీల విషయంలో యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తుంది. చివరకు ఆర్టిసి పరిస్థితి రిటైర్‌మెంట్లు తప్ప రిక్రూట్‌మెంట్లు లేని పరిస్థితికి దిగజారింది. ఇప్పుడు ఇటువంటి ఒక సంక్లిష్ట స్థితిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగుతున్నాయి. దశాబ్దకాలం పాటు కార్మికులను పట్టించుకోని కొన్ని సంఘాలు అధికార అండతో తిరిగి గుర్తింపు సంఘం ఎన్నికల్లో పాల్గొంటున్నాయి. గతంలో ఆర్టీసి కార్మికులను చిన్నాభిన్నం చేసి వంచించిన కొందరు నేతలు తిరిగి ఇప్పుడు అధికారానికి తొత్తుగా మారి కార్మికులను మళ్లీ వంచించేందుకు ప్రయత్నిస్తున్నారు. కార్మికులు చిత్తశుద్ధితో ఆలోచించాల్సిన సమయం ఇది.




మరల తొత్తు సంఘాలను గెలిపిస్తే విలీన ప్రక్రియ మరింత దూరమయ్యే ప్రమాదం ఉంది. విలీన ప్రక్రియలోనూ కార్మికులు ఆశించిన రీతిలో ఒప్పందాలను తొత్తు సంఘాలు అమలు చేయకపోవచ్చు. ఈ రాష్ట్రంలో ఆర్టిసికి అపారమైన ఆస్తులు ఉన్నాయి. ఒక పక్క విలీనం, మరో పక్క కార్మికుల డిమాండ్లు అన్నింటికి మించి ఆర్టీసి పరిరక్షణకు సంబంధించి తొత్తు సంఘాలతో అత్యంత ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వంలోని కొంత మంది అమాత్యులు తొత్తు సంఘాలను గెలిపించుకునేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. తొత్తు సంఘాలను గెలిపిస్తే ఆర్టిసిని తమ కబంధ హస్తాల్లో బందీని చేయవచ్చునన్న ఆలోచనతోనే కార్మికులను వంచించిన నేతలను ప్రోత్సహిస్తున్నారు. ఆర్టీసి పరిరక్షణ, విలీనం ఈ రెండు కూడా కార్మిక పక్షపాత సంఘాలతోనే సాధ్యమవుతుంది. డబ్బుతోనే అదీ అని నమ్ముతున్న అధికార పార్టీ నేతలు ఆర్టీసి ఎన్నికల్లోనూ డబ్బులు ఎరవేసి తొత్తు సంఘాలను గెలిపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎవరు అధికారంలో ఉంటే వారి పంచన చేరి వారిని గెలిపించడం ద్వారా మరోసారి కార్మికులు మోసపోయే అవకాశం ఉంది. ఈనెల తొమ్మిదిన జరిగే ఎన్నికల్లో కార్మికులు యూనియన్లకు అతీతంగా ఆర్టిసి పరిరక్షణే ధ్యేయంగా ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్, ఎన్‌ఎంయు, టిఎంయు కూటమిని గెలిపిస్తే కార్మిక హక్కులు పరిరక్షించడంతో పాటు ప్రభుత్వంపై పోరాడి మరికొన్ని హక్కులను సాధించడంతో పాటు విలీన ప్రక్రియలో కార్మికులకు ఎటువంటి అన్యాయం జరగకుండా చూసే అవకాశం ఉంది. తొత్తు సంఘాలను గెలిపిస్తే ప్రభుత్వం చెప్పిన దానికి తానా తందానా అంటూ 36వేల మంది కార్మికుల జీవితాలను బలిపెట్టే అవకాశం ఉంది. ఆర్టిసి ఎంప్లాయీస్ యూనియన్ నేతృత్వంలోని కూటమికి రాష్ట్ర గుర్తింపుకు, బస్సు గుర్తుకు, స్థానిక గుర్తింపుకు సంబంధించి కాగడ గుర్తుకు, టిఎంయు నిచ్చిన గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాల్సి ఉంది. యూనియన్ల కంటే ఆర్టిసి పరిరక్షణపైనే కార్మికులు ఆలోచన చేయాల్సి ఉంది.

కార్మిక శ్రేయోభిలాషి

## కమ్యూనిస్టు ఉద్యమానికి
# రాజ్ బహదూర్ గౌర్ సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణసాయుధ పోరాట యోధుడిగా, కార్మిక నేతగా, పార్లమెంట్ సభ్యుడిగా ప్రజా ఉద్యమాలకు జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ రాజ్ బహదూర్ గౌర్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పలువురు సిపిఐ నేతలు అన్నారు.
మాజీ పార్లమెంట్ సభ్యుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కార్మిక నాయకుడు డాక్టర్ రాజ్ బహదూర్ గౌర్ వర్ధంతి సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్ భవన్‌లో బుధవారం ఆయన చిత్రపటానికి సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకట్‌రెడ్డి, కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, ముప్పాల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, ఉజ్జిని రత్నాకర్‌రావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమానికి రాజ్ బహదూర్ గౌర్ చేసిన సేవలు చిరస్మరణీమన్నారు. వైద్య విద్య పూర్తిచేసిన వెంటనే కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులైన రాజ్ బహదూర్‌గౌర్ తెలంగాణ సాయుధ పోరాటంలో తన సతీమణి బ్రీజానీగౌర్‌తో కలిసి పాల్గొన్నారని తెలిపారు. రాచకొండ గుట్టల్లో జరిగిన పోరాటంలో గాయాలతో బయటపడ్డారని గుర్తుచేశారు. కార్మిక సంఘాల నిర్మాణంలో ఆయన కీలకపాత్ర పోషించారని, బ్యాంకు ఉద్యోగులు, సింగరేణి కార్మిక సంఘాల ఏర్పాటుకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు.
సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పనిచేసి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారని, అన్ని పార్టీల నాయకుల నుంచి గౌరవం పొందారని అన్నారు. సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ రాజ్ బహదూర్ గౌర్ రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారని తెలిపారు. మూడో సారి అవకాశం వచ్చినప్పటికీ ఆయన నిరాకరించారని చెప్పారు. రైల్వే అధికారులతో వివాదం కారణంగా సస్పెండ్ అయిన కుమారన్‌కు రాజ్యసభ సభ్యత్వం ఇస్తే, తనను అవమానించిన అధికారులే సెల్యూట్ చేస్తారని గౌర్ చలోక్తిగా చెప్పేవారని గుర్తుచేశారు. ప్రతి అంశాన్ని హాస్యచతురతతో వివరిస్తూ అందరినీ ఆకట్టుకునేవారని, ఆయన జీవితం పూర్తిగా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి అంకితమైందని పేర్కొన్నారు.

# ఓటు హక్కు హరించే ప్రయత్నాలు వ్యతిరేకించాలి

## ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటు హక్కును రకరకాల పద్ధతుల్లో నిరాకరించడం, అర్హులైన వారి ఓట్లను తొలగించడం అన్యాయమని, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను అందరూ వ్యతిరేకించాలని టిజెఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. ఓటు హక్కును హరించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ గురువారం ఉదయం 10.30 గంటలకు నెక్లెస్ రోడ్డులోని బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు అఖిలపక్ష ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి నిర్వహిస్తున్న ఈ ర్యాలీలో పార్టీలకు, సిద్ధాంతాలకు అతీతంగా ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాణం ఉన్న ప్రతి వయోజనుడికీ ఓటు వేసే అధికారం ఉండాలన్నారు. ఓటు హక్కును రకరకాల పద్ధతులతో నిరాకరించడం అన్యాయమని, చట్టవ్యతిరేకమని మండిపడ్డారు. ఎన్నికల కమిషన్‌లో ఏకపక్షంగా ఒక సభ్యుడే నిర్ణయాలు తీసుకుంటున్నట్టు వెలుగులోనికి వచ్చిందన్నారు. ఫామ్6లో మార్పులకు సంబంధించి సుప్రీం కోర్టు కూడా స్పష్టత ఇచ్చిందని, తాము ఆ మార్పులను ఆమోదించలేదని, ఆమోదించినట్టు ఏమైనా రికార్డులు ఉంటే చూపించాలని సుప్రీం కోర్టు ప్రస్తావించిన అంశాలను కోదండరామ్ గుర్తు చేశారు. ప్రజలకు ఓటు హక్కు లేకుండా చేయడం వారి హక్కులను దెబ్బతీయడమేనని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఆర్‌టిసి ఎన్నికల్లో తెలంగాణ వర్కర్స్ యూనియన్‌కు (టిడబ్ల్యుయు) టిజెఎస్ మద్దతు ప్రకటించింది.

**టిజెఎస్‌అధ్యక్షునిగా మరోసారి ఎన్నికైన కోదండరామ్ :** టిజెఎస్ అధ్యక్షునిగా ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం టిజెఎస్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో నూతన కమిటీని ఎన్నుకున్నట్టు కోదండరామ్ వెల్లడించారు.

**నూతన కమిటీ :** టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్ రావు, సయ్యద్ బద్రుద్దీన్, అంబటి శ్రీనివాస్, కుంట్ల ధర్మార్జున్, ముక్కెర రాజు, కోశాధికారిగా పల్లె వినయ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా గోపగాని శంకర్ రావు, డోలి సత్యనారాయణ, బైరి రమేష్, మొగుడంపల్లి ఆశప్ప, నిజ్జన రమేష్ ముదిరాజ్, కంతి మోహన్ రెడ్డి,అధికార ప్రతినిధిగా సయ్యద్ సలీం పాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి.బాబన్న, ఆలూరి ప్రకాశ్ గౌడ్, బొజ్జ కనకయ్య, మల్లెల రామనాథం, కె.వి. రంగారెడ్డి, దేశపాక శ్రీనివాస్, సయ్యద్ ముజాహిద్,జాయింట్ సెక్రటరీలుగా ఆర్.లక్ష్మి, బద్రగామ అంజనేయులు; కార్యలయ కార్యదర్శిగా వి. హనుమంత్ రెడ్డిని నియమించినట్లు కోదండరామ్ ప్రకటించారు.

# కరువు ఉపశమన చర్యలు వెంటనే చేపట్టాలి

### రైతులకు పెట్టుబడి మేరకు నష్టపరిహారం ఇవ్వాలి..
### కౌలు, వ్యవసాయ కార్మికులు, వలస కార్మికులను ఆదుకోవాలి
### రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కరువు ఉపశమన చర్యలు చేపట్టాలని పలువురు మేధావులు, శాస్త్రవేత్తలు, రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఎండిపోతున్న పంటలను రక్షించేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు. కరువు నష్టపరిహారంగా వరికి ఎకరానికి రూ.30వేలు, పత్తి, మిర్చికి రూ.50వేలు, కూరగాయలు, ఇతర పంటలకు రూ.20వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా రైతులు పెట్టిన పెట్టుబడికి కనీసం నష్టపరిహారం దక్కేలా సి2+50 శాతం సూత్రాన్ని అమలు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై హైదరాబాద్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.
తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, వ్యవసాయ విశ్లేషకులు దొంతి నరసింహారెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త శరత్‌బాబు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, వివిధ రైతు సంఘాలు, రైతు కూలీ సంఘాల నేతలు కన్నెగంటి రవి, జంగారెడ్డి, బి.రాము, బిక్షపతి, నాగిరెడ్డి, కొండల్‌రెడ్డి, విజయ్, పి.ప్రసాద్, కె.వెంకటరెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా దొంతి నరసింహారెడ్డి రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రభుత్వం శాస్త్రీయంగా అంచనావేసి తాగు నీటితో పాటు అన్నిసాగునీటికి కూడ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. లేకపోతే రబీ పంట వేసే పరిస్థితిలేకపోవడంతో ఆహార పదార్థాల ధరలు మరింత పెరిగి ప్రజల జీవితాలు దుర్భలంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు.
ఎందుకంటే ఎల్‌నినో ప్రభావం కారణంగా ఇప్పటికే 36డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో ఇది సాధారణ కరువు కాదని, అప్రమత్తం కాకపోతే తీవ్ర ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. శరత్‌బాబు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాదే కాకుండ వచ్చే సంవత్సరం కూడా ప్రభావం చూపనుందన్నారు. అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా నెలకొన్న పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు కార్యచరణను ఎప్పుడో సిద్ధం చేసుకుందని చెప్పారు.
పశ్యపద్మ మాట్లాడుతూ ప్రభుత్వఅంచనా కంటే రాష్ట్రంలో కరువు పరిస్థితి మరింత అధికంగా ఉందని తక్షణమే కరువు ప్రాంతాలను ప్రకటించి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

**పలు తీర్మానాలు ఆమోదం :** రౌండ్ టేబుల్‌సమావేశం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించడంతో పాటు వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా ఒత్తిడి తేవాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా ఎల్‌నినో పరిస్థితులపై ఏర్పాటు చేసిన కమిటీ తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి కరువు పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించాలని, రాష్ట్రంలోని గ్రామపంచాయతీల ద్వారా మూడు, నాలుగు రోజుల్లోనే సర్వే వివరాలను సేకరించేలా చర్యలు తీసుకోవాలని, తాగు నీటి సమస్య పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడంతోపాటు పశువులకు మేత అందించాలని తీర్మానించారు. అదేవిధంగా కరువు ఉపశమన కార్యక్రమాలను గ్రామీణ స్థాయి నుంచే ప్రారంభించి వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులకు ఉపాధి, ఆర్థిక భద్రత కల్పించాలని, వలస వెళ్లిన కార్మికులపై కూడా సమగ్ర సర్వే నిర్వహించి వారినీ సహాయక చర్యల్లో భాగస్వాములను చేయాలని, కరువు కారణంగా గ్రామీణ జీవనోపాధులపై పడుతున్న ప్రభావాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేయడంతో పాటు రబీలో వ్యవసాయ సెలవు ప్రకటించాల్సినంత తీవ్ర కరువు నెలకొన్నందున చిన్న, సన్నకారు రైతులకు తగిన ఆర్థిక సహాయం అందించాలని తీర్మానించారు. తీవ్ర కరువు నెలకొన్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కింద 200 రోజులు పని కల్పించడంతో పాటు రోజువారి కూలీ కనీసం రూ.800 చెల్లించాలని డిమాండ్ చేశారు.

# బారికేడ్లు అడ్డుపెట్టి గొంతు నొక్కలేరు

## మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హక్కుపై లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా బారికేడ్లు అడ్డుపెట్టి గొంతులు నొక్కలేరని, ప్రజాస్వామ్యంలో ఓటు విలువను కాపాడే రాహుల్ గాంధీ పోరాటాన్ని అడ్డుకోవడం అసాధ్యమని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఓటు చోరీ ఆరోపణలపై ఎన్నికల సంఘం ప్రజల ముందుకు వచ్చి స్పష్టమైన, బహిరంగ సమాధానాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించిన రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడంపై మంగళవారం మంత్రిఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎన్నికల పారదర్శకత, ఓటర్ల జాబితాలపై వచ్చిన అభ్యంతరాలపై ఎన్నికల సంఘం నిష్పాక్షికంగా, బహిరంగంగా సమాధానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల సవరణలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించారనే ఆరోపణలను రాజకీయ విమర్శలుగా కొట్టిపారేయకుండా ఆధారాలతో పరిశీలించాలని అన్నారు. పేర్ల తొలగింపునకు కారణాలు, అనుసరించిన ప్రమాణాలు, అభ్యంతరాల పరిష్కార విధానాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించాలని కోరారు. ఒక నాయకుడిని అదుపులోకి తీసుకోవచ్చు. కోట్లాది ప్రజలకు సంబంధించిన ఓటు హక్కు ప్రశ్నను మాత్రం నిర్బంధించలేరని, పశ్నలకు సమాధానం దొరికే వరకు ప్రజాస్వామ్య చర్చ కొనసాగుతుంది అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలవాలంటే పారదర్శకత, నిష్పాక్షికత, జవాబుదారీతనం అవసరమని పేర్కొన్నారు. ఇందుకు కాంగ్రెస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.




# ఓట్ల తొలగింపు పేరుతో ప్రజాస్వామ్యం ఖూనీ

### చిక్కడపల్లి ఘటన దేశవ్యాప్తంగా జరుగుతున్న కుట్రకు నిదర్శనం :డా. కె. నారాయణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బతికున్న ఓటర్లను చనిపోయినవారిగా చూపించి ఓటర్ల జాబితా నుంచి తొలగించడం ప్రజాస్వామ్య హక్కును హరించడమేనని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. చిక్కడపల్లి ఘటన దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓట్ల తొలగింపు వ్యవహారానికి అద్దంపడుతోందని ఆయన పేర్కొన్నారు. ఓట్ల తొలగింపులో అక్రమాలకు పాల్పడిన వారిపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి ప్రాసిక్యూట్ చేయాలని డిమాండ్ చేశారు. చిక్కడపల్లిలో బూత్ లెవల్‌లో పనిచేస్తున్న బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు తమకు వ్యతిరేకంగా ఉన్న ఓటర్ల పేర్లను ఫామ్–7 ద్వారా తొలగించాలని ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు ఆరోపణలు వచ్చాయని నారాయణ పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టినప్పుడు, తొలగింపునకు సూచించిన జాబితాలోని పలువురు ఓటర్లు అక్కడే క్షేమంగా ఉన్నట్లు తేలిందని తెలిపారు. బూత్ స్థాయిలో అందిన ఫామ్–7 దరఖాస్తుల ఆధారంగా ఓటర్ల పేర్లను తొలగించే విధానం ఉంటే, దాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. చిక్కడపల్లిలో బయటపడిన వ్యవహారం ఒక్క ప్రాంతానికే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ ఘటనలతో ఎన్నికల సంఘం స్వతంత్రత, నిష్పాక్షికతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని నారాయణ అన్నారు. ఓటర్లను జాబితా నుంచి తొలగించి ఎన్నికల్లో గెలవాలనుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమ తొలగింపులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు ఓటర్ల జాబితాల సవరణ, ఫామ్–7 దరఖాస్తుల పరిశీలనలో పూర్తి పారదర్శకత పాటించాలని కోరారు.







## జైలు గోడల మధ్య చదువుల వెలుగు

### పిజి పట్టాలు అందుకున్న 10 మంది ఖైదీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేరానికి శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు చదువుతో తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటున్నారని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. జైలు జీవితం తమ విద్యాభ్యాసానికి అడ్డంకి కాదని నిరూపిస్తూ తెలంగాణ జైళ్లలో ఉన్న 10మంది ఖైదీలు పిజి కోర్సులు పూర్తి చేసి పట్టాలు అందుకున్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బిఆర్‌ఎఒయు) 27వ స్నాతకోత్సవంలో వారు తమ పిజి డిగ్రీలను స్వీకరించారు. బుధవారం జరిగిన స్నాతకోత్సవానికి తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్ శాఖ తరఫున డిఐజి డాక్టర్ డి. శ్రీనివాస్, చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ జి. ప్రమోద్ స్నాతకోత్సవానికి హాజరై డిగ్రీలు అందుకున్న ఖైదీలను అభినందించారు.



## ‘సర్’ ప్రక్రియలో విచారణలు వేగవంతంగా పూర్తి: కలెక్టర్



ప్రజాపక్షం/సంగారెడ్డి : అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ‘సర్’ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న నోటీసులు, విచారణలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంగీత , పాండుతో కలిసి ‘సర్’ 2026 ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ‘సర్’ ప్రక్రియలో అందిన ప్రతి క్లెయిమ్ అభ్యంతరాన్ని నిర్దేశిత స్టాండర్డ్ అపరేటింగ్ ప్రొసిజర్ ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.‘సర్’ ప్రక్రియలో గుర్తించిన అనామలీస్ నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు జారి చేసి వారి నుంచి అవసరమైన పత్రాలు వివరాలను స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అందిన పత్రాలు వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తదుపరి ప్రక్రియలో పొందు పరుస్తున్నట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న వారిలో అర్హత కలిగిన ఓటర్లు ఉంటే నిబంధనలకు అనుగుణంగా అవసరమైన పత్రాలను సమర్పించేలా బూత్ లెవల్ ఏజెంట్లు వారికి సహకరించే విధంగా రాజకీయ పార్టీలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎన్నికల్లో జెఎసి అభ్యర్థులను గెలిపించాలి: విలాస్




ప్రజాపక్షం/ మావల: 9న జరిగే ఆర్టీసీ ఎన్నికల్లో ఇయు, టిఎంయు, ఎన్ఎంయు, జెఎసి అభ్యర్థులను గెలిపించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విలాస్ కోరారు. భూక్తాపూర్‌లో జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ.26వేలు అమలు చేసేవరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, నాయకులు భారతల గోవర్ధన్, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాపక్షం/మనోహరాబాద్: గత రెండేళ్లుగా భార్య కాపురానికి రావట్లేదన్న దిగులుతో ఉరివేసుకున్న ఓ వ్యక్తి ఆస్పత్రిలో ప్రాణాలు విడిచాడు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన చింతల వెంకటేష్ (32) దంపతుల మధ్య విభేదాల కారణంగా భార్య గత రెండేళ్లుగా అతనికి దూరంగా ఉంటోంది. దీంతో తీవ్ర మనోవేదనకు లోనైన వెంకటేష్, గతనెల 30న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## అభివృద్ధి పనులు వేగవంతం

### అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్, వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరైన 335 గ్రామ సమాఖ్య భవనాలు, 100 జిపి భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆరోగ్య ఉప కేంద్రాల భవనాలు నిర్మించాలని సూచించారు. చేయూత పింఛన్ల కోసం వచ్చిన 9,466 దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితా రూపొందించాలని, 8,163 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ కల్పించడంతో పాటు ఇందిరమ్మ చీరల పంపిణీ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, జడ్‌పి సిఇఒ లక్ష్మీ నారాయణ, డిఇఒ సచ్చిదానంద చారి, పంచాయతీరాజ్ ఇఇ ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

## షాపింగ్ మాల్ ప్రారంభం



ప్రజాపక్షం/ మావల: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీవెంకటేశ్వర షాపింగ్ మాల్‌ను బుధవారం సినీ నటి వైష్ణవి చైతన్య, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషలతో కలిసి ప్రారంభించారు. నటీమణులు ఐశ్వర్య రాజేష్, హెబ్బా పటేల్ పాల్గొనడంతో అభిమానులతో షాపింగ్ మాల్ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ప్రజల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యమైన వస్త్రాలను అందుబాటులో ఉంచామని నిర్వాహకులు తెలిపారు.

## పల్సి గ్రామంలో చిరుత సంచారం

ప్రజాపక్షం/భైంసా : కుబీర్ మండలం పల్సి గ్రామంలో చిరుత పులి సంచారం కలకలం రేపింది.మంగళవారం రైతు తావుటి రాములు తన వ్యవసాయ క్షేత్రంలో జంతువు అడుగుజాడలను గుర్తించారు.వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు శివకుమార్,శివప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అవి చిరుత పులి అడుగులేనని నిర్ధారించారు.దీంతో గ్రామంలో భయాందోళన నెలకొంది. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,పొలాల్లోకి ఒంటరిగా వెళ్లవద్దని అధికారులు సూచించారు.

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

### మంత్రి వివేక్‌వెంకటస్వామి



ప్రజాపక్షం/ మందమర్రి : ప్రజా సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న పనులకు ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. బుధవారం మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామంలో సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని, స్థల సమస్యలను గ్రామస్తులు సమన్వయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామంలో 32 ఇందిరమ్మ ఇళ్లు, 38 కొత్త పెన్షన్లు మంజూరయ్యాయని, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. అలాగే ఎమ్మెల్యే కాలనీ నుంచి ఆర్‌కె 5 వరకు రూ. 4.85 కోట్ల వ్యయంతో 4.7 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని వివరించారు. నియోజకవర్గంలో రూ.100 కోట్ల వ్యయంతో 2,500 మంది విద్యార్థులకు వసతితో కూడిన సిబిఎస్ఇ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు చర్యలు జరుగుతున్నాయని, విదేశీ ఉద్యోగాల కోసం జర్మన్ భాషలో 70 మంది స్థానిక యువతకు శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. అనంతరం మందమర్రి పురపాలక పరిధిలోని 14వ వార్డులో రూ. 15 కోట్ల యుఐడిఎఫ్ నిధులతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అమృత్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి నల్లా కనెక్షన్లు, మురుగు కాలువల నిర్మాణ పనులను వేగవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఇ బానోత్ రాజన్న, తహసీల్దార్ సతీష్, ఎంపిడిఒ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాయలింగు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఇటీవల నస్పూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటాపూర్ గ్రామస్థులకు ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు.

## మత్తు పదార్థాల విక్రయాలపై ఉక్కుపాదం

### ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి



ప్రజాపక్షం/నిజామాబాద్ : మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై గట్టి నిఘా కొనసాగించాలని, అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఎక్సైజ్ తదితర శాఖల అధికారులతో ప్రభుత్వ సలహాదారు సమీక్ష జరిపారు. మత్తు పదార్థాల నియంత్రణకు చేపడుతున్న చర్యలపై అడిగి తెలుసుకుని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇటీవలి కాలంలో పల్లెల్లో గుడుంబా, నాటుసారా విక్రయాలు మళ్లీ మొదలైనట్లు తెలుస్తోందని ప్రజల ఆరోగ్యాలను దెబ్బ తీసే ఇలాంటి మత్తు పదార్థాల నిరోధానికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. యువతను, విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తూ వారి భవిష్యత్తును అంధకారంగా మారుస్తున్న గంజాయి విక్రయాలపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలకు 100 మీటర్ల దూరంలోగా సిగరెట్లు, గుట్కాలు, వంటి విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## నకిలీ పత్రాలతో భూమి కబ్జాకు యత్నం

### బాధితుడు కుమార్ ఆవేదన




ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : మంచిర్యాల మున్సిపాలిటీ నస్పూర్ పరిధిలోని సర్వే నంబర్ 43లో ఉన్న తమ స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు బెదిరింపులకు గురిచేస్తున్నారని బాధితుడు మాచర్ల కుమార్ తెలిపారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 44కు సంబంధించిన కాగితాలు చూపిస్తూ, సర్వే నంబర్ 43లోని తమ స్థలంపై ఇరుకుల్ల పురుషోత్తం, నల్ల సంజీవరెడ్డి, కన్నం వెంకటేశ్వరరావు హక్కులు కోరుతున్నారని పేర్కొన్నారు. గతంలో వారు తమ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టగా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కూల్చివేశారని వివరించారు. ఇప్పుడు తాము ఆ స్థలంలో పనులు ప్రారంభిస్తే ధనబలం, రౌడీయిజంతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపి, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు తనకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు.

# దశల వారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

### ఇళ్ల మంజూరులో దళారులను ఆశ్రయించవద్దు

### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



ప్రజాపక్షం/భైంసా : దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయిస్తానని, ఇళ్లు మంజూరు కానివారు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. బుధవారం భైంసా ఎంపిడిఒ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన 175 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు మండలంలో పెద్ద మొత్తంలో ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని,రెండు సంవత్సరాల్లో అర్హులందరికీ ఇళ్లు ఇస్తామని చెప్పారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో భైంసా మండలంలో తిమ్మాపూర్, హంపోలి, దేగాం గ్రామాలకు 150 వరకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయించారని, వాటి వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు.10 సంవత్సరాల్లో పాలకుల నిర్లక్ష్యం వల్ల పేదవాళ్లకు డబుల్ బెడ్రూమ్ ఇల్లు మంజూరు కాలేదన్నారు. తన హయాంలో ఇందిరమ్మ పథకం ద్వారా పెద్ద మొత్తంలో ఇళ్లు మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు ఎవరికి డబ్బులు ఇవ్వవద్దని, దళారులను ఆశ్రయించవద్దని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. పేదవాడికి ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఇస్తే, కొందరు మాయ మాటలు చెప్పి వారి దగ్గర నుండి డబ్బులు వసూలు చేయడం సరికాదన్నారు. ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దని, దళారుల బారిన పడి మోసపోవద్దన్నారు. అర్హులందరికి ఇండ్లు ఇప్పిస్తానన్నారు. నియోజకవర్గానికి పెద్ద మొత్తంలో ఇళ్లు మంజూరు చేయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, ఇంచార్జ్ మంత్రికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆనందరావు పటేల్, పిఎసిఎస్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పండిత్ రావు పటేల్,ఆయా గ్రామాల సర్పంచ్ లు,నాయకులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

### ఎమ్మెల్యే హరీష్ బాబు



ప్రజాపక్షం / కాగజ్‌నగర్ రూరల్ : రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేపట్టి అధిక లాభాలు పొందాలని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు సూచించారు. బుధవారం అరెగూడ గ్రామంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సమ్మేళనంలో ఆయన పాల్గొని ఆయిల్ పామ్ గెలల కొనుగోళ్లను ప్రారంభించారు. ఉత్తమ సాగు చేస్తున్న ఆయిల్ పామ్, అధిక సాంద్రత పత్తి రైతులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 1,750 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతోందని, ఈ ఏడాది మరో 1,000 ఎకరాల్లో విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. నాలుగో ఏడాది నుంచి ఎకరానికి రూ.లక్ష, ఎనిమిదో ఏడాది నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉన్నందున, యాసంగిలో తక్కువ నీటితో పండే మొక్కజొన్న, జొన్న, పెసర, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని కోరారు. ధాన్యం, మొక్కజొన్న, పత్తికి పూర్తి మద్దతు ధర దక్కేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య, జిల్లా వ్యవసాయ అధికారి డా. వెంకటి, ఉద్యానవన శాఖ అధికారి నదీమ్, ఎడిఎ మనోహర్, శాస్త్రవేత్త డా. మధుబాబు, రైతులు పాల్గొన్నారు.

## ‘పోలీసులు మీకోసం’ కార్యక్రమం



ప్రజాపక్షం/ మావల: పోలీసు, ప్రజల అనుబంధాన్ని పెంచేందుకు యాపల్‌గూడలో నిర్వహించిన ‘పోలీసులు మీకోసం’ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి అఖిల్ మహాజన్ పాల్గొని 30 సిసి కెమెరాలను ప్రారంభించారు. 26 జట్లతో నిర్వహించిన వాలీబాల్ పోటీలలో విజేతలుగా నిలిచిన అత్తిగుట్ట, దిమ్మ, చిచ్దరి, ఖానాపూర్ జట్లకు బహుమతులు అందజేశారు. లైబ్రరీకి రూ.20వేల విలువైన పుస్తకాలు, 10 మందికి హెల్మెట్లను పంపిణీ చేశారు. గంజాయి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని యువతకు పిలుపునిచ్చారు.

## షాపింగ్ మాల్స్‌కు టౌన్ పోలీసులు నోటీసులు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీని అదుపు చేయడం, ట్రాఫిక్ సమస్యలను నివారించడం, ప్రజల భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా నిర్మల్ టౌన్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన షాపింగ్ మాల్స్, వాణిజ్య సముదాయాల యాజమాన్యాలకు పోలీసులు బుధవారం అధికారికంగా నోటీసులు జారీ చేశారు. పట్టణంలోని పలు ప్రముఖ షాపింగ్ మాల్స్ సహా ఇతర ముఖ్య వాణిజ్య కేంద్రాల నిర్వాహకులకు ఈ నోటీసులు అందజేసినట్లు నిర్మల్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సమ్మయ్య తెలిపారు. షాపింగ్ మాల్స్ పరిసర ప్రాంతాలు, కీలక ప్రదేశాల్లో ఎల్లప్పుడూ పనిచేసే స్థితిలో ఉండే సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని పోలీసు అధికారులు ఆదేశించారు. మాల్స్‌కు వచ్చే, వెళ్లే వినియోగదారుల వాహనాల వల్ల ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు.వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించడానికి, రోడ్లపై ట్రాఫిక్‌ను అదుపు చేసేందుకు ప్రత్యేకంగా సెక్యూరిటీ గార్డులను అందుబాటులో ఉంచాలని సూచించారు. మాల్స్ ఎదుట ప్రధాన రహదారిపై వాహనాలను నిలపడం వల్ల ఇతర వాహనదారులకు, బాటసారులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.శాంతిభద్రతల పరిరక్షణ, భద్రత మరియు ట్రాఫిక్ నిర్వహణలో మాల్స్ యాజమాన్యాలు పోలీసు శాఖకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. పోలీసులు జారీ చేసిన ఈ సూచనలను షాపింగ్ మాల్స్ యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ ఇన్స్పెక్టర్ సమ్మయ్య హెచ్చరించారు. నిర్మల్ పట్టణ ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని, ప్రజలు, వ్యాపారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థి భద్రతలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

### ప్రధానోపాధ్యాయురాలిపై సస్పెన్షన్

### స్కావెంజర్‌ను విధుల నుంచి తొలగింపు



ప్రజాపక్షం/నిర్మల్ : తానూర్ మండలం బెంబర్ ప్రాథమికోన్నత పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని పాఠశాల సమయం ముగిసిన అనంతరం తరగతి గదిలోనే ఉండిపోగా, గదికి తాళం వేసిన ఘటనపై కలెక్టర్ భవేశ్ మిశ్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్నను సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నారు.అదేవిధంగా విధి నిర్వహణలో అలసత్వం వహించిన పాఠశాల స్కావెంజర్‌ను తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ బుధవారం సా యంత్రం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పాఠశాల ముగింపు సమయంలో ప్రతి విద్యార్థి సురక్షితంగా పాఠశాల నుంచి బయటకు వెళ్లాడా లేదా అనే విషయాన్ని ఉపాధ్యాయులు, సిబ్బంది తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యానికి తావు లేకుండా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల భద్రతా చర్యలను ఎంఇఒలు,ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల ప్రారంభం నుంచి ముగింపు వరకు విద్యార్థుల భద్రతకు సంబంధించి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.విద్యార్థుల రక్షణ, భద్రత విషయంలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, భవిష్యత్తులో జిల్లాలోని ఏ పాఠశాలలోనూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## రక్త హీనత తగ్గించేందుకు పోషణ్ మాసం

### ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మాధవి



ప్రజాపక్షం/మెదక్ : మహిళలు, చిన్నారుల్లో పోషక లోపాలు, రక్త హీనతను తగ్గించేందుకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్టోబరు నెలను పోషణ్ మాసంగా నిర్వహిస్తున్నామని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మాధవి అన్నారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం మెదక్ మండలం మక్త భూపతి పూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్న ప్రాసన, సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చిన రోజు నుంచి బిడ్డ పుట్టిన రెండు సంవత్సరాల వరకు వెయ్యి రోజుల పాటు పోషకాహారం తీసుకోవాలన్నారు. రక్తహీనత సమస్య, తల్లిపాల ప్రాముఖ్యత, పిల్లల బరువు, ఎదుగుదలను పరిశీలించి పరీక్షలు నిర్వహిస్తారనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పవన్, పంచాయతీ కార్యదర్శి నారాయణ, అంగన్‌వాడీ టీచర్లు మహేశ్వరి, అఖిల పాల్గొన్నారు.

# తులం బంగారం హామీ అమలు చేయాలి

### ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ప్రజాపక్షం / కెరమెరి : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన తులం బంగారం హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం కెరమెరి తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం కెసిఆర్ హయాంలో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా ఎన్నికల్లో ఇచ్చిన రూ.లక్షతో పాటు తులం బంగారం హామీని ఇప్పటివరకు నెరవేర్చలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మర్సుకొల సరస్వతి, మాజీ జడ్‌పిటిసి దుర్పత బాయి, మాజీ ఎంపిపిలు మోతిరాం, అబ్దుల్ కలాం, సర్పంచ్‌లు పెందోర్ ఆనందరావు, లచ్చు, కొద్దు, అంబరావు, బుచ్చయ్య, నాయకులు యూనుస్, నిషార్, సోము, సాకారం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాము పరిశీలన



ప్రజాపక్షం / ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిత స్పష్టం చేశారు. బుధవారం ఆమె స్థానిక ఇవిఎం గోదామును క్షేత్రస్థాయిలో పరిశీలించి, తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గోదాముకు వేసిన సీళ్లు, రికార్డులు, భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ.. ఇవిఎంల రక్షణ విషయంలో అత్యంత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గోదాము ప్రాంగణాన్ని 24 గంటల పాటు నిరంతరం సిసి కెమెరాల నిఘాలో పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. భద్రతా నిబంధనలను ఎప్పటికప్పుడు కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్యాంలాల్, సిబ్బంది ముసావీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక బహిష్కరణలపై ఫిర్యాదులు



ప్రజాపక్షం/నిజామాబాద్ : సామాజిక బహిష్కరణ ఉదంతాలపై రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాష్, బాలలక్ష్మీలతో కూడిన బృందం బుధవారం నిజామాబాద్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బాధితులతో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా సాంఘిక, కుల బహిష్కరణలకు గురైన బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కమిషన్ చైర్మన్, సభ్యులకు లిఖితపూర్వకంగా విజ్ఞాపనలు సమర్పించారు. జిల్లాలోని ఆయా ప్రాంతాలలో గ్రామాభివృద్ధి కమిటీల పేరిట కొనసాగుతున్న అరాచకాలపై సామాజిక బహిష్కరణ ఘటనలను బాధితులు కమిషన్‌కు ఏకరువు పెట్టారు. బిసి కుల సంఘాల నాయకులు, వివిధ వర్గాల వారు, ప్రజాసంఘాల ప్రతినిధులు సైతం హాజరై రాతపూర్వకంగా విజ్ఞాపనలు కమిషన్‌కు అందిస్తూ , మౌఖికంగా కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు. సాంఘిక బహిష్కరణలపై ఫిర్యాదులు సమర్పించేందుకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యం త్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

### సామాజిక బహిష్కరణలు బాధాకరం

బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలో బిసిలపై దాడుల ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. సామాజిక బహిష్కరణలు తరచూ జరగటం బాధాకరమన్నారు. గ్రామాభివృద్ధి కమిటీలకు చట్టబద్ధత లేదని, సమాజంలో వ్యక్తుల్లో మార్పులు రావల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక బహిష్కరణలు మళ్లీ మళ్లీ రిపీట్ అవ్వటం దురదృష్టకరమన్నారు. ప్రజాప్రతినిధులను కూడా బహిష్కరించటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో త్వరలో బిసి ప్రొటెక్షన్ యాక్ట్ రాబోతుందని గుర్తు చేశారు.

ప్రజాపక్షం
Telugu National Daily


## ఇవిఎం గోదాం తనిఖీ



**ప్రజావపక్షం/కరీంనగర్:** జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను బుధవారం అదనపు కలెక్టర్ (రెవిన్యూ )డి. శ్రీనివాస్ రెడ్డి రాజ కీయ పార్టీ ప్రతినిధిలతో కలిసి పరిశీలించారు.ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈవియం గదుల వివి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్ బి ఆర్ ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ బిజెపి పార్టీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిది మడుపు మోహన్ సి పి యం పార్టీ ప్రతినిధి మిలకూరి వాసుదేవారెడ్డ్, టి డి పి పార్టీ ప్రతినిధి ఎరబెల్లి రవీందర్, ఎంఐఎం పార్టీ ప్రతినిది మజీత్ హుస్సేన్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల కమిటీ ఏర్పాటులో బిజెపి సర్కారు విఫలం

● జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి ● మోదీ కనుసన్నల్లో ఎన్నికల కమిషన్

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి




**ప్రజాక్షం/రాజన్న సిరిసిల్ల :** నిష్పక్షపాతంగా వ్యవహరించే ఎన్నికల కమిటీని ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని పక్ష పాతంగా వ్యవహరించే ఎన్నికల కమిటీ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజాస్వామ్యం పరిడవిల్లుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి విమర్శించారు. బుధవారం సిరిసిల్ల సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్ దేశానికి ముగ్గురు ఎన్నికల కమీషనర్లు ఉన్నారని వారిలో ఎవరు వ్యతిరేకించిన ఆ పాలి కానీ మోదీ చెప్పిందే వింటూ జ్ఞానేశ్‌కుమార్ ఏ క ఆదిపత్యంతో వ్యవహరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని బట్టి మోదీ కనుసన్నల్లోనే ఎన్నికల కమీషన్ పని చేస్తుందని స్పష్టం అవుతుందన్నారు. ఇది ప్రజాస్వామ్యానికే పెను ప్రమాదం అని అన్నారు. తక్షణమే జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు అనేవి ప్రజాస్వామ్యానికి ఆయువు పట్టు అని ప్రజల ద్వారా ప్రజల చేత ప్రజా ప్రతినిధులు ఎన్నుకోబడతారని దీంతో ప్రభుత్వం ఏర్పడుతుందని ఎన్నికల కమీషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి కానీ ఓటర్ నమోదులోనే తప్పులు దొర్లుతున్నాయని బిజెపి అధికారంలోకి రావడానికి అనుకూలమై ఓట్లను నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ఈవిఎం లోనే అనేక తప్పులు జరుగుతున్నాయని అన్నారు. బిఎల్‌వోలు ఓటర్ దగ్గరకు వెళ్లి 6 ఏ నోటీసులు అందించాలని వారి దగ్గరికి రప్పించడం సరైన విధానం కాదని అన్నారు. ఒకే దేశం ఒకే పార్టీ అనే కుట్ర జరుగుతుందని ఓటును దొంగిలించే పనులు జరుగుతున్నాయని ఇది అధికార చోరీ అని మండిపడ్డారు. ఇలాంటి పాలన జరగకూడదని ఇండియా కూటమీ అన్ని పార్టీలు ఎన్నికల కమీషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తుందని అన్నారు. సుప్రీం కోర్టు చెప్పిన దాని ప్రకారం ప్రధానమంత్రి, ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఎన్నికల కమిటీ ద్వారా ఎన్నికలు జరగాలని ఏకపక్షంగా నియామకాలు జరగడం ద్వారా సమతుల్యం దెబ్బతింటుందని అన్నారు. ఈడీ, ఐటీ దాడులు వారి చెప్పు చేతుల్లోనే నడుస్తున్నాయని సొంత పార్టీల వారిపై దాడులు జరపకుండా ఇతర పార్టీలవారిపై దాడులు జరుపుతూ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటివి జరగకూడదంటే జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని లేదంటే ప్రభుత్వం ఆయనను భర్తరఫ్ చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. గతంలో అధికారంలో ఉన్న కేసీఆర్ ఫాంహౌస్ లో 425 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారాని ఏ విధంగా భూములు రికార్డులలో మాయమై పోతున్నాయని అన్నారు. సర్వే నంబర్ల ప్రకారం సమగ్ర భూ సర్వే జరపాలని డిమాండ్ చేశారు.సిపిఐ నాయకులు గుంటి వేణు, పంతం రవి, కడారి రాములు, అనిల్, సోమ నాగరాజు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి సంకల్ప సభ సేవా జ్యోతి కార్యక్రమం



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రధాని మోదీ జన్మ దినోత్సవము, సేవా సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలోకరీంనగర్ లో సంకల్ప సభ సేవా జ్యోతి కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.చౌరస్తా వద్ద పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక స్క్రీన్ ద్వారా దేశ ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ల సందేశాన్ని వర్చువల్ గా బీజేపీ శ్రేణులు ఆసక్తిగా వీక్షించారు. పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై ప్రధాని మోడీ చేసిన సూచనలను పార్టీ శ్రేణులు ఆలకించారు. వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు.నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి , డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కరీంనగర్ బిజెపి ఇన్చార్జి , రాష్ట్ర నాయకులు శాంతికుమార్ , మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, వివిధ మోర్చాల అధ్యక్షులు సంఘ నరేష్ , నిర్మల రెడ్డి , శ్రీనివాస్ నాయక్ , బత్తుల లక్ష్మీ నారాయణ , ఆకుల రాజేందర్ , మోతే గంగారెడ్డి లతోపాటు కార్పొరేటర్లు , జోన్, మండల అధ్యక్షులు , నాయకులు పాల్గొన్నారు.

## క్రీడలు పాఠ్యాంశ ప్రణాళికలో భాగం

ఆల్ఫోర్స్ చైర్మన్ డా.నరేందర్ రెడ్డి



**ప్రజాక్షం/కొత్తపల్లి :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని క్రీడల్లోని విషయాలను విశ్లేషించి పట్టు సాధించాలని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్జిఎఫ్ రాష్ట్రస్థాయి బాలబాలికల టెన్నిస్ పోటీలకు ఎంపికైన ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. టెన్నిస్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. ఈ క్రీడను రాయల్ గేమ్‌గా పరిగణించడం జరుగుతుందని తెలిపరాఉ ఆటలు ఆడడం ద్వారా శారీరకంగా ధృడపడుతారని ప్రత్యేకంగా ఆలోచన విధానం సైతం మారుతుందని తెలిపారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇప్పిస్తూ వివిధ టోర్నమెంట్లకు ఎంపిక చేస్తున్నామని అన్నారు. ఇటీవల పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని ఒక ప్రైవేట్ అకాడమీలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ జోనల్ స్థాయి అండర్14 బాలబాలికల టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడమే కాకుండా త్వరలో నిర్వహించబోయే ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకుసైతం అర్హతసాధించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం ఇచ్చి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపల్, వ్యాయా మ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గడువులోగా ఇంకుడు గుంతల పనులు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/పెగడపల్లి :** గ్రామాల్లో భూగర్భ జలాల పెంపునకు ఉద్దేశించిన ఇంకుడు గుంతల నిర్మాణ పనులను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని,నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గౌతమ్ రెడ్డి అధికారులను ఆదేశించారు.గ్రామ పంచాయతీల వారీగా మంజూరైన వ్యక్తిగత ఇంకు డు గుంతలు, సామూహిక ఇంకుడు గుంతలతో పాటు బోర్‌వెల్ రీఛార్జ్ పనులను అక్టోబర్ 31 లోగా వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇందుకోసం మండలానికి నిర్దేశించిన 1,200 వ్యక్తిగత ఇంకుడు గుంతల లక్ష్యాన్ని సకాలంలో చేరుకోవాలని అధికారులకు సూచించారు.ఉపాధి హామీ కూలీల **సంఖ్యను పెంచాలి:**వికిసి ఆర్‌ఎంజి జి పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కూలీకి కచ్చితంగా 125 రోజుల పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.గ్రామాల్లో కూలీల సంఖ్యను మరింత పెంచి, వారికి నిరంతరం పనులు కల్పించాలన్నారు. ఈమండల పరిషత్ అధికారి శశి కుమార్ రెడ్డి,ఏపీవో బి.అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బంది,పాల్గొన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

ఎఫ్ఆర్ఓ ఎంవి నాయక్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్క పౌరుడి సమిష్టి బాధ్యత అని మంథని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.వి. నాయక్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా అటవీ అధికారి ఆదేశాల మేరకు,బుధవారం ముత్తారం మండలం, మంథని రేంజ్ పరిధిలోని ఆదివిశ్రాంపూర్ గ్రామంలో, మంథని మరియు పెద్దపల్లి ఫారెస్ట్ రేంజ్‌లకు చెందిన అటవీ సిబ్బంది స్థానిక ముత్తారం పోలీసుల సహకారంతో సంయుక్తంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి దాడులు చేపట్టారు.ఈ తనిఖీ కార్యక్రమంలో అధికారులు 2 వేట వలలు,20 ఉచ్చులు,1 ఇనుప బోను మరియు 2 కిలోల బైండింగ్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు.అక్రమ వేట లేదా వన్యప్రాణుల వేటకు పాల్పడుతున్నట్లు గుర్తించిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.పెద్దపల్లి ఎఫ్ఆర్ఓ సతీష్ కుమార్ తో పాటు అటవీ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు పనులకు శంకుస్థాపన

**ప్రజాక్షం/చొప్పదండి :** మండలంలోని కొలిమికుంట నుంచి మల్లిఖార్జున స్వామి ఆలయం మీదుగా మల్లన్నపల్లె వరకు రూ.3.35 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం శంఖుస్థాపన చేశారు. అనంతరం కొలిమికుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు, కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ పాలన సాగిస్తుందన్నారు. చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలబెడుతానని హామి ఇచ్చారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, సింగిల్ విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ చొక్కల్ల తిరుపతి, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ పంజాల లక్ష్మ ణ్, జిల్లా గౌడ్ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ మల్లేశం, సత్తు శ్రీనివాస్, ఆకుల సురేశ్, చొక్కల్ల కనకయ్య, పట్టణశాఖ అధ్యక్షుడు సింగిల్ విండో వైస్ చైర్మన్ నిజాపురం చందు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, మున్సిపల్ పాలకవర్గం, సింగిల్ విండో పాలకవర్గం, గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు,పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు మరింత సులభం

మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి పేదవాడికి వైద్యం అందుబాటులో ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యపకేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా పల్లెల్లో వైద్య సేవలు మరింత సులభతరం అయ్యాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు సాతారం గ్రామంలో నిర్మించిన వైద్య ఆరోగ్య ఉప కేంద్రాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ నియోజకవర్గ ఇన్చార్జ్, వేలుమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వడి నర్సింగారావులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో పేద మధ్యతరగతి ప్రజలకు వైద్యం అందని పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు వైద్య ఆరోగ్య శాఖ ను ప్రభుత్వం మెరుగుపరుస్తుందని, ఉప కేంద్రాల ఏర్పాటుతో ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్ళనవసరం లేదని, ప్రాథమిక ఆరోగ్య సేవలను గ్రామస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. మహిళలు గర్భిణీలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆరోగ్య సే వలు సకాలంలో అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలనీ ఆదేశించారు. నూతనంగా ఏర్పాటైన ఉప కేంద్రాలలో సిబ్బంది అందుబాటు లో ఉండి అవసరమైన సేవలు నిరంతరాయంగా ప్రజలకు అందించేలా అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. సాతారం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు ని ధులను సమకూర్చి ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని విద్య వైద్య రంగానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత నిస్తుందని తెలిపారు.గ్రామ సర్పంచ్ పోతవేణి నారాయణ గౌడ్,ఉపసర్పంచ్ బేతి జగన్ రెడ్డి, మెట్పల్లి ఆర్డీవో నరసింహారావు



డిఎం అండ్ హెచ్ ఓ సుజాత గ్రంథాలయ చైర్మన్ దినేష్ పంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు,తదితరులు ఉన్నారు.

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఖరీఫ్–2026 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ బి శ్రీరాములు అధికారులను ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఖరీఫ్–2026 ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ధాన్యం నిల్వకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రణాళికను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని తెలిపారు.ఎఫ్ఏక్యూ నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా రైతులకు ముందుగానే సూచనలు అందించాలని తెలిపారు.రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ,పౌరసరఫరాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోళ్లకు అవసరమైన గన్నీ బ్యాగుల లభ్యతపై జిల్లా పౌరసరఫరాల శాఖ అ ధికారి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఏ కొనుగోలు కేంద్రంలోనూ అవసరమైన సామగ్రి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ఎఫ్ఏక్యూ నాణ్యత ప్రమాణాలు,పరికరాల వినియోగం అంశాలపై అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. కొనుగోళ్ల సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా పౌ రసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్,జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల, ఎస్‌డబ్ల్యూసీ రీజినల్ మేనేజర్, అధికారులు,పాల్గొన్నారు.

## హైవే బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణపై క్షేత్రస్థాయిలో పరిశీలన

అదనపు కలెక్టర్ రాజ గౌడ్



**ప్రజాపక్షం/ఎండపెల్లి :** వెల్గటూర్ మండలంలో హైవే బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి చేపట్టనున్న భూసేకరణ ప్రక్రియపై అదనపు కలెక్టర్ రాజగౌడ్,రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్,బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.హైవే బ్రిడ్జి నిర్మాణం కోసం అవసరమైన భూములను అధికారులు పరిశీలించి,భూసేకరణకు సంబంధించిన అంశాలపై రైతులతో నేరుగా మాట్లాడారు. ఆయా భూముల వివరాలు,భూసేకరణ వల్ల కలిగే ప్రభావం ,రైతుల అభిప్రాయాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు.భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని అధికారులు పేర్కొన్నారు.భూముల పరిశీలనలో భాగంగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న రికార్డులు,భూముల పరిస్థితిని పరిశీలించి, హైవే బ్రిడ్జి నిర్మాణ పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టారు.ఈ పరిశీలనలో మండల రెవెన్యూ అధికారి శేఖర్,రెవెన్యూ అధికారులు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తతే రక్షణ కవచం

కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం

**ప్రజాక్షం/కొత్తపల్లి :** సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు సరికొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని వీటిపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అదే వారికి రక్ష ణ కవచమని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సౌజన్యంతో రూపొందించిన ఆగండి.. ఆలోచించండి.. సరిచూసుకోండి... అనే ట్యాగ్ లైన్ అవగాహన పోస్టర్‌ను కరీంనగర్ పోలీస్ కమీషనర్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఆస్ట్రా కన్వేన్షన్ లో ఆవిష్కరించారు. పార్ట్ టైమ్ జాబ్ ఫ్రాడ్, వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో తక్కువ శ్రమకు ఎక్కువ డబ్బులు వస్తాయంటూ వచ్చే ఆఫర్లను నమ్మవద్దని అసలైన సంస్థలు ముందస్తుగా ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజులు అడగవన్నారు. ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, భారీ డిస్కౌంట్‌ల పేరుతో సోషల్ మీడియాలో వచ్చే నకిలీ వెబ్‌సైట్ల లింకులను నమ్మి ముందుగా డబ్బు చెల్లించి మోసపోవద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా గోల్డెన్ అవర్‌లోనే జాతీయ సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సీపీ సూచించారు. టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టౌన్ ఇన్స్పెక్టర్లు, సైబర్ విభాగం ఎస్సైలు అనూష సిబ్బంది ఎస్‌ఆర్ జూనియర్ ప్రైవేట్ కళాశాల జోనల్ ఇంచార్జి తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మికుల సిఎంపిఎఫ్ పెండింగ్ సమస్యలు పరిష్కరించారూ..

డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్‌కు అందజేసిన సీతారామయ్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణిలో పని చేస్తున్న కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గోదావరిఖని ఐ.బి. కాలనీలో ఉన్న సీఎంపీఎఫ్ ఆఫీస్ ముందు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి,కమిషనర్ గోవర్ధన్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేసినట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. సింగరేణిలో శాశ్వత కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు రిటైర్డ్ కార్మికులకు సిఎంపిఎఫ్ కు చెందిన పెండింగ్ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గత కొన్ని నెలలుగా అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వత కార్మికులు,ఉద్యోగులకు రెండు సంవత్సరాలుగా (2024–25 అండ్ 2025–26) రెగ్యులర్‌గా ఇవ్వాల్సిన సీఎంపీఎఫ్ స్లిప్పులు ఇవ్వడం లేదని ఆరోపించారు. సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా గత రెండు సంవత్సరాలుగా (2024–25 అండ్ 2025–26) సీఎంపీఎఫ్ స్లిప్పులు ఇవ్వకపోవడం తో వారు తమ నిల్వలు తెలియని పరిస్థితిలో ఉన్నారని, వెంటనే వారికి స్లిప్పులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. అంతేకాకుండా రిటైర్డ్ కార్మికులకు, ఉద్యోగులకు రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీ లు ఇవ్వకపోవడం వల్ల వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, ఆర్.పి.పి.ఓ కాపీలు లేకపోవడం వల్ల పెన్షన్ల మంజూరులో ఆలస్యం జరిగి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు మ డ్డి ఎల్లా గౌడ్, కందికట్ల వీరభద్రం, కేంద్ర కార్యదర్శులు కవ్వంపల్లి స్వామి, కందుకూరి రాజారత్నం, బ్రాంచి కార్యదర్శులు బాజిసైద, తిరుపతి, కొట్టే కిషన్ రావు, రామగుండం రీజియన్ కు చెందిన ఆఫీస్ బేరర్స్,పిట్ కార్యదర్శులు మైన్స్ సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి

రైతుసంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



**ప్రజాపక్షం/సిద్దిపేట :** రైతుల మేలు కోసం పండ్లతోటలు, కూరగాయలు సాగు ప్రోత్సహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఏ. కోదండరెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వైశ్య సంక్షేమ సంఘం భవనంలో వ్యవసాయ శాఖ వారు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో కిసాన్ మేళ 2026 ను నిర్వహించారు. రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ముఖ్యఅతిథి హాజరై కిసాన్ మేళాను ప్రారంభించి వ్యవసాయ మరియు వ్యవసాయ అనుబంధ రంగాలు , విత్తన సంస్థలు, వ్యవసాయ యాంత్రికరణ పనిముట్ల సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను రైతులతో కలిసి సందర్శించి పరిశీలించారు. రైతులకు అర్థికంగా అభివృద్ధి చేయటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఎల్ నినో ప్రకృతి వైపరీత్యం వలన వర్షా భావ పరిస్థితులు ఏర్పడ్డాయని, ఇప్పుడే ఇంత వేడి ఉంటే ఏప్రిల్ నెల వరకు విపరీతమైన వేడి ప్రభావం చూపే అవకాశం ఉన్నందున వెంటనే మెట్ట పంటలతో రబీ సాగు మొదలు పెట్టాలన్నారు. కలిసి కట్టుగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని, ప్రాంతాల వారీగా ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ లు ఏర్పాటు చెయ్యాలన్నారు. మార్కెట్‌లో న్యాయమైన ధరలు వచ్చే పంటలను రైతులకు సూచించాలనీ శాస్త్రవేత్తలకు సూచించారు. ఎల్ నినో పరిస్తితుల్లో రైతులు ప్రభుత్వానికి సహకరించి ప్రభుత్వ సూచించిన పంటలను మాత్రమే వేయాలని అన్నారు. గతంలో మెట్టపంటలు ఎక్కువ వేసేవారని, సాగునీటి వసతులు పెరగడంతో ఇప్పుడు ఎక్కువగా వరి పండిస్తున్నారు అని అన్నారు. జూన్ నుండే ఎల్ నినో పై రైతులను అప్రమత్తం చేయడం జరిగిందని, ఈ సారి యాసంగిలో వరి వేయవద్దని అన్నారు. ఈ నెల నుండే వర్షాలు పడవన్నారు. మక్కలు, జొన్నలు, శనగలు, కంది, సన్ఫవర్, ఆయిల్ ఫామ్, ఆముదాలు, జనుము పండించాలన్నారు.శాస్త్రవేత్తలు సూచనలతో కొత్త కొత్త పంటలు పండించి జిల్లా రైతులు ఆదర్శంగా నిలవాలనీ, పంట చేలలో ఫాం పాండ్స్ తవ్వుకోవాలన్నారు.వ్యవసాయ మరియు వ్యవసాయ అనుబంధ రంగాల అభ్యుదయ రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం, సిద్దిపేట డివిజన్ ఆత్మ చైర్మన్ పూజల గోపికృష్ణ, ఇతర డివిజన్లో ఆత్మ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్, పిఎసిఎస్ చైర్మన్, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్యశాఖ అధికారులు, రైతులు తదితరులుపాల్గొన్నారు.

## వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం

వైద్యులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచన

**ప్రజాక్షం/రాజన్న సిరిసిల్ల :** వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ మండలం హనుమాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతిరోజు ఓపికి ఎంతమంది వస్తారని సిబ్బందిని ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రంలో ఓపి రిజిస్టర్, ల్యాబ్ ఇమ్యూఐజేషన్ గది, ఇన్ పేషంట్ గదులు, ఇతర గదులు, ఫార్మసీ, ఆసుపత్రి ఆవరణను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఏఎన్ఎంలతో మాట్లాడి క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఏఎన్సీ రిజిస్ట్రేషన్లు, గర్భిణీల ఆరోగ్య విషయాలపై దృష్టి సారించి ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచేలా కృషి చేయాలని సూచించారు. ఎన్సీడీ స్క్రీనింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దీని ద్వారా ముందుగానే వ్యాధి లక్ష ణాలను గుర్తించి అవసరమైన చికిత్స అందించడానికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని అన్నారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రదపై వివరించాలని తెలిపారు. ప్రసవాల సంఖ్యపై ఆరా తీశారు.



## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్:** ఖమ్మం నగరంలోని మమత ఆసుపత్రి రోడ్డులో మెప్మా, ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను బుధవారం కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రారంభించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నగర ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఈ క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రేమ్ సాయి దివ్యాంగుల స్వయం సహాయక సంఘానికి చెందిన మాధురి అనే మహిళ ఈ క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ మురళీ, మెప్మా టిఎంసి సుజాత, సిఒ ద్రౌపది, ఇంజనీరింగ్ అధికారులు, పార్కు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని గొర్రెలు మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** ఖమ్మం వైరా రోడ్డు గోపాలపురం సమీపంలో లారీ ఢీకొని గొర్రెలు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... గోపాలపురం కాలువ సమీపంలో ఖమ్మం వైపు వస్తున్న లారీ రోడ్డుపై వెళ్తున్న గొర్రెల మందను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు గొర్రెలు మృతిచెందగా మూడు గొర్రెలు గాయపడ్డాయి. గొర్రెలు మృతిచెందడంతో గొర్రెల కాపర్లతో పాటు కొంత మంది స్థానికులు లారీ డ్రైవర్‌పై దాడి చేశారు. గొర్రెల కాపర్లు లక్ష రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని కోరినట్లు, దీనికి సంబంధించి గొర్రెల కాపర్లు, లారీ డ్రైవర్ ఇరువురు ఖమ్మం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

## గోదావరి పుష్కరాలు: ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు చర్యలు



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** వచ్చే ఏడాది జూన్ 26 నుండి జూలై 7వ రకు నిర్వహించనున్న గోదావరి పుష్కరాల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసిలో ఎస్‌పి రోహిత్ రాజ్‌తో కలిసి పుష్కర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుష్కరాల నోడల్ అధికారిగా భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్టను నియమించినట్లు తెలిపారు. ఘాట్ల వద్ద తాగునీరు మరుగుదొడ్లు స్నానాల గదులు పార్కింగ్ రహదారులు అత్యవసర నిష్క్రమణ మార్గాలను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. దుమ్ముగూడెం పర్ణశాల మోతెపట్టీనగర్ తదితర ప్రాంతాల్లో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణకు హోల్టింగ్ ఏరియాలు, ప్రత్యామ్నాయ మార్గాలు ముందుగానే సిద్ధం చేయాలని ఎస్‌పి రోహిత్ సూచించారు.

## సిపిఐ బలోపేతంలో ఆకుతోట వెంకయ్యది కీలకపాత్ర



**ప్రజాపక్షం/కొణిజర్ల:** తనికెళ్ల సిపిఐ బలోపేతంలో సిపిఐ సీనియర్ నాయకులు ఆకుతోట వెంకయ్యది కీలకపాత్ర అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు యర్రా బాబు అన్నారు. మండల పరిదిలోని తనికెళ్లలో సిపిఐ సీనియర్ నాయకులు ఆకుతోట వెంకయ్య 20వ వర్థంతి కార్యక్రమం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వెంకయ్య చిత్రపటానికి మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా యర్రా బాబు మాట్లాడుతు పార్టీ అభివృద్ధి, పార్టీకి ఆస్తులను కూడబెట్టటంతోపాటు గ్రామాభివృద్ధికి ఆయన ఎంతో కృషిచేశాడని కొనియాడారు. పార్టీని ఎన్నికల్లో గెలిపించేందుకు ఎంతో కృషిచేసేవాడని తెలిపారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, జిల్లా రిటైర్డ్ సొసైటీ రిజిస్ట్రార్ పెదమళ్ల సత్యం, విశ్రాంత ఉపాధ్యాయుడు లేడిబోయిన గోపాల్‌రావు, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, గడల శ్రీనివాసరావు, పెదమళ్ల రత్తమయ్య, మేకల మల్లిఖార్జున్, గడల చిన్నసూర్యనారాయణ, లేడిబోయిన సైదులు, బెజవాడ రాంబాబు, వెంకయ్య కుమారులు ఆకుతోట మంగపతిరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## పత్తి రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: కలెక్టర్ దివాకర టిఎస్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ద్వారా పత్తిని విక్రయించే రైతులు తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం తెలిపారు. నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తీసుకు వచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలన్నారు. కొనుగోళ్ల సమయంలో అన్నదాతలకు ఎలాంటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఖమ్మం, మద్దులపల్లి, మధిర, వైరా ప్రాంతాల్లోని ఎనిమిది జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు తెలిపారు. పత్తిలో ఎనిమిది నుంచి 12 శాతం లోపు తేమ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఎనిమిది శాతానికి మించితే ప్రతి అదనపు శాతానికి క్వింటాలకు రూ. 86.67 చొప్పున కోత ఉంటుందని తెలిపారు. మార్కెట్‌కు తేచ్చే ముందు తేమ శాతాన్ని పరిక్షించుకోవాలని అందు కోసం 129 రైతు వేదికల్లో తేమ శాతం యంత్రాలను అందుబాటులో ఉంచామని రైతులు వాటి ద్వారా పరీక్షించుకోవాలని సూచించారు. కౌలు రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, విక్రయ సమయంలో ఆధార్ ధృవీకరణ తప్పనిసరి అన్నారు. రైతులు కాపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సందేహాల కోసం వాట్సాప్ నెంబర్ 8897281111, టోల్ ఫ్రీ నెం. 18005995779 ను సంప్రదించాలన్నారు.

# రెండు నెలల్లో అర్హులందరికీ జిఒ 76 పట్టాలు

- ఆరు ప్రత్యేక బృందాలతో సర్వే ప్రారంభం
- అవినీతికి తావు లేకుండా చర్యలు
- ప్రజలకు సకల సౌకర్యాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నాం
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం/పాల్వంచ:**పట్టణ పరిధిలోని దీర్ఘకాలంగా పెడింగ్‌లో ఉన్న జిఓనెం 76 పట్టాల మంజూరు ప్రక్రియ వేగంగా జరుగుతోందని, రెండు నెలల్లో అర్హులందరికీ పట్టాలు అందజేస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం నగర పరిధిలోని 12,14,25,49 డివిజన్లలో రూ.169 లక్షలతో నిర్మించనున్న రోడ్లు డ్రైన్లు బతుకమ్మ ఘాట్ తదితర అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే 29వ డివిజన్‌లో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు డివిజన్‌లలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడో విడతలో భాగంగా జిఒనెం. 76 క్రింద పట్టణంలో 2241 దరఖాస్తులు అందాయని, అందులో 1420 దరఖాస్తులు విచారణ ఇప్పటికే పూర్తయిందని వెల్లడించారు. వీటిలో 150 పట్టాల పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని త్వరలో లబ్దిదారులకు అందజేస్తామని చెప్పారు. మిగిలిన 821 దరఖాస్తుల పరిశీలన కోస ం ఆరుగురు తహశిల్దార్ల నేతృత్వంలో ఆరు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి సర్వే ప్రారంభించాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారామలు, కమీషనర్ సుజాత, తహశిల్దార్ పుల్లయ్య, కార్పొరేటర్లు సుధాకర్ రాజు, బోయిన విజయ్ కుమార్, మంద నాగలక్ష్మి, వై శంకర్, స్థానిక నాయకులు కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల నరేష్, గోపికృష్ణ, గుత్తుల శ్రీనివాస్, యూసుఫ్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్రావు, భవాని ప్రసాద్, సాంబిరెడ్డి, వాడే రాములు, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

**రహదారుల ఆధునీకరణే లక్ష్యం**

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పట్టణంలో రహదారుల ఆధునీకరణను వేగవంతంగా పూర్తి చేయటమే ఎజెండాగా నిర్ధేశించుకొని పనులను పూర్తి చేస్తున్నామని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. పాల్వంచ పట్టణం నడిబొడ్డున ఉన్న ప్రధాన కూడలి అంబేద్కర్ సెంటర్ రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. దీనితో సుమారు 25 లక్షలతో రోడ్ల అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంఖుస్థాపన చేశారు.ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ గత పాలకులు ప్రజా అవసరాలను, మౌళిక సమస్యలను ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా పాలన సాగించటం వలనే ప్రధాన రహదారులు గుంతలమయమై ఇలాంటి దుస్థితి దారురించినదని విమర్శించారు.నిత్యం రద్దీగా అంబేద్కర్ సెంటర్ మార్గంలో ప్రజలు, వాహనదారులు పడుతున్న అవస్థలను గుర్తించి తక్షణమే రోడ్ల పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటి మేయర్ సిరిపురపు లలితకుమారి,కమీషనర్ కే. సుజాత, నవభారత్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, మూర్తి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పోరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, గొర్లె అన్నపూర్ణ, బండి నరసింహ, కాల్వ భాస్కర్, గుణచరిత్, బాలూనాయక్, కాంగ్రెస్ నాయకులు మహిపతి రామలింగం, టిడిపి నాయకులు కనగాల అనంతరాములు, సిపిఐ నాయకులు నిమ్మల రాంబాబు, డి. సుధాకర్, శనగారపు శ్రీనివాసరావు, గొర్లె నరేష్, నామా పండు, నునావత్ దినేష్, వాడె లక్ష్మి, వజ్జా రాజెశ్వరి, ఎండి యూసుఫ్, సత్యనారాయణచారి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సిడి వ్యాధులపై నిరంతర పర్యవేక్షణ

### కేన్సర్‌పై విస్తృత అవగాహన
### డిఎంహెచ్ఒ తుకారాం రాథోడ్

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఎన్‌సిడి వ్యాధులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, క్యాన్సర్‌పై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి తుకారాం రాథోడ్ అన్నారు. టఉపవైద్య, ఆరోగ్యశాఖ పాల్వంచ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భద్రాచలం డివిజన్‌తో పాటు అశ్వారావుపేట, గుమ్మడవల్లి, దమ్మపేట, పట్వారిగూడెం పిహెచ్‌సిల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పిలతో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లాలో అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, చికిత్స తీసుకొంటున్న రోగుల నిరంతర పర్యవేక్షణ, వ్యాధుల నియంత్రణ, క్యాన్సర్ అవగాహన, దోమల ద్వారా వ్యాప్తించే వ్యాధుల నివారణ తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌సిడి స్క్రీనింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దోమల వలన వ్యాపించే వ్యాధుల నియంత్రణ, డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు టి. ప్రతాప్, డిప్యూటి డిఎంహెచ్ఓ కొత్తగూడెం పిఓ సిహెచ్ఐ,దినేష్, పిఓ ఎన్‌సిడి బి. రాందాస్, పిఓ ఏఏఎం సంభంధిత ఎంఎల్‌హెచ్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

# దసరాకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

### ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 1642 ప్రత్యేక బస్సు సర్వీసులు ఆర్‌ఎం సరిరామ్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులు తమ సొంత ప్రాంతాలకు సురక్షితంగా చేరుకునేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్‌టిసి) ఖమ్మం రీజియన్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ బుధవారం తెలిపారు. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ ఉమ్మడి ఖమ్మం జిల్లాల మధ్య 1642 ప్రత్యేక అదనపు సర్వీసులను నడపనున్నట్లు ఆర్‌ఎం తెలిపారు. ఏర్పాట్లపై అన్ని డిపోల మేనేజర్లతో సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేసినట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మంజిల్లాకు 909 సర్వీసులు తిరుగు ప్రయాణానికి 733 సర్వీసులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల తొమ్మిది నుంచి 20 వరకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి ఖమ్మం రీజియన్‌కు వచ్చే ప్రయాణికుల కోసం 630 ముందస్తు రిజర్వేషన్ బస్సులతో కలిపి మొత్తం 909 ప్రత్యేక సర్వీసులు నడపనున్నామన్నారు. పండుగ ముగిసన తర్వాత తిరుగు ప్రయాణం కోసం ఈనెల 21 నుంచి 25 వరకు 405 రిజర్వేషన్ సర్వీసులతో మొత్తం 733 ప్రత్యేక బస్సులను కేటాయించామన్నారు. నిత్యం నడిచే 145 రెగ్యులర్ సర్వీసులకు ఇవి పూర్తిగా అదనమని తెలిపారు. ఖమ్మం డిపో నుంచి హైదరాబాద్‌కు 279, తిరుగు ప్రయాణానికి 216 మొత్తం 495, సత్తుపల్లి డిపో నుంచి హైదరాబాద్‌కు 172, తిరుగు ప్రయాణం 140 మొత్తం 293, మధిర డిపో నుంచి హైదరాబాద్‌కు 191, తిరుగు ప్రయాణం 102 మొత్తం 293, భద్రాచలం డిపో నుంచి హైదరాబాద్‌కు 114, తిరుగు ప్రయాణం 132 మొత్తం 246, కొత్తగూడెం డిపో నుంచి హైదరాబాద్‌కు 68, తిరుగు ప్రయాణం 57 మొత్తం 125, మణుగూరు డిపో నుంచి హైదరాబాద్‌కు 55, తిరుగు ప్రయాణం 50 మొత్తం 105, ఇల్లందు డిపో నుంచి హైదరాబాద్‌కు 30, తిరుగు ప్రయాణం 36 మొత్తం 66 సర్వీసులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం అక్టోబర్ తొమ్మిది నుంచి ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రద్దీకి అనుగుణంగా సర్వీసుల సంఖ్యను మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్టిసి అందిస్తున్న ఇట్టి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని సురక్షితమైన ప్రయాణానికి ఆర్టిసి బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు.

## పౌష్టికాహార లోపంతో ఆరోగ్య సమస్యలు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పోషకాహార లోపంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారిణి ప్రమీల తెలిపారు. బుధవారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం రైతు వేదిక నందు పోషణ మాసోత్సవాల్లో భాగంగా రఘునాథపాలెం క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గర్భిణీలకు సీమంతాలు నిర్వహించి చీరె సారెను అందించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పోషక ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ వేడుకల్లో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి ప్రమీల, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, సర్పంచ్ కాపా ఆదినారాయణ, ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, సిడిపివో వీరభద్రమ్మ, డాక్టర్ చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళ శిశు సంక్షేమ అధికారిణి ప్రమీల మాట్లాడుతూ గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు ఉండే తొలి వెయ్యి రోజులు ఎంతో కీలకమన్నారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల ఈ సమయంలో వేగంగా జరుగుతుందని అందుకు అనుగుణంగా సమతుల పోషకాహారం అందించాలన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన ఐరన్ కాల్షియం, విటమిన్లు, ఖనిజాలు, పీచు పదార్థాలు లభించే ఆహారాన్ని అందించాలన్నారు. తక్కువ బరువు ఉన్న చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం అందిస్తున్నామన్నారు. పిల్లలకు ఇష్టమైన రీతిలో దానిని తయారు చేసి అందించే విధానంపై తల్లులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గర్భిణీలు హిమోగ్లోబిన్ స్థాయి 10 శాతానికి పైగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే ఆహారంపై ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు పర్వీన్, వెంకటమ్మ, వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో కొత్త వెలుగులు

### పినపాక ఎమ్మెల్యే, ఎస్‌టి సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/మణుగూరు:**మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్‌లో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొని లబ్ధిదారుల కుటుంబాలను అభినందించారు. నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న కుటుంబాలతో కలిసి ఎమ్మెల్యే గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన్నీరు రతమ్మ, బెక్కం శ్రావణి, గనిబోయిన విజయ నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత గృహం లభించడం సంతోషకరమైన విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నూతన ఇంటిలో కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా అర్హులైన కుటుంబాలకు మేలు జరుగుతోందన్నారు. ముఖ్యంగా సొంత ఇంటి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు.రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార అండ్ పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో గృహ నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమాలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామని తెలిపారు. పినపాక నియోజకవర్గంలో పేదల సంక్షేమానికి, మౌలిక వసతుల అభివృద్ధికి, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా గృహప్రవేశం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని నూతన గృహాల్లో సంతోషంగా జీవించాలని లబ్ధిదారులకు ఎమ్మెల్యే సూచించారు. సుందరయ్య నగర్‌లో గృహప్రవేశం చేసుకున్న తన్నీరు రత్తమ్మ, బెక్కం శ్రావణి, గనిబోయిన విజయ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ ఏఈ, సంబంధిత అధికారులు, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సిఇసి జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించే వరకూ ఉద్యమం

### వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దేశ వ్యాప్తంగా 13 కోట్లకు పైగా ఓట్లను తొలగించి ఓటు చోరీకి పాల్పడిన ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలని లేని పక్షంలో దేశ వ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేస్తామని వామపక్ష విద్యార్థి యువజన సంఘాల నాయకులు తెలిపారు. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థులు, యువతపై పోలీసుల లాఠీ చార్జీలను ఖండిస్తూ వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఎస్‌ఆర్ అండ్‌బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్, ఎఐఎస్‌ఎఫ్‌జిల్లా కార్యదర్శి జి. మనోజ్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. ప్రవీణ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి లక్ష్మ ణ్ లు మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధమైన స్వతంత్ర సంస్థలుగా ఉండాల్సిన సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్ లను కేంద్రంలోని బిజెపి మోదీ ప్రభుత్వం జేబు సంస్థలుగా వాడుకుంటుందన్నారు. ఓటు చోరీకి పాల్పడిన ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్‌కుమార్‌ను వెంటనే తొలగించి అరెస్టు చేయాలని, లేని పక్షంలో దేశ వ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి. రాజు, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రవణ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు మేకల పవన్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా నాయకులు త్రినాథ్, సుశాంత్, శ్రీరామ్, మనోహర్, జాని, పాషా, పిడిఎస్‌యు జిల్లా నాయకులు రాము, బాలు, చరణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## ఖమ్మంలో ‘అరసం’ రాష్ట్ర 4వ మహాసభలు

### జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ



**ప్రజాపక్షం/ఖమ్మం :** అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర నాల్గవ మహాసభలను నవంబర్ మాసంలో ఖమ్మంలో నిర్వహించనున్నట్లు అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ తెలిపారు. బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో అరసం రాష్ట్ర మహాసభల సన్నాహాక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేల్పుల నారాయణ మాట్లాడుతూ ప్రస్తుత సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అభ్యుదయ రచనల అవసరం పెరిగిందన్నారు. ఈ సమాజాన్ని నడిపించగలిగే శక్తి , ఆలోచింపజేసే శక్తి సాహిత్యానికి ఉందన్నారు. ఖమ్మం నగరం చైతన్యానికి కాణాచిగా నిలిచిందని ఇక్కడ మహాసభలను నిర్వహించడం గొప్ప సంతృప్తిని ఇస్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అరసం రాష్ట్ర అధ్యక్షులు పల్లెరు వీరస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, ఖమ్మంజిల్లా అధ్యక్ష, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు కావాలి

### ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**త్వరలో జరగనున్న ఖమ్మం–నల్గొండ–వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరును గుర్తించి ఓటు నమోదు చేయించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. ఓటు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ అని ఆయన తెలిపారు. పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్‌లో బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సత్తుపల్లి మండల, పట్టణ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సండ్ర వెంకట వీరయ్య పార్టీ శ్రేణులకు ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వైద్యులు, జర్నలిస్టులు తదితర అర్హులైన గ్రాడ్యుయేట్ ఓటర్లను గుర్తించి, వారిని వ్యక్తిగతంగా కలిసి ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు పూర్తయ్యే వరకు ఇంటింటికీ వెళ్లి కార్యక్రమాన్ని కొనసాగించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు...**

ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, ముఖ్యంగా యువత, నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంద న్నారు. బొగ్గు వ్యవహారంలో భారీ అక్రమాలు జరిగాయని, వాటిపై ప్రశ్నించే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అక్రమ అరెస్టులతో గొంతు నొక్కుతున్నారని విమర్శించారు. గతంలో ముఖ్యమంత్రి సభ అంటే వరాల ప్రకటనలు ఉండేవని, ప్రస్తుతం ముఖ్యమంత్రి సభలు కేసీఆర్, కేటీఆర్‌లను విమర్శించేందుకే పరిమితమవుతున్నాయని సండ్ర ఎద్దేవా చేశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్, కౌన్సిలర్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్ బెల్లంకొండ రాము, సీనియర్ నాయకులు దొడ్డా శంకర్‌రావు, కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కూసంపూడి రామారావు, మల్లూరి అంకమరాజు, బొడ్డు శివబాబు, షేక్ అయూబ్‌పాషా, వల్లభనేని పవన్, వేదుళ్ల నాగు, మోదుగు పుల్లారావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్, ప్రియాంకపై ఎఫ్ఐఆర్

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈనెల 6న ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి)కి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిర్వహించిన ర్యాలీ సందర్భంగా, కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, వారి మద్దతుదారులు ఆకాశవాణి భవన్‌లోకి బలవంతంగా ప్రవేశించారన్న ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని అధికారులు బుధవారం తెలిపారు. అనుమతి లేకుండా కాంగ్రెస్ నేతలతో పాటు ఇతర ఎంపిలు ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి ప్రవేశించారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీసు అధికారులు చెప్పారు. మంగళవారం, ఎన్నికల సంఘం కార్యాలయం వైపుగా ఇండియా కూటమి చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో, ఆకాశవాణి భవన్‌లో ఎనిమిది గంటలకు పైగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా 260 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఈ ఇద్దరు కాంగ్రెస్ నాయకులు కూడా ఉన్నారు.
ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల సంఘం పనితీరులో జరిగిన అవకతవకలకు, ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా ప్రతిపక్ష ఎంపిలు 'ఓటు దొంగతనం' అంశాన్ని లేవనెత్తుతూ నిరసన తెలిపారు. ఢిల్లీ పోలీసుల ప్రకారం, ఇండియా కూటమి పార్టీలు మంగళవారం పార్లమెంట్ భవనం నుండి ఎన్నికల సంఘం వరకు పాదయాత్ర చేయడానికి ప్రణాళిక వేశాయి. ఈ పాదయాత్రకు అనుమతి కోరుతూ న్యూఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయానికి ఎలాంటి దరఖాస్తు సమర్పించలేదని, అనుమతి కూడా మంజూరు కాలేదని పోలీసులు తెలిపారు.

# సుదీర్ఘ పోరాటానికి సిద్ధంకండి

- ఈ ఆందోళన అంత సులభం కాదు
- ప్రతి ఒక్కరూ చేరండి, ఢిల్లీకి తరలిరండి
- సిజెపి, విద్యార్థి సంఘాల నేతల పిలుపు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిజెపి అధికార ప్రతినిధి సౌరభ్ దాస్, పక్కన ఎఐఎస్ఎఫ్ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్, అసోసియేషన్ ఆఫ్ స్టూడెంట్స్ ఫర్ ఆల్టర్నేటివ్ పాలిటిక్స్ కో– ఆర్డినేటర్ ఈష్నా గుప్తా, ఐసా ప్రధాన కార్యదర్శి నేహా బోరా, మరో వైపు సిజెపి ప్రతినిధి రత్నా సింగ్, ఎస్ఎఫ్ఐ ఆదర్శ్ సాజీ

**న్యూఢిల్లీ :** ఎన్నికల వ్యవస్థను సమూలంగా మార్చేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) స్పష్టం చేసింది. ఈనెల 10న జంతర్ మంతర్ 2.0 నిరసనకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే నిరసనకు ముందు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఐక్య సమీకరణకు సిజెపి, విద్యార్థి సంఘాలు బుధవారం పిలుపునిచ్చాయి. బుధవారం ఢిల్లీలో జరిగిన ఒక సంయుక్త పత్రికా సమావేశం సిజెపి, విద్యార్థి నేతలు మాట్లాడారు. ప్రతిపక్ష ఇండియా బ్లాక్ ఎంపిలు ఈనెల 6న తలపెట్టిన నిరసన ప్రదర్శనకు మద్దతు తెలుపుతూ, ఈ ఘర్షణను ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ప్రజలకు, బిజెపికి మధ్య జరుగుతున్నదిగా అభివర్ణించారు. పత్రికా సమావేశంలో సిజెపి అధికార ప్రతినిధి సౌరభ్ దాస్, పక్కన ఎఐఎస్ఎఫ్ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్, అసోసియేషన్ ఆఫ్ స్టూడెంట్స్ ఫర్ ఆల్టర్నేటివ్ పాలిటిక్స్ కో– ఆర్డినేటర్ ఈష్నా గుప్తా, ఐసా ప్రధాన కార్యదర్శి నేహా బోరా, మరో వైపు సిజెపి ప్రతినిధి రత్నా సింగ్, ఎస్ఎఫ్ఐ ఆదర్శ్ సాజీ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలు ఢిల్లీకి తరలివచ్చి, సుదీర్ఘ ఆందోళనకు సిద్ధంగా కావాలని సిజెపి సహకన్వీనర్ సౌరవ్ దాస్ పిలుపునిచ్చారు. ఈ పోరాటం సులభం కాదు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరూ మాతో చేరాలని, రైలు, విమాన టిక్కెట్లు బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉన్నందున, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసినా నిరసనకారులు వెనకడుగు వేయరని దాస్ అన్నారు. బిజెపి ప్రతిఘటన 'శాశ్వత అధికారంపై దురాశ'ను ప్రతిబింబిస్తోందని ఆయన ఆరోపించారు. దాస్ పేర్కొన్న డిమాండ్లలో కుమార్ రాజీనామా, ఆయనపై క్రిమినల్ విచారణ ప్రారంభించడం; ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణను నిలిపివేయడం, రానున్న ఎన్నికలను ఆపడం, జనవరి 2025 ఓటర్ల జాబితాను పునరుద్ధరించి స్వతంత్ర విచారణకు ఆదేశించడం; స్వతంత్ర, విశ్వసనీయమైన ఎంపిక ప్రక్రియను ఏర్పాటు చేయడానికి ఇసి నియామకాలకు సంబంధించిన 2023 చట్టాన్ని రద్దు చేయడం వంటివి ఉన్నాయి. విద్యార్థుల నేతృత్వంలోని ఉద్యమానికీ, ప్రతిపక్ష పార్టీల నిరసనలకీ మధ్య ఎలాంటి విభేదం లేదని ఐసా అధ్యక్షురాలు నేహా బోరా అన్నారు. సామాన్య ప్రజలు, పౌర సమాజం, ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాలు ఒక వైపు ఉంటే, ఇసి, బిజెపి మరోవైపు ఉన్నాయని ఆమె అన్నారు. 'ఎలాంటి విభేదాలు లేవు. మనం, భారత ప్రజలం, బిజెపికి వ్యతిరేకంగా ఉన్నాం. ఈ పోరాటాన్ని మనం ఐక్యంగా నడిపిస్తే, దానిని సమర్థవంతంగా చేయగలం' అని బోరా అన్నారు. ప్రజల సమస్యలను లేవనెత్తడానికి, వారి హక్కులను కాపాడటానికి ఎన్నికైన ప్రతినిధులు వీధుల్లోకి రావాల్సిన బాధ్యత వారిపై ఉందని ఆమె అన్నారు. బిజెపిని వీడేందుకు ఇదే సరైన సమయమని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుకుంటున్న ప్రజలతో కలవాలని బిజెపి కూటమిలోని నేతలకు ఆమె పిలుపునిచ్చారు. విఫలమైన వ్యవస్థను మార్చేందుకు జరుగుతున్న ఈ బృహత్ పోరాటంలో, రాజకీయ అనుబంధాలు, సిద్ధాంతాలకు అతీతంగా పాల్గొనేవారంతా ఐక్యంగా ఉన్నారని దాస్ అన్నారు. నిరసనకు నిర్వాహకులు అనుమతి తీసుకుంటారా అని అడగ్గా, తాము బుధవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా సమాచారం ఇచ్చి, హామీ పత్రాలు సమర్పించామని దాస్ చెప్పారు.

## రసాయన శాస్త్రంలో హెన్రీ కాగన్, కెన్సో సోయికి నోబెల్ బహుమతి



**న్యూఢిల్లీ :** రసాయన శాస్త్రంలో ప్రతిష్టాత్మక నోబెల్ పురస్కారాన్ని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. ఫ్రాన్స్‌కు చెందిన హెన్రీ బి. కాగన్, జపాన్‌కు చెందిన కేన్సో సోయ్‌లు ఉమ్మడిగా ఈ ఏడాది నోబెల్ పురస్కారానికి ఎంపికయ్యారు. అసిమెట్రిక్ ఆర్గానిక్ సింథసిస్ ప్రక్రియలో నాన్‌లీనియర్ ఎఫెక్ట్స్ ఆటోక్యాటాలసిస్‌లను ఆవిష్కరించినందుకు గానూ వీరికి ఈ అత్యున్నత గౌరవం దక్కింది. ఈ ఆవిష్కరణలు ముఖ్యంగా ఔషధాల తయారీ రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీశాయి. ఈ పురస్కారం కింద విజేతలకు సుమారు 1.2 మిలియన్ అమెరికన్ డాలర్లు దక్కనున్నాయి. రసాయన చర్యల్లో అణువుల నిర్మాణం, ప్రవర్తనను నియంత్రించడంలో వీరు చేసిన ఆవిష్కరణలు కెమిస్ట్రీ విభాగంలో దశాబ్దాలుగా ఉన్న చిక్కుముడిని విప్పాయి. మనం ఉపయోగించే మందుల్లో ఉండే అణువుల అమరికను అత్యంత కచ్చితత్వంతో రూపొందించేందుకు వీరి పరిశోధనలు దోహదపడ్డాయి. సాధారణంగా రసాయన చర్యల్లో రెండు రకాల ప్రతిబింబ అణువులు ఏర్పడతాయి. అయితే అందులో మనకు కావలసిన ఏకైక నిర్దిష్టమైన అణువును మాత్రమే అధిక పరిమాణంలో ఉత్పత్తి చేసే వినూత్న పద్ధతులను కాగన్, సోయ్‌లు కనుగొన్నారు. ఇది ప్రాణరక్షక ఔషధాల తయారీకి అత్యంత కీలకమైన పునాదిగా మారింది. 'హెన్రీ కాగన్, కెన్సో సోయ్ ఒక శతాబ్దానికి పైగా ఉన్న రసాయన రహస్యానికి ఒక పరిష్కారాన్ని అందించారు. హోమోచిరాలిటీ దానంతట అదే ఎలా ఉద్భవిస్తుంది అనే విషయంపై వారు అభివృద్ధి చేసిన రసాయన చర్యలు అద్భుతమైనవి' అని రసాయన శాస్త్ర నోబెల్ కమిటీ చైర్మన్ హైనర్ లింకే చెప్పినట్లు ఆ ప్రకటన పేర్కొంది. హెన్రీ కాగన్ 1930లో ఫ్రాన్స్‌లోని బౌలోన్‌బిల్లాన్‌కోర్ట్‌లో జన్మించారు. 1960లో ఫ్రాన్స్‌లోని కాలేజ్ డి ఫ్రాన్స్‌లో తన పీహెచ్‌డీని పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన ఫ్రాన్స్‌లోని యూనివర్శిటీ పారిస్‌సుడ్‌లో ప్రొఫెసర్‌గా ఉన్నారు. మరో శాస్త్రవేత్త కెన్సో సోయ్ 1950లో జపాన్‌లోని హిరోషిమాలో జన్మించారు. 1979లో జపాన్‌లోని టోక్యో విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్‌డిని పొందారు. ఆయన జపాన్‌లోని టోక్యో యూనివర్శిటీ ఆఫ్ సైన్స్‌లో ప్రొఫెసర్‌గా ఉన్నారు. రసాయన శాస్త్రంలో 1901 నుంచి 2025 వరకు 117 సార్లు నోబెల్‌ను ప్రకటించగా, 198 మంది దీనిని అందుకున్నారు. 35 ఏళ్ల వయసులో నోబెల్ అందుకున్న ఫ్రెడెరిక్ జొలియట్ అతిపిన్న వయస్కుడిగా నిలవగా, జాన్.బి గూడ్‌ఎనఫ్ 97 ఏళ్ల వయసులో కెమిస్ట్రీలో పురస్కారం అందుకున్న వ్యక్తిగా ఘనత సాధించారు. ఇక ఫ్రెడెరిక్ సాంగెర్, బ్యారీ షార్ప్‌లెస్‌లు రసాయన శాస్త్రంలో రెండుసార్లు నోబెల్ అందుకున్న శాస్త్రవేత్తలుగా రికార్డు సృష్టించారు.

# ప్రత్యర్థుల విమర్శలే నా బలం

### 25 ఏళ్ల ప్రయాణంపై మోదీ వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ:** ముఖ్యమంత్రిగా, ప్రధానిగా 25 ఏళ్ల అధికార ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న నరేంద్రమోదీ... బిజెపి శ్రేణుల్లో కొత్త ఉత్తేజం నింపే ప్రయత్నం చేశారు. దేశీయంగా, అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతోన్న తరుణంలో మనం చేయగలం అనే కొత్త నినాదం ఇచ్చారు. ఢిల్లీలో ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప్ సభలో బుధవారం ప్రధాని మాట్లాడారు. తన భవిష్యత్తు గురించి ఎప్పుడూ ఆలోచించలేదని, ప్రజల ఆశీర్వాద బలమే తనను ఇంత కాలం నడిపించిందని మోదీ చెప్పుకున్నారు. గుజరాత్ సీఎంగా ప్రమాణం చేసినప్పుడు ఇంతగా ఆలోచించలేదని, 25 ఏళ్లుగా నిరంతర ప్రజాసేవ అందిస్తానని నాడు ఊహించలేదని చెప్పారు. ఆశీస్సులు అందించిన దేశ ప్రజలందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని, తనను ఇంతగా ఆదరిస్తోన్న ప్రజలను ఎన్నటికీ మర్చిపోలేనన్నారు. ప్రజలు, భగవంతుడి ఆశీస్సులతో దేశానికి మరింత సేవ చేస్తానని, ప్రజాసేవలో ఏనాడూ వెనుదిరగనని మోదీ అన్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎంతోమంది తనకు మద్దతుగా నిలిచారని, ప్రజా సేవలో ఉన్నప్పుడు విమర్శలు వస్తూనే ఉంటాయని, వాటిని పట్టించుకుంటే ముందుకు వెళ్లలేమన్నారు. వ్యక్తిగతంగా తనను విమర్శిస్తే అది వారి విజ్ఞతకే వదిలేస్తానని, తనను రాజకీయంగా బలోపేతం చేసేది ప్రత్యర్థులేనని చెప్పుకున్నారు. వికసిత్ భారత్ గురించి మోదీ ప్రస్తావించారు. '2047 నాటికి వికసిత్ భారత్ సాధించి తీరుతాం. ఆత్మనిర్భర్ భారత్, గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ సాధ్యమే. అంతరిక్షంలో అడుగుపెట్టడం, ఒలింపిక్స్ నిర్వహణ... ఇలాంటివన్నీ సాధ్యమే. ప్రపంచమంతా ఇప్పుడు భారత్ వైపు చూస్తోంది. దేశాభివృద్ధికి ఇదే మంచి సమయం. నూతన చరిత్ర లిఖించే సమయం ఆసన్నమైంది. అన్ని రంగాల్లో నూతన ఆవిష్కరణలకు ఇదే సమయం. సమస్యలు ఉంటే... పరిష్కారం కూడా దాని వెంటే ఉంటుంది. సంకల్ప బలం ఉంటే దేనినైనా సాధించవచ్చు. 25 ఏళ్లు అంటే ఒక విజయంగానే కాదు... సేవగానూ భావిస్తాను' అని మోదీ అన్నారు. అడవుల్లో గిరిజన సమాజాలకు సేవ చేయడంలో తన సమయాన్ని గడిపానన్నారు. ఒకప్పుడు ఉగ్రవాదం అత్యంత ప్రమాదంగా పరిణమించిందని, ప్రజలు ఆందోళనతో జీవనం సాగించారన్నారు. గత ప్రభుత్వాలు ఉగ్రవాదంపై మెతకవైఖరి ప్రదర్శించాయని, దేశ భద్రతకు ముప్పు వస్తే... ప్రతిఘటన ఎలా ఉంటుందో తాము చూపించామని చెప్పుకొచ్చారు.

# అలీగఢ్ ముస్లిం 'వర్సిటీ'లో ఉద్రిక్తం



**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో... అలీగఢ్ ముస్లిం నివర్సిటీ (ఏంఎ)లో మంగళవారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. 15 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న ఒక విద్యార్థిని ఆసుపత్రికి తరలించేందుకు నివర్సిటీ అధికారులు ప్రయత్నించగా... ఇతర విద్యార్థులు అడ్డుకున్నారు. దీంతో వర్సిటీ అధికారులకు, విద్యార్థులకు మధ్య ఘర్షణ తలెత్తింది. ఏఎంలో ఎనిమిదేళ్లుగా విద్యార్థి సంఘం ఎన్నికలు జరగలేదు. దీంతో ఈసారి విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌తో కొద్ది రోజులుగా విద్యార్థులు నిరాహార దీక్ష చేస్తున్నారు. వీరిలో యాసర్ ఫహాద్ అనే విద్యార్థి ఆరోగ్యం క్షీణించింది. దీంతో అతడిని ఆసుపత్రికి తరలించాలని నివర్సిటీ అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం కొందరు సెక్యూరిటీ సిబ్బందితో పాటు నిరసన ప్రదేశానికి చేరుకున్నారు. విద్యార్థిని ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్సు ఏర్పాటు చేశారు. నిరసన ప్రదేశం నుంచి యాసర్‌ను తరలించేందుకు అధికారులు ప్రయత్నించగా విద్యార్థులు అడ్డుకున్నారు. చివరకు ఏమీ చేయలేక సెక్యూరిటీ సిబ్బంది, నివర్సిటీ అధికారులు వెనుదిరిగారు అని నివర్సిటీ బుధవారం వెల్లడించింది. విద్యార్థుల నిరాహార దీక్షను అడ్డుకోవాలని అనేది తమ ఉద్దేశం కాదని, కానీ, దీక్ష చేస్తున్న విద్యార్థికి అత్యవసర వైద్యం అవసరం అని అధికారులు అన్నారు. అందువల్లే అతడిని ఆసుపత్రికి తరలించాలనుకున్నట్లు చెప్పారు. అతడి ఆరోగ్య స్థితిని దష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆసుపత్రిలో యాసర్ కోలుకున్న తర్వాత అతడిని తిరిగి దీక్షాస్థలం వద్దకు తీసుకొస్తామని హామీ కూడా ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ విద్యార్థులు స్పందించలేదన్నారు. మరోవైపు నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థుల ఆరోగ్యం క్షీణిస్తోందని, అందువల్ల వెంటనే విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణకు తేదీలు ప్రకటించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అప్పుడే దీక్ష విరమిస్తామని విద్యార్థులు చెబుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు టెన్నిస్ క్రీడాకారులు మృతి

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ జిల్లా సుఖ్‌బదేరిలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పుర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై టెన్నిస్ క్రీడాకారులతో వెళ్తున్న కారు ఓ ట్రక్కును వెనుక నుంచి ఢీకొనడంతో ముగ్గురు టెన్నిస్ క్రీడాకారులు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం... ఆరుగురు టెన్నిస్ క్రీడాకారులు లక్నోలో జరిగిన ఓ క్రీడా కార్యక్రమంలో పాల్గొని తిరిగి దేవరియాకు వెళ్తున్నారు. ప్రయాణిస్తున్న కారు అతివేగంగా ట్రక్కును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో అందులోని వారంతా కారులోనే చిక్కుకోని పోగా పోలీసులు స్థానికుల కారు తలుపులు పగులగొట్టి వారిని బయటకు తీశారు. అనంతరం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ముగ్గురు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతులు దేవరియాకు చెందిన నిత్య, ప్రజాపతి (22), ఇర్ఫాన్ అన్సారీ (20), బీహార్‌లోని భాగల్‌పూర్‌కు చెందిన అనికేత్ (24)గా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో ఆనంద్ యాదవ్ (23), రాజు (22), పశ్చిమ బెంగాల్‌లోని బీర్భూమ్‌కు చెందిన జయంతో శర్మ (30) గాయపడ్డారు. మెరుగైన చికిత్స కోసం అయోధ్య మెడికల్ కాలేజీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో కారు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సిమ్లాలో లోక్‌భవన్ ముట్టడి

### రాహుల్ నిర్బంధంపై కాంగ్రెస్ ఆందోళన



**సిమ్లా:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు నేతత్వంలో బుధవారం సిమ్లాలోని లోక్‌భవన్‌ను ముట్టడించింది. ఉప ముఖ్యమంత్రి ముఖేశ్ అగ్నిహోత్రి, పీసీసీ అధ్యక్షుడు వినయ్ కుమార్, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు ఆందోళనలో పాల్గొన్నారు. రాహుల్‌గాంధీ సుమారు 300 మంది ఎంపీలతో కలిసి ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు, 'ఓట్ల చోరీ'కి వ్యతిరేకంగా మార్చ్ చేపట్టారని సీఎం సుఖు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు రాహుల్‌ను బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారని ఆరోపించారు. ప్రజాస్వామ్య స్వరాలను అణచివేసేందుకు బిజెపి నేతత్వంలోని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

**13 కోట్ల మంది ఓటర్ల హక్కులకు భంగం**

ప్రస్తుత ఎన్నికల సంఘం వ్యవహారశైలితో 13 కోట్ల మంది ఓటర్లు తమ హక్కులను కోల్పోయారని ఉప ముఖ్యమంత్రి అగ్నిహోత్రి పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలపై ప్రశ్నించినందుకే రాహుల్‌ను నిర్బంధించారన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు కాంగ్రెస్ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సిమ్లాలోని రాజ్‌భవన్, లోక్‌భవన్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన నిర్వహించి గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించాయి. 'ఓట్ల చోరీ'ను అడ్డుకోవడంతోపాటు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు అగ్నిహోత్రి తెలిపారు.

## వాళ్లు సంఘ విద్రోహులు కాదు: బాంబే హైకోర్టు

**ముంబై:** మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపిఎస్‌సి) పరీక్షల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై నిరసన తెలుపుతున్న విద్యార్థులు సంఘవిద్రోహ శక్తులేమీ కాదని బాంబే హైకోర్టు పేర్కొంది. ఉద్యోగ నియామక పరీక్షలు నిష్పక్షపాతంగా నిర్వహించేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేసింది. పరీక్షలపై ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో విశ్వాసం పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కషి చేయాలని సూచించింది. ఎంపీఎస్‌సీ పరీక్షల్లో అవకతవకలపై పూణెలో విద్యార్థులు చేపట్టిన నిరసనలకు వ్యతిరేకంగా స్థానికులు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. 'పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయని విద్యార్థులు భావిస్తే... వారికి ఆందోళన చేసే హక్కు ఉంటుంది. ఎందుకంటే వారు సన్నద్ధత కోసం ఎంతో సమయం వెచ్చించి ఉంటారు' అని సీజే జస్టిస్ మహేశ్ చంద్ర త్రిపాఠి, జస్టిస్ అద్వైత్ సేథ్నా ధర్మాసనం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ఆందోళనలపై అధికారులు సంయమనం పాటిస్తున్నారని, నిరసనకారులపై ఎటువంటి కేసులూ నమోదు చేయలేదని తెలిపారు. వారు లేవనెత్తిన డిమాండ్లలో చాలా వరకు ప్రభుత్వం నెరవేర్చిందని, ఎంపీఎస్‌సీ చైర్మన్ రాజీనామా అంశం గవర్నర్ పరిశీలనకు పంపినట్లు చెప్పారు. కేసులు నమోదు చేయలేదనే విషయాన్ని హైకోర్టు అభినందిస్తూనే... 'వారు విద్యార్థులు... సంఘవిద్రోహ శక్తులు కాదు' అని వ్యాఖ్యానించింది. ఈ అంశం కోర్టు పరిశీలనలో ఉన్నందున విద్యార్థులు కూడా తమ చదువులపై దష్టి సారించాలని సూచించింది. తదుపరి విచారణను నవంబరు 25కు వాయిదా వేసింది.

## 30 రోజుల్లో స్పందించాలి

### లేదంటే యూపీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమిస్తాం: ఎఐకెఎస్

### లక్నోలో రైతుల మార్చ్... 500 మంది అరెస్టు

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లో రైతాంగం కదం తొక్కింది. అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్వర్యంలో చార్బాగ్ రైల్వే స్టేషన్ నుంచి సచివాలయం వైపుకు 3,000 మందికి పైగా రైతులు, కార్మికులు మార్చ్ నిర్వహించారు. అయితే రైల్వే స్టేషన్ చౌక్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. 500 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఏఐకేఎస్ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్, ఏఐకేఎస్ యూపీ ప్రధాన కార్యదర్శి రాజేంద్ర యాదవ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అరెస్టులతో సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేసింది. తమ డిమాండ్లపై 30 రోజుల్లోగా ప్రభుత్వం లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉత్తరప్రదేశ్ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఢిల్లీ వరకు ఉద్యమాన్ని విస్తరిస్తామని కూడా ఏఐకేఎస్ ప్రకటించింది. ఈనెల 15లోగా కరవును ప్రకటించి, పంట నష్టానికి హెక్టారుకు రూ.50,000 పరిహారం ఇవ్వాలని కూడా డిమాండ్ చేసింది. కాగా అరెస్టుకు గురైన వారిలో రాజన్ క్షీరసాగర్‌తో పాటు ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, జాతీయ కార్యదర్శి కేడీ సింగ్, కోశాధికారి ఛితర్ సింగ్, ఉత్తరప్రదేశ్ కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షుడు ఇంతియాజ్ బేగ్, ప్రధాన కార్యదర్శి, రాజేంద్ర యాదవ్ తదితరులు ఉన్నట్లు ప్రకటన పేర్కొంది. మార్చ్‌ను అడ్డుకునేందుకు పోలీసులు ముందుగానే అయోధ్యలో అశోక్ తివారీతో పాటు కొందరు నాయకులను అరెస్టు చేశారని తెలిపింది. సోన్‌భద్ర జిల్లాలోనూ ముందస్తు అరెస్టులు జరిగినట్లు పేర్కొంది.మార్చ్‌ను అడ్డుకున్న సమయంలో రైతులకు పోలీసుల మధ్య తోపులాట జరిగింది. యోగి ప్రభుత్వ చర్యలను ఏఐకేఎస్ నాయకత్వం ఖండించింది.

# ఎరుపెక్కిన మిడ్నాపూర్

### సిపిఐ కార్యాలయంపై దాడికి నిరసనగా ర్యాలీసభ • దోషుల అరెస్టుకు వామపక్షాల డిమాండ్

**మిడ్నాపూర్:** ఆర్ఎస్ఎస్ బిజెపి గూండాయిజాన్ని సహించేది లేదని వామపక్షాలు స్పష్టం చేశాయి. సిపిఐ సహా వామపక్షాల కార్యాలయాలపై దాడులను తీవ్రంగా ఖండించాయి. కమ్యూనిస్టులపై తప్పుడు కేసులు బనాయించడాన్ని ఆక్షేపించాయి. దాడులకు బాధ్యులైన వారి అరెస్టులకు డిమాండ్ చేశాయి. పోలీసుల వైఫల్యాన్ని దుయ్యబట్టాయి. సిపిఐ మిడ్నాపూర్ కార్యాలయంపై ఆర్ఎస్ఎస్‌భజరంగ్ దళ్ దాడికి నిరసనగా వామపక్షాల అధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ, సభ జరిగాయి. సిపిఐ నాయకుడు సైకత్ గిరి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మినాక్షి ముఖర్జీతో పాటు అనేకమంది నాయకులు ప్రసంగించారు. మిడ్నాపూర్‌లోని సిపిఐ కార్యాలయంపై ఆర్ఎస్ఎస్‌భబజరంగ్‌దళ్ దాడిని ఖండించారు. ఎన్నికల సంఘంలో అక్రమాలు జరుగుతున్నాయని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ హింసకు వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. సువేందు అధికారి హయాంలో బెంగాల్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించినట్లు విమర్శించారు. ఎన్నికల ప్రక్రియలో మరింత జవాబుదారీతనం, పారదర్శకత కోసం నాయకులు డిమాండ్ చేశారు.




**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**

| NIT No. | పని పేరు | అంచనా విలువ | ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | ఇఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 30/DB/ EE-II/ Bowenpally Circle/ MMC/ 2026-27, Dt: 06.10. 2026 | 1. మొండా మార్కెట్ వార్డ్ 196 పరిధిలో సంగీత్ జంక్షన్ నుండి ఇస్కాన్ ఆలయం వైపు డివైడర్ మార్పు మరియు డివైడర్ రెయిలింగ్ నిర్మాణం - 1 పని. 2. మొండా మార్కెట్ వార్డ్ 196 పరిధిలో డివైడర్ రెయిలింగ్ నిర్మాణం మరియు డివైడర్ బ్లాకులు, సూచిక బోర్డులు మొదలైన వాటి సరఫరా - 1 పని. | రూ. 46.50 లక్షలు | 07.10.2026 మ. 02.00 గం.లకు | 12.10.2026 మ.02.00 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి.
DIPR R.O. No. : 11439-PP/CL/ADVT/2026-27, Date: 07-10-2026

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం - పర్కాల**
హనుమకొండ జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సవరణ నోటీసు
For Tender No. E1/107/7/MCP/2026 తేదీ: 03.10.2026
ఇ-ప్రొక్యూర్‌మెంట్ కొరకు టెండర్ సవరణ నోటీసు :

| పరిపాలనా కారణాల దృష్ట్యా, టెండర్ నోటీసు తేదీలను ఈ క్రింది విధంగా మార్చడమైనది | |
|---|---|
| బిడ్ల డౌన్‌లోడింగ్ ప్రారంభం | 07.10.2026 మ.3.00గం.ల నుండి |
| బిడ్ల డౌన్‌లోడింగ్ ముగింపు | 12.10.2026 ఉ.11.00గం.ల వరకు |
| బిడ్లు తెరుచు తేది మరియు సమయం | 12.10.2026 మ.12.00గం.లకు |

మరిన్ని ఇ-ప్రొక్యూర్‌మెంట్ పనుల వివరాలకు @ ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.tender.telangana.gov.in (ఫోన్ నెం. 9490143574)లో చూడవచ్చు. ఎటువంటి కారణం లేకుండా టెండర్‌ను రద్దు చేసే హక్కు కమిషనర్‌కు కలదు.
సం/- కమిషనర్, మున్సిపల్ కౌన్సిల్, పర్కాల.
DIPR R.O. No. : 11446-PP/CL/ADVT/2026-27, Date: 07-10-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, సర్కిల్-30, GHMC, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, హైదరాబాద్.
ప్రకటన
RFQ నం. 03/EE/C-30/GZ/GHMC/2026-27 తేదీ: 06-10-2026
జిహెచ్ఎంసి, జిజెడ్, డివిజన్-30 పరిధిలోని అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్‌కు బాహ్య పెయింటింగ్ (Exterior Painting) వేసే పని కోసం కొటేషన్ల ఆహ్వానం.
& & & &

| | |
|---|---|
| టెండర్ ప్రకటన / బిడ్ ఆహ్వాన తేదీ / వివరాల పత్రం పొందే తేదీ | 07.10.2026 ఉదయం 11:00 గంటలకు |
| బిడ్ సమర్పణకు చివరి తేదీ మరియు సమయం /(లేదా) సీల్డ్ కొటేషన్ స్వీకరణ | 14.10.2026 ఉదయం 11:00 గంటలకు |
| ప్రీ-క్వాలిఫికేషన్ & సాంకేతిక బిడ్ల ప్రారంభం | 14.10.2026 ఉదయం 11:30 గంటలకు |

గమనిక:
1) కొటేషన్ కోసం ఆఫ్‌లైన్ టెండర్ :- వివరాల పత్రాన్ని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, సర్కిల్-30, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్ నుండి పొందవచ్చు మరియు సీల్డ్ కొటేషన్లను కూడా ఇదే కార్యాలయంలో సమర్పించాలి.
(లేదా)
2) కొటేషన్ కోసం ఆన్‌లైన్ టెండర్ :- ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ (tender.telangana.gov.in) ద్వారా పాల్గొనవచ్చు.
కావున, అర్హత కలిగిన ఏజెన్సీలు పైన పేర్కొన్న కాలవ్యవధిలో అవసరమైన వివరాలతో తమ బిడ్‌ను సమర్పించవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సర్కిల్-30, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 11433-PP/CL/ADVT/2026-27, Date: 07-10-2026

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**
సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS03UC 8060 | Sambaiah Koyada | SWARAJ 744 FE | 2020 |
| 2 | TS08UD 4750 | Choppari Raghu | MAHINDRA BOLERO MAXI TRUCK PLUS | 2017 |
| 3 | TS04FD 7163 | Mohd Javeed Pasha | INDICA VISTA LS BS3 DIESEL 5 SEATER | 2014 |
| 4 | TG02B 8836 | Narsaiah Pilly | SONALIKA DI 35 | 2021 |
| 5 | TG36C 1789 | Chananthula Raju | SWARAJ 735FE | 2025 |
| 6 | TS15UE 6500 | Santhosh Godugu | MAHINDRA JEETO PLUS BS6 DIESEL | 2022 |

AUCTION DATE : 13-10-2026
VENUE : SHRIRAM AUTOMALL KARIMNAGAR, ALUGUNURU, HYDERABAD ROAD, KARIMNAGAR
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H No: 14-64/24, Nagaram Road, Beside Jio Store, Husband, Karimnagar - 505467, Cell ; 9866244432

## మెరుపుదాడులు

**(మొదటి పేజీ తరువాయి)**

ఖాతాల ద్వారా దేశవ్యాప్తంగా సాగిన 1,172 నేర లింకులు బయటపడ్డాయి. వీటిలో 206 లింకులు తెలంగాణకు సంబంధించినవిగా గుర్తించామని టిజిబిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ ఒక ప్రకటనలో తెలిపారు.సెప్టెంబర్ 23 నుంచి రెండు వారాల పాటు నిర్వహించిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో తెలంగాణతో పాటు కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాల్లో ఆరు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయని ఆమె వెల్లడించారు. వంద మందికి పైగా సిబ్బంది సమన్వయంతో చేపట్టిన దాడుల్లో కేరళలో 35 మంది, ఏపీలో 22, కర్ణాటకలో 17, తమిళనాడులో 14, తెలంగాణలో 12, పుదుచ్చేరిలో ఒకరిని అరెస్టు చేశారని ఆమె తెలిపారు.

**కమీషన్ కోసం మ్యూల్ ఖాతాల ఏర్పాటు..**

సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చే ఏజెంట్లు, మ్యూల్ ఖాతాదారులపై దర్యాప్తు అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. అరెస్టయిన వారిలో 19 మంది ఏజెంట్లు కాగా, 81 మంది మ్యూల్ ఖాతాదారులు ఉన్నట్లు గుర్తించామన్నారు. నిందితులు తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు అందించి, వాటిలోకి వచ్చిన మోసపూరిత నగదును ఏటీఎంల ద్వారా డ్రా చేయడం, ఇతర ఖాతాలకు బదిలీ చేయడం, విదేశీ లావాదేవీలకు తరలించడం వంటి కార్యకలాపాలకు సహకరించినట్లు దర్యాప్తులో తేలింది. ఇందుకు ప్రతిఫలంగా మోసపోయిన మొత్తంలో 5 శాతం వరకు కమీషన్ తీసుకున్నట్లు అధికారులు గుర్తించారని వె ల్లడించారు.ఈ ఆపరేషన్‌లో వెలుగులోకి వచ్చిన కేసులు సైబర్ నేర ముఠాల విస్తృత నెట్‌వర్క్‌ను వెల్లడించాయి. టాటా క్యాపిటల్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి కమీషన్ కోసం సైబర్ నేరగాళ్లకు మ్యూల్ బ్యాంకు ఖాతాలు సమకూర్చినట్లు గుర్తించామని తెలిపారు. ఓ మాజీ సైనికోద్యోగికి దేశవ్యాప్తంగా ఆరు సైబర్ నేర కేసులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించామని ఆమె తెలిపారు.

**ఒకే కేసులో కర్ణాటక, ఎపికి లింకులు...**

వరంగల్ సిసిఎస్‌లో నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా కర్ణాటక బృందం బెంగళూరులో తుకారాం హెంబాడేను అరెస్టు చేసింది. నిందితుడి వాంగ్మూలం ఆధారంగా ఆంధ్రప్రదేశ్ బృందం అనకాపల్లిలో కొక్కర్లపాటి సిద్ధు వర్మను అదుపులోకి తీసుకుంది. ఇదే సమయంలో నమోదైన సినిమా పైరసీ కేసులో సిసిపిఎస్ హెడ్‌క్వార్టర్స్ బృందం పుదుచ్చేరిలో సి. విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసిందని శిఖాగోయల్ తెలిపారు. టిజిసిఎస్‌బి పరిధిలోని ఏడు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో నమోదైన 51 కేసులకు సంబంధించి ఈ 101 మంది అరెస్టులు జరిగాయని ఆమె తెలిపారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నందున మరిన్ని నేర లింకులు, అంతర్రాష్ట్ర సంబంధాలు, అంతర్జాతీయ నెట్‌వర్క్‌లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఆమె తెలిపారు.

## మరింత భారం (మొదటి పేజీ తరువాయి)

మారలేదు. ఇక 2025లో మాత్రం రేటు తగ్గించారు. ద్రవ్యపరపతి విధాన కమిటీ భేటీలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచాలని ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఆగస్టులో ద్రవ్యోల్బణం 4.82 శాతం పెరిగినట్లు ఆర్‌బిఐ అంచనా వేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్, ఆగస్టు సమీక్షల్లో ఆర్‌బిఐ రేట్లను యథాతథంగా కొనసాగించింది. అయితే పశ్చిమాసియా ఘర్షణలు, దేశీయ రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాల నేపథ్యంలో తాజాగా రేటును పెంచింది.

# యుద్ధం ఆపండి

**ఆంటోనీ గుటెర్రెస్ పిలుపు**

**ఐక్యరాజ్యసమితికి కాలం చెల్లింది..సంస్కరించాలి**



**ఇస్లామాబాద్:** ఐక్యరాజ్యసమితికి కాలం చెల్లిందని, సమితిలో సంస్కరణలు తీసుకురావాలని సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ అన్నారు. మంగళవారం పాకిస్థాన్‌లో మూడు రోజుల పర్యటన ప్రారంభించిన ఆంటోనీ గుటెర్రెస్ ఆ దేశ ఉప ప్రధాన మంత్రి, విదేశాంగమంత్రి ఇషాక్ దార్‌తో సమావేశమయ్యారు. ఆయనతో కలిసి ఇస్లామాబాద్‌లో పత్రికాగోష్ఠిలో మాట్లాడారు. ఈ ఏడాది డిసెంబరులో పదవీ విరమణ చేస్తున్న గుటెర్రెస్, అమెరికా-ఇరాన్ దేశాల మధ్య యుద్ధాన్ని ఇక ముగించాలన్న బలమైన సందేశాన్ని ప్రపంచానికి పంపించారు. ఇస్లామాబాద్ వేదికగా నేను అన్ని పక్షాలకూ పిలుపు ఇస్తున్నాను, యుద్ధం ఆపండి, మళ్ళీ చర్చల బల్ల దగ్గరకు రండి, దౌత్యమార్గంలో సమస్య పరిష్కరించుకోండి, అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా సముద్ర హక్కులు, స్వేచ్ఛాయుత రవాణా కార్యకలాపాలను పునరుద్ధరించండి '' అని కోరారు. యుద్ధ పరిష్కారంకోసం అధికారిక మధ్యవర్తి హోదాలో పాకిస్థాన్-ఖతార్ దేశాలు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్రపంచ వాణిజ్యం ,చమురు రవాణా కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయన్నారు.కశ్మీరు సమస్యపై గుటెర్రెస్‌ను ఒక పాకిస్థానీ జర్నలిస్టు ప్రశ్నించినప్పుడు ఆయన ఆ ప్రశ్నను పెద్దగా పట్టించుకోలేదు. దాట వేశారు. ఐక్యరాజ్యసమితి సంస్కరణల గురించి ఆయన ప్రధానంగా మాట్లాడారు. యూరప్‌కు భద్రతామండలిలో మూడు సభ్యత్వాలు ఉన్నాయని, ఆఫ్రికాకు సభ్యత్వం లేదని, అసమానతలను సరిదిద్దాలని అన్నారు.చట్టబద్ధమైన, సమానత్వ సమస్య సంక్షోభాన్ని ఐక్యరాజ్యసమితి ఎదుర్కొంటున్నదని ఆయన అన్నారు.పాకిస్థానీ నాయకత్వంతో జరిపిన చర్చల గురించి వివరిస్తూ, పాలస్తినా సంక్షోభం, ఆఫ్ఘనిస్థాన్‌లో పరిస్థితులు, ఉగ్రవాదాన్ని నిరోధించడం, అంతర్జాతీయ బహుళపాక్షిక విధానాల పునరుద్ధరణ వంటి విషయాలపై తాము ప్రధానంగా చర్చించినట్లు చెప్పారు. ఈ పర్యటన సందర్భంగా భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణను పర్యవేక్షించే యుఎన్‌ఎంఓజిఐపి (ఐక్యరాజ్యసమితి భారత్-పాకిస్థాన్ సైనిక పర్యవేక్షణా బృందం) ప్రధాన కార్యాలయాన్ని ఆయన సందర్శించారు.అక్కడి సిబ్బంది సేవలను కొనియాడారు. పాకిస్థాన్ జాతీయ విపత్తు నివారణ సంస్థను సందర్శించి ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో వారి పాత్రను ప్రశంసించారు.

## సౌదీ, యెమెన్‌లలో హౌతీల క్షిపణి దాడులు



**కైరో:** సౌదీ అరేబియా,యెమెన్ దేశాలలోని విమానాశ్రయాలు,సైనిక స్థావరాలపై హౌతీ తిరుగుబాటుదారులు బుధవారం దాడులు చేశారు. యెమెన్‌లోని పురాతనమైన అంతర్జాతీయ ఎడెన్ విమానాశ్రయం, సౌదీఅరేబియా ప్రధాన నగరం రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని బాలిస్టిక్ క్షిపణులు,డ్రోన్లతో దాడులు చేసినట్లు హౌతీల సైనిక ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యాహ్యా సరీ సోషల్ మీడియా వేదికగా బుధవారం ప్రకటించారు.ఈ దాడులు ఇరాన్ యుద్ధంలో తాజా ఉద్రిక్తలను పెంచాయి. అదేవిధంగా హోర్ముజ్ జలసంధికి కూడా ఆటంకాలు సృష్టించాయి. అభా విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారని,ఖమీష్ ముతైష్ నగరంలో ఒక వైమానిక స్థావరంపై, నజ్రాన్, అసిర్ నగరాలలో రెండు సైనిక స్థావరాలపై దాడులు చేసినట్లు యాహ్యాసరీ చెప్పారు. కాగా హౌతీలపై పోరాటం చేస్తున్న సౌదీ అరేబియా సంకీర్ణ దళాల కూటమి సైనిక ప్రతినిది మేజర్ జనరల్ తుర్కీ అల్-మల్కీ మాట్లాడుతూ,ఉత్తర ప్రాంతంలో ఒక బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకుని ధ్వంసం చేసినట్లు చెప్పారు. యెమెన్‌లోని పశ్చిమ ఎర్ర సముద్రతీరం వెంబడి హౌతీ తిరుగుబాటుదారులు నెలరోజుల క్రితం స్వాధీనం చేసుకున్న భూభాగాలను తిరిగి తమ వశం చేసుకునేందుకు యెమెన్, సౌదీ అరేబియా సంకీర్ణ దళాలు భారీస్థాయిలో భూ,జల,వాయు మార్గాలలో దాడులను ఉద్ధృతం చేశాయి. ముందురోజు మంగళవారంనాడు బాల్ ఎల్-మందాబ్ చుట్టుపక్కల ప్రాంతాల నుండి హౌతీ ఉగ్రవాద సైన్యాలను తరిమికొట్టి ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నట్లు యెమెన్ ప్రభుత్వదళాలు ప్రకటించాయి. ఈ కీలక జలసంధికి భారీసంఖ్యలో యుద్ధవిమాన రక్షణ వలయాన్ని కవచంగా ఏర్పాటు చేశారు.ఇక హౌతీలు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్న తైజ్ రాష్ట్ర రాజధాని నుండి కూడా వారిని తమిరికొట్టేందుకు యెమెల్ ప్రభుత్వ దళాలు దృష్టి కేంద్రీకరించాయి. మళ్ళీ విజృంభించిన అంతర్యుద్ధాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం ''యెమెన్ డాన్'' పేరుతో భారీ సైనికచర్య చేపట్టిన కొద్ది గంటల్లోనే కీలకమైన ధుబాబ్ పట్టణాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారు.యెమెన్ రాష్ట్రాలలో ప్రభుత్వ పాలన పునరుద్ధరించడం,దేశ రాజధాని సనా నగరాన్ని హౌతీల నుండి తిరిగి స్వాధీనం చేసుకోవడం లక్ష్యంగా ఈ ఆపరేషన్ ''యెమెన్ డాన్'' ప్రారంభించారు. గడచిన మూడు నెలలుగా హౌతీ సైన్యాలు యెమెన్‌లో అనేక ప్రాంతాలలో జైత్రయాత్ర సాగిస్తున్నాయి.హౌతీలకు వ్యతిరేకంగా సౌదీ అరేబియా సాగిస్తున్న యుద్ధ దాడులకు అమెరికా పూర్తి మద్దతు ఇస్తోంది. ఈ విషయంలో అమెరికా, సౌదీ మధ్య ఒప్పందం ఉంది. అయితే ఇంతకుమించి ఎక్కువ వివరాలు చెప్పడానికి అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో తిరస్కరించారు.కాగా హౌతీ సైన్యాలను అణచివేసేందుకు యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా 100 విమానాలతో రక్షణ ఇచ్చినట్లు సౌదీ అరేబియా సైనిక కూటమి దళాల ప్రతినిధి మేజర్ జనరల్ తుర్కీ అల్-మల్కీ చెప్పారు. మక్కా ఒప్పందం ప్రకారం టర్కీ-పాకిస్థాన్‌దేశాలు కూడా సౌదీ అరేబియాకు సైన్యాలను పంపించాయి.

# మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు గడ్డుకాలం

- **వెంటాడుతున్న ఓటమి భయం: మొండి వాదన వీడని ట్రంప్**
- **ఆర్థిక పనితీరుపై ... ఇష్టమైనరీతిలో ప్రకటనలు**



**వాషింగ్టన్:** డోనాల్డ్ ట్రంప్‌కు అగ్నిపరీక్షగా మారిన అమెరికా మధ్యంతర ఎన్నికలకు ఇంకా నెలరోజుల సమయం కూడా లేదు. ఈ పరిస్థితుల్లో రిపబ్లికన్‌పార్టీకి చెందిన అభ్యర్థులు గడ్డుకాలం ఎదుర్కొంటున్నారు. వారు నియోజకవర్గాల్లో ప్రజలకు ఎదురీదుతున్నారు. మరోవైపు ప్రచారం ప్రారంభించిన ట్రంప్ తన మొండి వాదనలు మానుకోవడంలేదు. అమెరికా ప్రజలకు ప్రధానమైన విషయం జీవన వ్యయాలు. ఈ జీవన వ్యయాలు పెనుభారంగా మారాయి. కానీ ట్రంప్ మాత్రం పత్రికలపై విరుచుకుపడుతున్నారు. మీడియాపై దుమ్మెత్తిపోస్తూ ఆర్థిక ప్రగతి విషయం మీడియాకు పట్టడంలేదన్నారు. కానీ వాస్తవం ఎంటంటే ద్రవ్యోల్బణం 3.4 శాతం కంటే ఎక్కువగా పెరిగింది. పెట్రోలు సగటు ధర గ్యాలన్‌కు 4.37 డాలర్లు పెరిగితే గొడ్డు మాంసం ధర రికార్డుస్థాయిలో పెరిగిపోయింది. ద్రవ్యోల్బణం పెరుగుదల వేతనాల పెరుగుదలను మించిపోయింది.

ప్రచారబరిలోకి దిగిన ట్రంప్ వాస్తవాలను తనకు అనుకూలంగా మలచుకుంటున్నారు. అమెరికా ఆర్థిక పనితీరును ఆయన సమర్థించుకుంటున్నారు. అమెరికా చరిత్రలో ఏ అధ్యక్షుడి హయాంలో సాధించనంతగా మన ఆర్థిక ఫలితాల గణాంకాలు ఉన్నాయి, కానీ ఈ విషయాలు ప్రజలకు తెలియడంలేదు, ఎందుకంటే పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా దీనిని పట్టించుకోవడంలేదని ట్రంప్ విమర్శిస్తున్నారు. యాగోవ్ నిర్వహించిన సర్వే ప్రకారం, 63 శాతం మంది ఆర్థిక వ్యవస్థ క్షీణించిపోతోందని నమ్ముతున్నారు. జీవన వ్యయ సమస్యలకు సంబంధించి ట్రంప్ నిర్వహణా విధానాన్ని అమెరికాలో 17 శాతం పెద్దలు మాత్రమే సమర్థిస్తున్నారు, 26 శాతం మంది వ్యతిరేకిస్తున్నారని గత వారం విడుదలైన ఎపి-ఎన్‌ఓఆర్‌సి నివేదిక తెలియజేసింది.వివిధ దేశాలపై విధించిన టారిఫ్‌ల విధానం,కఠినమైన వలస విధానాలు, ఇరాన్‌తో కొనసాగుతున్న సంఘర్షణ వంటివన్నీ ప్రజల ఆదరణకు నోచుకోలేదు. సర్వే నిర్వహించినప్పుడు తమకు ప్రజలు ఎక్కువశాతం మంది జీవన వ్యయాల గురించి మాట్లామే మాట్లాడుతున్నారని రిపబ్లికన్ అనుకూల పోలింగ్ సంస్థ ఎచెలాన్ ఇన్‌సైట్స్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ ఏవరీ జేమ్స్ అన్నారు. ఈ పరిస్థితులమధ్య రిపబ్లికన్ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు తాము ఓడిపోతామన్న భయాలు నెలకున్నాయి. ట్రంప్ ప్రచారానికి రాకుండా ఆయనకు దూరం కావాలా? అనే ఆలోచనలోకి వెళుతున్నారు.ఫ్లోరిడా సభ్యుడు బైరాన్ డోనాల్డ్స్ తరహాలో ట్రంప్‌కు విధేయంగా ఉన్న అభ్యర్థుల సంఖ్య తగ్గిపోయింది. ఫ్లోరిడాను ట్రంప్ తన సొంత గడ్డగా భావిస్తారు. ఆయన గడచిన మూడు విడతలుగా ఇక్కడి నుండి గెలుస్తున్నారు.2020లో ట్రంప్ ఓడిపోయినప్పటినుండీ డోనాల్డ్స్ ఆయనకు అండగా ఉన్నారు. ఇప్పుడు ఆయన ఫ్లోరిడా గవర్నర్ పదవికి పోటీ చేస్తున్నారు. రిపబ్లికన్లకు అమెరికాలో అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా చెబుతున్నప్పటికీ ఇప్పుడు అక్కడ విజయం చాలా ఖరీదైనదిగా మారిపోయిందని డోనాల్డ్స్ అంగీకరిస్తున్నారు. ఇప్పుడు ఆయన వేదికలపై ట్రంప్ పేరు ఎత్తడం లేదు. కానీ ఆయన అనుచరులు మాత్రం ఇళ్ళ అద్దెలు, బీమా, ఇళ్ళకొనుగోలులో భారీ ధరలు, వడ్డీరేట్ల గురించి మాట్లాడాలని కోరుకుంటున్నారు. కనియోజకవర్గాలలో రిపబ్లికన్ అభ్యర్థులు ప్రచారం నిమిత్తం తమ సొంత అజెండాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రజలు రిపబ్లికన్లమీద కోపంగా ఉన్నారు తప్ప తన మీద కోపంగా లేరని గడచిన ఆగస్టులో ట్రంప్ అన్నారు. ఒకవేళ మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లు ఓడిపోతే రాబోయే రెండు సంవత్సరాలపాటు ఆ శిక్షను డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షస్థానంలో కూర్చుని స్వయంగా అనుభవించాల్సివస్తుంది.

## రెండు డిఏలు

**(మొదటి పేజీ తరువాయి)**

చేసేందుకు మంత్రివర్గం ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 6,91,000 ఉద్యోగులు, పెన్షనర్లకు డిఎలను చెల్లించనున్నారు. 2024 జనవరిలో విడుదల కావల్సిన 3.64 శాతం, అదే ఏడాది జులైలో ఇవ్వాల్సిన 2.73 శాతం డీఏను మంజూరు చేసింది. రెండు కలిపి 6.37 శాతం పెరిగి డిఏ 40.04 శాతానికి చేరింది. 2024 జనవరి 1 నుంచి కొనసాగుతున్న పార్ట్‌టైమ్ అసిస్టెంట్లు, విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లకు నెలకు రూ.100 చొప్పున పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు రావాల్సిన బకాయిలను ఉద్యోగుల జిపిఎఫ్ ఖాతాల్లో జమ కానున్నాయి. సిపిఎస్ ఉద్యోగులకు బకాయిల్లో పది శాతం ప్రాన్ అకౌంట్లలో జమ చేసి మిగతావి వాయిదాల్లో చెల్లిస్తారు. రెండు డిఏ బకాయిలు మొత్తం కలిపి రూ.6,174 కోట్లుగా ఉన్నది. జనవరి 2024 నుంచి డిఏను 37.31 శాతానికి,2015 పే స్కేల్ ఉద్యోగులకు డిఏ 81.72 శాతానికి, 2020 పే స్కేల్ ఉద్యోగులకు 40.04 శాతానికి, 2016 పే స్కేల్ ఉద్యోగులకు 53 శాతానికి పెంచింది. జిపిఎఫ్ వర్తించబోని వారికి జీవో 128 బకాయిలను 33 వాయిదాలలో చెల్లించనుంది. ఉత్తర్వులు జారీ కావడానికి ముందే మరణించిన ఉద్యోగుల కుటుంబ/చట్టబద్ధ వారసులకు డిఏ బకాయిలను ఒకే మొత్తంలో చెల్లిస్తారు. అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీలు,జిహెచ్‌ఎంసీ సిబ్బంది డీఏ వ్యయాన్ని ఆయా సంస్థలు తమ స్వంత నిధుల నుంచే భరించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.2015 రివైజ్డ్ పే స్కేల్స్ ఉద్యోగులకు డిఎ 73.344 శాతం నుంచి 78.06 శాతానికి పెరిగింది. యుజిసి/ఎఐసిటిఇ2016 పే స్కేల్స్ వారికి 46 శాతం నుంచి 50 శాతానికి , 2006 పే స్కేల్స్ వారికి 230 శాతం నుంచి 239 శాతానికి పెంచారు.

## ప్రైవేటీకరించబోం

**(మొదటి పేజీ తరువాయి)**

విద్యుత్ ఉత్పత్తి వ్యయానికి గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్ణయాలే కారణమని ఆరోపించారు గత ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధించిన ఆధారాలను వారానికి ఒకసారి ప్రజల ముందుంచుతామని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం విద్యుత్ సంస్థలు, సింగరేణిపై అపోహలు సృష్టించడం రాష్ట్ర ప్రయోజనాలకు మంచిది కాదని హితువుపలికారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొగ్గు కేటాయింపులు, సరఫరా సామర్థ్యంపై స్పష్టత లేకుండానే 14 మిలియన్ టన్నుల బొగ్గు హామీ ఇచ్చి ప్లాంట్ నిర్మాణం చేపట్టారని, సింగరేణిలో అంతటి బొగ్గు అందుబాటులో లేదని తెలిసినప్పటికీ ముందు చూపు లేకుండా వ్యవహరించారని మండిపడ్డారు. పదేళ్ల అధికారంలో ఉండి తీసుకున్న నిర్ణయాలకు సమాధానం చెప్పకుండా, ప్రతిపక్షంలో ఉన్నామనే కారణంతో ఇష్టానుసారంగా విమర్శలు చేయడం సరికాదని సూచించారు. గత ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధించిన డాక్యుమెంటరీ ఆధారాలను ప్రజల ముందుంచి వాస్తవాలను వెల్లడిస్తామని ఆయన స్పష్టం చేశారు. యాదాద్రి ప్లాంట్‌కు ఏటా 14 మిలియన్ టన్నుల బొగ్గు అవసరమని, 2022 23 నాటికి సింగరేణిలో జి9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం కేవలం 1.71 మిలియన్ టన్నులేనని భట్టి విక్రమార్క తెలిపారు. అలాంటప్పుడు 14 మిలియన్ టన్నుల సరఫరా హామీ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. 2016లో సింగరేణి 7 మిలియన్ టన్నులు, మిగతా7 మిలియన్ టన్నులను దిగుమతి చేసుకునేలా ఒప్పందాలు చేశారని, అవి అమలు కాకపోవడంతో 2022లో మొత్తం 14 మిలియన్ టన్నులను సింగరేణి నుంచే సరఫరా చేస్తామని మరో అవగాహనకు వచ్చారని వివరించారు. ఆచరణ సాధ్యం కాని హామీల వల్లే ప్రస్తుతం బొగ్గు సమస్య ఎదురైందన్నారు.

**రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా 19,892 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్..**

రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారిగా విద్యుత్ డిమాండ్ అత్యధికంగా 19,892 మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క వివరించారు. దాదాపు 20 వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నప్పటికీ కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంల అధికారులు, సిబ్బంది కృషిని అభినందించారు. విద్యుత్ సంస్థలపై తప్పుడు ప్రచారం చేసి ప్రజలను గందరగోళానికి గురిచేయొద్దని హరీశ్‌రావుకు సూచించారు.

**బొగ్గు లభ్యతపై ముందుచూపేది?**

గత పదేళ్లలో 14 బొగ్గు బ్లాకులు మూతపడటంతో సుమారు 15 మిలియన్ టన్నుల ఉత్పత్తి తగ్గిందని భట్టి వివరించారు. కొత్త బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణిని పాల్గొనకుండా పక్కన పెట్టారని ఆరోపించారు. 2014-15లో 52.66 మిలియన్ టన్నులుగా ఉన్న సింగరేణి బొగ్గు ఉత్పత్తి 2025-26లో 62.07 మిలియన్ టన్నులకు పెరిగిందన్నారు. నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింద ని, అయితే ఆ బొగ్గుకు ఇప్పటికే ఇతర ప్లాంట్లకు కేటాయింపులు ఉన్నందున యాదాద్రికి ప్రత్యేక కేటాయింపుల కోసం కేంద్రాన్ని కోరుతున్నామని వివరించారు.

**యూనిట్ విద్యుత్ ధర రూ.6.66..**

యాదాద్రి ప్లాంట్ రెండేళ్లు ఆలస్యమవ్వడానికి గత ప్రభుత్వ తప్పిదాలతో పాటు పర్యావరణ అనుమతుల విషయంలో తీసుకున్న నిర్ణయాలు కారణమని భట్టి స్పష్టం చేశారు. విదేశీ, స్వదేశీ బొగ్గు వినియోగంపై తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో ఎన్‌జిటి అనుమతులు రద్దయ్యాయని, ఆ తర్వాత అవసరమైన స్థాయిలో ఫాలోఅప్ చేయలేదని విమర్శించారు. యాదాద్రి నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ యూనిట్‌కు రూ.6.66 ఖర్చవుతోందని భట్టి తెలిపారు. కాకతీయ ప్లాంట్ నుంచి యూనిట్‌కు రూ.4.17, భద్రాద్రి ప్లాంట్ నుంచి రూ.4.60, రూ.5.10 వరకు విద్యుత్ లభిస్తోందని వివరించారు. యాదాద్రి విద్యుత్ ధర అధికంగా ఉండటంతో దీర్ఘకాలంలో ఆర్థిక భారం వినియోగదారులపైనే పడుతుందని అన్నారు.

## కొమురం భీం పోరాట స్ఫూర్తితో..

# జర్నలిస్టులు ఉద్యమించాలి

**టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ**





**ఆసిఫాబాద్:** జోడేఘాట్ సాక్షిగా, జల్... జంగల్ ...జమీన్ తమ హక్కుగా గర్జించి, అణచివేతకు ఎదురు నిలిచి, అన్యాయానికి తలవంచకుండా, ఆదివాసీ బిడ్డల ఆత్మగౌరవం కోసం ఎదురొడ్డి పోరాడిన వీరుడు కొమురం భీం పోరాట స్ఫూర్తితో జర్నలిస్టులు హక్కుల సాధనకై ఉద్యమించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ పిలుపు నిచ్చారు. బుధవారం నాడు టియుడబ్ల్యుజె కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తృతీయ మహాసభ, ఆసిఫాబాద్ పట్టణంలోని రోజ్ గార్డెన్స్ ఫంక్షన్ హాలులో, కొమురం భీం ప్రాంగణంలో జరిగింది. ఈ సభకు ఆయన విశిష్ట అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆసిఫాబాద్ అంటే అడవి మాత్రమే కాదని, ఆదివాసీ బిడ్డల ఆత్మగౌరవానికి అది చిరునామా అని విరాహత్ అభివర్ణించారు. ఆసిఫాబాద్ ఒక జిల్లా మాత్రమే కాదని, కొమురం భీం పోరాట వారసత్వాన్ని మోస్తున్న నేల అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పోరాటాలు, త్యాగాలు, విజయాలతో కూడిన సుదీర్ఘ చరిత్ర కలిగి ఉన్న ఏకైక సంఘం టియుడబ్ల్యుజె మాత్రమేనని ఆయన స్పష్టం చేసారు. జర్నలిస్టుల గొంతుకగా, 75ఏళ్ల నుండి మడమ తిప్పని పోరాటాలు చేస్తున్న గొప్ప చరిత్ర తమ సంఘానికి ఉందని, తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులు పొందుతున్న సౌకర్యాలు తమ సంఘం సాధించినవేనని ఆయన స్పష్టం చేసారు. నాటి నుండి నేటి వరకు తమ సంఘం ఏ రాజకీయ పార్టీకో, ప్రభుత్వానికో అనుబంధంగా పనిచేయలేదని, జర్నలిస్టుల, మీడియా పక్షపాతిగా నిలబడి రాజీలేని పోరాటాలు కొనసాగిస్తున్నట్లు విరాహత్ అలీ అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించడం సరైంది కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు క్యాష్‌లెస్ హెల్త్ స్కీమ్ అమలుకాక పోవడంతో అప్పులు చేసి చికిత్స పొందుతున్నారని, మరి కొందరు అప్పులు చేసే స్థోమత లేక అనారోగ్యాలతో తనువు చాలిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేసారు. అలాగే ఇండ్లు, ఇంటి స్థలాల హామీని ప్రభుత్వం నేటికీ అమలు చేయకపోవడంతో జర్నలిస్టుల్లో తీవ్ర నిరాశ నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జర్నలిస్టుల ప్రధాన సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని విరాహత్ అలీ కోరారు. గౌరవ అతిథిగా హాజరైన టియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ మాట్లాడుతూ, ట్రేడ్ యూనియన్ నియమావళికి అనుగుణంగా సంస్థాగత నిర్మాణంతో రాష్ట్రంలో కొనసాగుతున్న ఏకైక జర్నలిస్టుల సంఘం తమదేనని ఆయన పేర్కొన్నారు. ఈ సభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాష్ రెడ్డి, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ రహ్మాన్, సంపత్, యూనియన్ జిల్లా నాయకులు కృష్ణంరాజు, ప్రకాష్ గౌడ్ జమీల్, గిరిజా బాయి, సతీష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి దాదాపు 250 మంది జర్నలిస్టులు మహాసభకు హాజరవ్వడం విశేషం.

**కథనాల్లో వాస్తవాలు ఉండాలి: జిల్లా కలెక్టర్ హరిత**



ప్రజా సమస్యలపై జర్నలిస్టులు రాసే కథనాల్లో వాస్తవాలు ఉంటేనే అవి విశ్వాసం పొందగలుగుతాయని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత అన్నారు. టీయూడబ్ల్యూజే మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజా క్షేత్రంలో అధికార యంత్రాంగంతో కలిసి జర్నలిస్టులు టీమ్ వర్క్ చేస్తే సత్ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని కలెక్టర్ సూచించారు. జిల్లాలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు.

# వెనక్కి తగ్గని ప్రతిపక్షాలు

**(మొదటి పేజీ తరువాయి)**

ఎంపిలు ప్రయాణిస్తున్న బస్సులను పోలీసులు అడ్డుకున్నారు. ప్రతిపక్ష ఎంపిలను అశోకా రోడ్ వద్ద, షాంగ్రిలా హోటల్ సమీపంలో బహుళస్థాయి భద్రతా వలయంతో నిలిపివేశారు. దీంతో రాహుల్, ప్రియాంక సహా ఎంపిలు బస్సుల నుంచి బయటకు వచ్చి రోడ్డుపైనే నిరసనకు దిగారు. ప్రియాంక వాద్రాతో పాటు మహిళా నేతలు నేలపైనే పడుకుని నిరసన కొనసాగించారు. కొంత మంది కాంగ్రెస్ ఎంపిలు బస్సుల పైకి ఎక్కి నినాదాలు చేస్తూ త్రివర్ణ పతాకాలు ప్రదర్శించారు. వారి చేతుల్లో భారత రాజ్యాంగ ప్రతులు కూడా ఉన్నాయి. నిరసన స్థలంలో భారీ సంఖ్యలో భద్రతా సిబ్బందిని మోహరించారు. తొలుత పోలీసులు రాహుల్ గాంధీని బలవంతంగా అక్కడి నుంచి తొలగించారు. ఈ క్రమంలో కార్యకర్తలు తీవ్రంగా ప్రతిఘటించడంతో కొంతసేపు తోపులాట చోటుచేసుకుంది. రాహుల్‌ను భుజాలపై ఎత్తుకుని తీసుకెళ్లి పోలీసు బస్సులోకి ఎక్కించారు. రాహుల్ గాంధీని తీసుకెళ్తున్న పోలీసు బస్సు పైకి కాంగ్రెస్ నేతలు అమరీందర్ సింగ్ రాజా వారింగ్, ఉదయ్ భాను చిబ్ తదితరులు ఎక్కారు. ముంతాజ్ పటేల్ బస్సు బానెట్‌పై కూర్చుని నిరసన తెలిపారు. అనంతరం పెద్ద సంఖ్యలో మహిళా పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని రోడ్డుపై బైఠాయించిన ప్రియాంక గాంధీతో పాటు ఇతర మహిళా నేతలను అక్కడి నుంచి బలవంతంగా తరలించి పోలీసు బస్సుల్లోకి ఎక్కించారు. ఎట్టకేలకు పోలీసులు బలవంతంగా రాహుల్, ప్రియాంక సహా ఇతర నేతలను బస్సుల్లో ఎక్కించి వేరే ప్రదేశానికి తరలించారు. ఈ బస్సు ర్యాలీలో కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), ఆర్‌జెడి, ఐయుఎంఎల్ పార్టీలకు చెందిన ఎంపిలు పాల్గొన్నారు. ఈ రెండు రోజుల్లో రాహుల్ గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఇది వడోసారి.

**ఎంపిలతో ప్రవర్తించే తీరు ఇదేనా?: ప్రియాంక**

పోలీసులు అదుపులోకి తీసుకునే క్రమంలో ప్రియాంక తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిలతో ప్రవర్తించే తీరు ఇదేనా అని ప్రశ్నించారు. 'ఎంపిలను కొడతారా? ఈడ్చి పడేస్తారా? ఎంపిలు ఏం అడుగుతున్నారు? ఇసిని కలుద్దామని ఎంపిలు అడగడం నేరమా?' అని నిలదీశారు. మహిళా పోలీసులు తనపై దాడి చేశారని, తన శరీరమంతా గోళ్లతో గాయపరిచారని మండిపడ్డారు. 'నేను ఇక్కడి నుంచి కదిలేది లేదు. కేవలం ఎన్నికల సంఘాన్ని కలవాలనుకున్న ఎంపిలతో వారు ప్రవర్తించే తీరు ఇదేనా? ఈ విధంగా ఎంపిలను కొడతారా? మహిళా పోలీసులు నన్ను గోళ్లతో గాయపరిచి కిందికి తోసేశారు. వారి బలగాలను వెనక్కి పిలవమనండి' అంటూ ప్రియాంక నిరసన తెలిపారు.

**ఎఫ్ఐఆర్‌లను పతకాలుగా భావిస్తా: రాహుల్**

ప్రతిపక్ష ఎంపీల సమావేశం ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. మోదీ, అమిత్‌షాలు జ్ఞానేశ్ ద్వారా ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడితే తనపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారని...వాటిని పతకాలుగానే భావిస్తానన్నారు. ఇప్పటి వరకు తనపై 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని.. వంద సాధించడమే తన లక్ష్యమని అన్నారు. 'లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈసీని కలవాలనుకున్నాం. అందుకే మంగళవారం ఈసీని కలుద్దామని 300మంది ఎంపీలం వెళ్లాం. మాకు అనుమతి నిరాకరించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు పదవిలో కొనసాగే అర్హత లేదు. మా దష్టిలో ఆయన చట్టబద్ధమైన అధికారి కాదు. అందుకే పదవి దిగిపోవాలని కోరుతున్నాం. దేశద్రోహులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపడతాం' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**అరెస్టులకు, బెదిరింపులకు భయపడం: ఖర్గే**

అరెస్టులకు, బెదిరింపులకు భయపడేది లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం తప్పులు చేస్తోందని, 'మోదీజీ ఆ తప్పులు చేయిస్తున్నారు' అని ఆరోపించారు. రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నేతలపై ఎఫ్ఐఆర్‌ల నమోదుపై స్పందిస్తూ... ''ఎన్ని కేసులు నమోదు చేయాలనుకుంటే అన్ని కేసులు నమోదు చేసుకోండి. మేము భయపడేది లేదు'' అని అన్నారు.ఆర్జేడీ నేత మనోజ్ ఝా మాట్లాడుతూ... 'దోషులందరినీ చట్టం ముందు నిలబెడతాం. ఈ ప్రభుత్వంపై మనమంతా కలిసి పోరాడతాం' అన్నారు.టీఎంసీ నేత డెరెక్ ఓబ్రెయిన్ మాట్లాడుతూ... 'మేమంతా ఇక్కడ కలిసి ఉన్నాం. ఐక్యంగా ఉన్నాం. ఎలాంటి వ్యక్తిగత అహంకారాలకు తావులేకుండా కలిసి పోరాడుతున్నాం. వారు పదవుల నుంచి వెళ్లిపోయే వరకు పోరాటం కొనసాగిస్తాం' అని అన్నారు. సిపిఐ ఎంపి పి. సంతోశ్ కుమార్ మాట్లాడుతూ... జ్ఞానేశ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పోరాటంలో యావత్ ప్రతిపక్షం ఐక్యంగా ఉందని స్పష్టం చేశారు.

# శ్రేయస్ అయ్యర్‌కు కెరీర్ బెస్ట్ ర్యాంక్

టీమిండియా టి-20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కెరీర్ బెస్ట్‌ర్యాంక్ అందుకున్నాడు. ఐసిసి తాజాగా విడుదల చేసిన టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో శ్రేయస్ అయ్యర్ టాప్-10లోకి దూసుకొచ్చాడు. వెస్టిండీస్‌తో తొలి టి20లో విధ్వంసకర శతకంతో చెలరేగిన శ్రేయస్ అయ్యర్ (43 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 102 నాటౌట్) ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 7వ స్థానంలో నిలిచాడు. అయ్యర్ కెరీర్లోనే ఇది అత్యుత్తమ ర్యాంక్ కావడం గమనార్హం. ఇషాన్ కిషన్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా.. అభిషేక్ శర్మ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. తిలక్‌వర్మ 10వ స్థానంలో నిలిచాడు. టీ20 బ్యాటింగ్ టాప్10 ర్యాంకింగ్స్‌లో నలుగురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. ఆసియా గేమ్స్‌లో సత్తాచాటిన పాకిస్థాన్ బ్యాటర్ హసన్ నవాజ్ 62స్థానాలు మెరుగుపరుచుకుని 48వ ర్యాంకు అందుకున్నాడు.



**అగ్రస్థానంలో రషీద్ ఖాన్..** టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అఫ్గానిస్థాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్‌ను వెనక్కి నెట్టి రషీద్ 8వ సారి నంబర్ 1 ర్యాంకును అందుకున్నాడు. టి20 చరిత్రలోనే అత్యంత ఎక్కువ కాలం నం.01గా నిలిచిన బౌలర్‌గా రషీద్ రికార్డు సృష్టించాడు. గత మూడు మ్యాచ్‌లలో నిలకడగా రాణించిన భారత స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ 16 స్థానాలు ఎగబాకి 7వ ర్యాంకు అందుకున్నాడు.

**టాప్‌లో శుభమన్ గిల్..** వన్డే ర్యాంకింగ్స్‌లో కెప్టెన్ శుభమన్ గిల్ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో గువాహటిలో జరిగిన రెండో వన్డేలో అజేయంగా 223 పరుగులు చేసిన గిల్.. తన కెరీర్‌లోనే అత్యధికంగా 841 రేటింగ్ పాయింట్లను అందుకున్నాడు. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్ మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఒక స్థానం దిగజారి మూడో ర్యాంకుకు పడిపోయాడు. అదే సిరీస్‌లో అజేయ శతకం (129) బాదిన వికెట్ కీపర్ బ్యాటర్ కెఎల్ రాహుల్ తిరిగి టాప్10లోకి దూసుకొచ్చాడు. రోహిత్ శర్మ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. సెంచరీలతో చెలరేగిన వెస్టిండీస్ వన్డే కెప్టెన్ షై హోప్ (6వ ర్యాంక్), విండీస్ ఫాస్ట్ బౌలర్ జేడెన్ సీల్స్ (10వ ర్యాంక్) వన్డేల్లో టాప్10లోకి దూసుకు వచ్చారు. వెస్టిండీస్కు చెందిన అమీర్ జంగూ 55 స్థానాలు ఎగబాకి 55వ ర్యాంకు సాధించాడు.

## భువనేశ్వర్ కుమార్ రీఎంట్రీ..
## న్యూజిలాండ్‌తో తలపడే భారత టి20 జట్టు ప్రకటన

న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లే భారత టి-20 జట్టును బిసిసిఐ ప్రకటించింది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని 15 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను వెల్లడించింది. నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భువనేశ్వర్ కుమార్ భారత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ఐపిఎల్లో ఆర్‌సిబి తరఫున సత్తాచాటిన భువనేశ్వర్ కుమార్‌ను తీసుకోవాలని వచ్చిన డిమాండ్లను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకున్నారు.

అయితే మరో వెటరన్ పేసర్ మహమ్మద్ షమీకి మాత్రం మొండి చెయ్యే ఎదురైంది. ఈ ఐదు టి-20ల సిరీస్ నుంచి కూడా జస్ప్రీత్ బుమ్రాకు సెలెక్టర్లు విశ్రాంతి కల్పించారు. టెస్ట్ సిరీస్ నేపథ్యంలో అతనికి రెస్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది.



**వైభవ్‌కు చోటు..** అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లతో పాటు టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, శివమ్ దూబే, నితీష్ కుమార్‌రెడ్డి, నమన్ ధీర్, ప్రిన్స్ యాదవ్, మాయంక్ యాదవ్, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. గాయంతో జట్టుకు దూరమైన వరుణ్ చక్రవర్తి న్యూజిలాండ్ పర్యటనకు ఎంపికయ్యాడు. అక్టోబర్ 22 నుంచి ఈ ఐదు టి-20ల సిరీస్ ప్రారంభం కానుంది. అక్టోబర్ 22న తొలి టి-20, 24న రెండో టి-20, 27న మూడో టి-20, 30న నాలుగో టి-20, నవంబర్ 1న ఐదో టి-20, జరగనుంది. ఓవైపు టి-20, సిరీస్ జరగుతుండగానే మరోవైపు భారత్-ఎ జట్టు అనధికారిక టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఈ మూడు అనధికారిక టెస్ట్ మ్యాచ్‌ల కోసం భారత్-ఎ జట్టును కూడా బిసిసిఐ ప్రకటించింది. భారత టెస్ట్ టీమ్ ప్రధాన ఆటగాళ్లకు ఈ జట్టులో అవకాశం కల్పించింది.

**భారత్-ఎ జట్టులో రాహుల్, పంత్..** న్యూజిలాండ్ కండిషన్‌కు అలవాటు పడేందుకు యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, అకీబ్ నబీ, ఆకాష్ దీప్, అన్షుల్ కాంబోజ్, మానవ్ సుతార్, సాయి సుదర్శన్ ముఖేష్ కుమార్ ఈ జట్టులో చోటు దక్కించుకున్నారు. అక్టోబర్ 24-27 మధ్య తొలి అనధికారిక టెస్ట్, అక్టోబర్ 31-నవంబర్ 3 మధ్య రెండో టెస్ట్, నవంబర్ 10-26 మధ్య మూడో అనధికారిక టెస్ట్ జరగనుంది.

### న్యూజిలాండ్ పర్యటనకు భారత టి20 జట్టు

శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, భువనేశ్వర్ కుమార్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్.

### న్యూజిలాండ్ పర్యటనకు భారత్-ఏ జట్టు

యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, రవిచంద్రన్ అశ్విన్, రవిచంద్రన్ సమరణ్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, అకీబ్ నబీ, ఆకాష్ దీప్, అన్షుల్ కాంబోజ్, మానవ్ సుతార్, ముఖేష్ చౌదరి, సాయి సుదర్శన్, యశ్ రాథోడ్, ముఖేష్ కుమార్.

## 'సెల్ఫ్ హెల్ప్'
# ఈ నాటిది కాదు!






సుమారు 2,000 ఏళ్ల క్రితం మౌంట్ వెసూవియస్ విస్ఫోటనంలో భస్మమయమైన ఒక అరుదైన గ్రంథపత్రం, ఆ కాలపు మనుషుల ఆలోచనలను వెలుగులోకి తీసుకొచ్చింది. క్రీస్తు శకం 79లో వెసూవియస్ అగ్నిపర్వతం భీకర విస్ఫోటనం 'హెర్క్యులానియం' అనే పట్టణాన్ని పూర్తిగా ధ్వంసం చేసినప్పుడు, అక్కడి ప్రసిద్ధ గ్రంథాలయంలో ఉన్న ఈ పత్రం దాదాపు పూర్తిగా దగ్ధమైంది. అయితే, కాలకుండా ఉన్న కొన్ని ముక్కలు ఆధునిక చిత్రీకరణ (ఇమేజింగ్) సాంకేతికతల సాయంతో చదవగలిగే స్థితికి చేరాయి. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, ఇది ఆ కాలంలో రాసిన ఒక ఆత్మవికాసం, సదాచారం వంటి విషయాలను తెలిపే పుస్తకం ఈ రోజుల్లో మనం 'సెల్ఫ్‌హెల్ప్'గా పేర్కొనే పుస్తకాలకు సమానమైనది. వ్యక్తిగత ప్రగతి, నైతికత, సమతుల జీవనశైలిని నిర్మించుకోవడం వంటి అంశాలపై ఇందు లో మార్గదర్శనాలు ఇచ్చినట్లుగా కనిపిస్తోంది. స్వీయాభివృద్ధి పట్ల ఆసక్తి ఆధునిక కాలానికి మాత్రమే పరిమితం కాలేదని, రెండు వేల ఏళ్ల క్రితమే మనుషులు మనసు శాంతి, ధైర్యం, సమతుల్యం వంటి అంశాలపై లోతుగా ఆలోచించారని ఈ పత్రం స్పష్టం చేస్తుంది. ముద్రిత పుస్తకాలు, సోషల్ మీడియా, ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్రం లేని కాలంలో కూడా, వారు తమ ప్రవర్తనను పరిశీలించటం, వ్యక్తిగత లక్ష్యాలను నిర్ధారించుకోవటం, జీవిత సవాళ్లను ఎదుర్కొనే మార్గాల కోసం ఆత్మపరిశీలన చేయటం వంటివి చేసేవారని ఇది సూచిస్తోంది. అంటే, స్వీయజ్ఞానం, స్వీయమార్పు కోసం మనసులో కలిగే తపన కాలాన్ని, తరాలను దాటి కొనసాగుతూనే ఉంది. ఈ పత్రంలోని కొన్ని అక్షరాలు, పదబంధాలు చదవదగిన రీతిలో ఉండడం అత్యంత ఆసక్తికరమైన విషయం. పరిశోధకులకు వాటిని చదువుతున్నప్పుడు రచయిత తన కాలపు స్వరం వినిపిస్తున్నట్టుగా అనిపిస్తుంది. రెండు వేల ఏళ్ల మానవ ఆలోచనలకు, భావోద్వేగాలకు ఒక జీవంతమైన వారధి ఏర్పడినభావన కలుగుతుంది.

## థీబ్స్‌లో మెడూసా చిత్రం

మెడూసాను సెంటార్ (గుర్రం మరియు మనిషి సంయుక్త రూపం)గా ఆవిష్కరించిన వైనమిది. క్రీస్తుపూర్వం సుమారు 660 సంవత్సరాలకు చెందిన ఈ చిత్రం థీబ్స్ ప్రాంతంలో బయటపడిన ఒక భారీ మట్టిపాత్రపై ఉంది. ఇలాంటి భారీ నిల్వ పాత్రలను



పిథోస్‌గా పేర్కొంటారు. గ్రీకు పురాణాల ప్రకారం, మెడూసాకు గొప్పవీరుడైన పర్సియస్ శిరఛేదనం చేశాడు. ఆ ఘటన అనంతరం, ఆమె రక్తం భూమిని తాకగానే ఇద్దరు పిల్లలు ఉద్భవించారు. ఆ సంతానంలో ఒకటి రెక్కలతో యుక్తమైన గుర్రం పెగాసస్‌కాగా, మరొకటి మహాకాయ యోధుడు క్రైసాయోర్. మరో పురాణ రూపాంతరం ప్రకారం, ఈ ఇద్దరూ ఆమె శరీరం లేదా మెడ నుండి నేరుగానే ఊపిరిపోసుకున్నారు. గుర్రం రూపంలో ఉన్న పెగాసస్, మహాకాయ యోధుని రూపంలో ఉన్న క్రైసాయోర్ ఇద్దరూ ఈ సెంటార్ లక్షణాలకు ప్రతినిధులుగా గోచరిస్తారు. ఈ కళారూపం గ్రీకు పురాణాలలోని దృశ్యకల్పన, గోర్గన్ యొక్క భయంకరమైన కానీ గంభీరమైన వైభవాన్ని, మైథలాజీలోని రూపకాలను ఒకేసారి ప్రతిబింబిస్తుంది.

## క్రీస్తుపూర్వమే ఎయిర్ కండిషనర్లు!



ఎయిర్ కండిషనర్లు, ఎయిర్ కూలర్లను ఆధునిక ఆవిష్కరణగా అనుకుంటాం. గట్టిగా నమ్ము తాం కూడా. క్రీస్తుపూర్వమే ఇలాం టి సదుపాయాలు ఉండేవని ఎవరైనా చెప్తే, అతిశయోక్తి కింద కొట్టిపారేస్తాం. కానీ, ఇది ముమ్మాటికీ నిజం. సుమారుగా క్రీస్తు పూర్వం 400 కాలం లో పర్షియన్లు రూపొందించిన 'యఖ్చాల్' ఆవిష్కరణ ఈ వాదనకు పుష్టినిస్తుంది. పర్షియన్ భాషలో యఖ్ అంటే ఐస్, చాల్ అంటే కుప్ప. కాబట్టి యఖ్చాల్ అంటే 'ఐస్ కుప్ప' అని అర్థం. నిజానికి యఖ్చాల్ ఓ భారీ, శంకు ఆకార భవనం. దీనిని సరోజ్ గా పిలిచే, మట్టి, ఇసుక, మూటిపట్ట, కోడిపిండి, నిమ్మ రసం, మేక జుట్టు, చిమ్మట పొడితో కూడిన ప్రత్యేక మిశ్రమంతో తయారు చేస్తారు. ఈ భవనం 60 అడుగుల ఎత్తు వరకు ఉంటుంది. సెల్లార్ వంటి ప్రాంతం కూడా ఈ కట్టడంలో ఉండడం ఆశ్చర్యకరం. నిరంతర నీటి ప్రవాహాన్ని కొనసాగిస్తూ, ఈ కట్టడంపై తడుపుతారు. నీరు కిందకు దిగి, ఘనీభవించి మంచుగా మారుతుంది. ఆ మంచును కార్మికులు యఖ్చాల్‌లోని సెల్లార్ ప్రాంతానికి తీసుకువెళతారు. అక్కడ ఉన్న గండ్రటి పెద్ద గుంటలో వాటని వేస్తారు. బయట ఉష్ణోగ్రతలు సుమారు 49 డిగ్రీల సెల్సియస్ వరకూ చేరుకున్నప్పటికీ యఖ్చాల్‌లో భూమి కింద మీఉ కారణంగా, లోపల ఉష్ణోగ్రత చల్లగా ఉంటుంది. ఆవిరి శీతలీకరణ విధానాలను కొన్ని వేల సంవత్సరాల క్రితమే కనుకొని, ఉపయోగించారంటే, నాటి సాంకేతికత ఏ స్థాయిలో ఉండేదో ఊహించుకోవచ్చు. అప్పట్లో ఈ సాంకేతికతను భోజనం నిల్వకు కూడా ఉపయోగపడేదని పరిశోధకుల అంచనా. అంటే నేటి రిఫ్రిజిరేటర్ల మాదిరి అవి ఉపయోగపడేవి.

# ఇయు కూటమి గెలుపుతోనే ఆర్‌టిసి పరిరక్షణ

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఆర్‌టిసి ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్, టిఎంయు కూటమిని భారీ మెజారిటీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. ఆర్‌టిసి ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కరీంనగర్‌లోని ఆర్‌టిసి జోనల్ వర్క్ షాప్‌ల వద్ద సిరిసిల్ల, వేములవాడ, జోనల్ వర్క్ షాప్ కార్మికులతో కలిసి చాడ వెంకట్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఫిలిం భవన్‌లో జరిగిన కరీంనగర్ వన్, టూ డిపోల కార్మికుల సమావేశానికి హాజరై చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కార్మికుల చిరకాల కోరిక ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం, అన్ని విభాగాల కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కావాలంటే, నిరంతరం కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతున్న ఎంప్లాయిస్ యూనియన్, అలాగే టిఎంయు కూటమి గెలవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రచార కార్యక్రమాలలో సిపిఐ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, మంద సుదర్శన్, ఎంప్లాయిస్ యూనియన్, టిఎంయు కూటమి నాయకులు బెజ్జంకి కాళిదాసు, కొమురయ్య, ఏవిఆర్.రెడ్డి. ఏం.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కరీంనగర్...

### ఇయు పోరాట ఫలితంగానే గుర్తింపు ఎన్నికలు : బాగం

**ఖమ్మం :** ఆర్‌టిసి ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి గెలుపుతోనే సంస్థ పరిరక్షించబడుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్ పోరాట ఫలితంగా ఆర్‌టిసి కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నాయని ఇప్పటి వరకు సాధించిన హక్కులు ఎంప్లాయిస్ యూనియన్‌తోనే సాధ్యమయ్యాయని ఆయన స్పష్టం చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ కూటమి గెలుపు కోరుతూ బుధవారం ఖమ్మం డిపోలో విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర గుర్తింపునకు బస్సు గుర్తుకు, స్థానిక గుర్తింపుకు కాగడ గుర్తుకు ఓటు వేయాలని హేమంతరావు కోరారు. ఆర్‌టిసిలో తొత్తు సంఘాలను గెలిపిస్తే కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు, ఖమ్మం రీజియన్ గౌరవాధ్యక్షులు బిజి క్లెమెంట్, ప్రధాన కార్యదర్శి పిల్లి రమేష్, ఎఐటియుసి నాయకులు శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, గాదె లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

### కూటమి గెలుపుతోనే విలీనం సాధ్యం

**సత్తుపల్లి :** గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్(ఇయు), ఎన్ఎంయు కూటమిని గెలిపిస్తేనే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు కార్మికుల హక్కులను పరిరక్షించడం సాధ్యమవుతుందని ఎఐటియుసి జాతీయ సమితి సభ్యులు శింగు నరసింహారావు, సీహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. బుధవారం సత్తుపల్లి ఆర్‌టిసి డిపో వద్ద నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్మికులు అప్రమత్తంగా ఉండి హక్కుల పరిరక్షణ కోసం కూటమికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ, ఎఐటియుసి ఖమ్మం జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నిమ్మటూరి రామకృష్ణ, డిహెచ్‌పిఎస్ నాయకులు తడికమళ్ల యోబు, ఎన్ఎంయు నాయకులు ఎన్.బాలస్వామి, కెఎస్.రావు, ఎస్‌కె.బాజీ, జిఆర్.కృష్ణ, టిఎంయు నాయకులు వైఎన్.రాజు, ఇయు నాయకులు ఎన్ఆర్.కృష్ణ, బి.రాంబాబు, రఘు, బాల్‌రావు, రాంబాబు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మం...

### కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత ఇయుతోనే సాధ్యం : వాసిరెడ్డి

**మంచిర్యాల :** ఆర్‌టిసి కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత కోసం నిరంతరం పోరాడుతున్న ఎంప్లాయిస్ యూనియన్, టిఎంయులను గెలిపించాలని ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. బుధవారం మంచిర్యాల డిపో వద్ద జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా స్వప్రయోజనాల కోసం పార్టీలు మారే వారిని గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు, ఇయు నాయకులు మామిడిపల్లి శ్రీనివాస్, రాజేశం, గోలి శంకర్, బొట్టు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రశ్నించి పోరాడే కూటమిని గెలిపిద్దాం...పల్లా నర్సింహారెడ్డి

**దేవరకొండ :** ఆర్‌టిసి సంస్థలో జరుగుతున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బస్ గుర్తు, నిచ్చెన గుర్తుపై ఓటు వేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎంప్లాయిస్ యూనియన్ డిపో గౌరవ అధ్యక్షులు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఆర్‌టిసి గుర్తింపు సంఘ ఎన్నికల ప్రచార సభ బుధవారం దేవరకొండ డిపో ముందు నిర్వహించారు. ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా చైతన్యవంతమైన కార్మికులుగా ఆర్‌టిసి పరిరక్షణ కోసం ఇయు కూటమిని గెలిపించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రామస్వామి, జిల్లా సహాయకార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మైనోద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు రంగారెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లాకార్యదర్శి పాండురంగారావు, ఆర్‌టిసి జెఎసి నాయకులు రమేష్, హరి, జనార్ధన్ రెడ్డి, ఉస్మాన్, డిఎన్‌రెడ్డి, నారాయణ, దాస్, సాయిరాం, నందు, రాజశేఖర్, యాదయ్య, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, వెంకటయ్య పాల్గొన్నారు.


సత్తుపల్లి...


మంచిర్యాల...


దేవరకొండ...

# ప్రజాస్వామ్య విలువలు కాపాడటంలో ఎన్నికల సంఘం విఫలం : తక్కళ్లపల్లి

**ప్రజాపక్షం/ వరంగల్ :** ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఎన్నికల సంఘం విఫలమైందని, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని, ఎన్నికల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి ఆయనపై చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో వరంగల్ పోచమ్మ మైదాన్ సర్కిల్ నుంచి కాశిబుగ్గ అంబేద్కర్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వరంగల్ డిసిసి అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్, పరకాల, పాలకుర్తి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, కెఆర్ నాగరాజు, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ జాన్సీరెడ్డి, కుడా చైర్మెన్ గుండు సుధారాణితో పాటు సిపిఎం, సిపిఐఎంఎల్ నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వయంప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్ వ్యవస్థను కేంద్రంలోని అధికార పార్టీ తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాసేలా జరుగుతున్న అక్రమాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. దేశంలో స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు జరగాలంటే ప్రస్తుత ఎన్నికల ప్రధాన అధికారి తప్పుకోవాలని స్పష్టం చేశారు. తొలగించిన ప్రతి ఒక్క ఓటును పునరుద్ధరించాలని, వివాదాస్పదంగా మారిన ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియాతోపాటు సిపిఐ నాయకులు, కార్యకర్తలు, వరంగల్ యూత్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.




**నిజామాబాద్ :** సిఇసి జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని బుధవారం ధర్నా చౌక్‌లో కాంగ్రెస్, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో సుధాకర్ మాట్లాడుతూ అర్థరహితంగా తయారుచేసిన ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ, అఖిలపక్ష నాయకులు భూమయ్య, ఓమయ్య, రాజేశ్వర్, రఘురాం, అలీ ఇమ్రాన్, ఫిరోజ్‌అలీ, సురేష్, సుబోద్ పాల్గొన్నారు.






## విద్యుత్ కోతలు సబ్‌స్టేషన్ ముట్టడి

### అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

**ప్రజాపక్షం/కోదాడ:** విద్యుత్ కోతల వల్ల చేతికొచ్చిన వరి పైర్లు ఎండిపోతున్నాయని అగ్రహిస్తూ కోదాడ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం అఖిల పక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాద్ నాయకత్వంలో రైతులు సబ్‌స్టేషన్ ముందు ట్రాక్టర్లను అడ్డుగాపెట్టి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాద్ మాట్లాడుతూ ఎడాపెడా విద్యుత్ కోతలు విధించడం వల్ల పొలాలకు నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరం విద్యుత్ సరఫరా లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల కారణంగా ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.30వేలు చొప్పుల పరిహారం చెల్లించాలని, అలాగే పంటలను కాపాడేందుకు వెంటనే 24 గంటల విద్యుత్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులు కమతం వెంకటరావు, కుటుంబరావు, సైదయ్య, సామినేని సుబ్బారావు, సతీష్, నరేష్, పూర్ణ, కొండయ్య, నాగుల్, నరేష్ పాల్గొన్నారు.

## క్రమశిక్షణ,పట్టుదల,నిరంతర సాధనతోనే విజయం

### ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ చంద్రశేఖర్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** క్రమశిక్షణ,పట్టుదల,నిరంతర సాధనతోనే విజయం సాధించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ సూచించారు. ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీయువకులకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ ట్రైనింగ్ సెంటర్లో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పి శరత్ చంద్ర పవార్ సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణలో అందించే బోధనను శ్రద్ధగా వినడంతో పాటు ప్రతిరోజూ స్వయంగా చదువుకునేందుకు సమయం కేటాయించాలని, లక్ష్యంపై పూర్తి దృష్టి పెట్టాలని సూచించారు.ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ కలెక్టర్ సహకారంతో 45 రోజుల పాటు సుమారు 350 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నామని,రాత పరీక్షతో పాటు ఎంపిక ప్రక్రియలోని అన్ని దశలకు సమగ్రంగా సిద్ధం కావాలని సూచించారు. గత ప్రశ్నపత్రాల పరిశీలన, మాక్ టెస్టులు,సమయపాలన పాటించాలని తెలిపారు. కార్యక్రమానికి సహకరిస్తున్న కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్,డిటిసి డిఎస్పి నగేష్, ఎస్‌బి సీఐ నాగరాజు,సీఐ కరుణాకర్,ఆర్ఐలు సంతోష్, హరిబాబు,ఎస్ఐలు,సిబ్బంది,శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.

## కులవివక్షకు వ్యతిరేకంగా మాదిగలు ఉద్యమం

### మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు మోత్కుపల్లి నర్సింహులు



**ప్రజాపక్షం/నల్లగొండ :** మాదిగ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి,రాజకీయ అధికారం సాధించేందుకు మాదిగలంతా ఐక్యంగా ఉద్యమించాలని మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు మోత్కుపల్లి నర్సింహులు పిలుపునిచ్చారు.బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లో మాదిగలు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.చింతపల్లి మండలం పికె మల్లేపల్లి గ్రామంలో ఐకేపీ వీవోఏ గా పనిచేస్తున్న గనిపెల్లి మాధవిని గ్రామసభలో కులం పేరుతో దూషించి దాడి చేసిన ఘటనను తీవ్రంగా ఖండించారు. నిందితుడు కుప్పల అమర్నాథ్‌పై ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద, హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాదిగలు,దళితులకు అండగా ఉంటామని చెప్పే నాయకులు బాధితులకు అన్యాయం జరిగినప్పుడు పక్షాన నిలబడకపోవడం విచారకరమన్నారు.బాధితురాలికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక,చట్టపరమైన ప్రయోజనాలను వెంటనే కల్పించాలని కోరారు.మాదిగ యువత ఐక్యతతోనే రాజకీయ అధికారం సాధ్యమని,సామాజిక హక్కులు,ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సంగెం ప్రసాద్,రుద్రవరం లింగస్వామి,మార్చర్ల సైదులు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## బిఇడి పరీక్ష ఫలితాలు విడుదల

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలో నిర్వహించిన బీఈడీ పరీక్ష ఫలితాలను బుధవారం ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ శిక్షణ , పరీక్ష నిర్వహణలో ప్రమాణాలను పాటించడం మంచి విద్య విధానానికి తొలి అడుగుగా అభివర్ణించారు. మొదటి సెమిస్టర్ లో 760 మంది విద్యార్థులు హాజరు కాగా 59.87 , రెండవ సెమిస్టర్ లో 3057 మంది విద్యార్థులకు కాను 81.32,మూడవ సెమిస్టర్ లో 267 మంది విద్యార్థులకు గాను 76.7.8 నాల్గవ సెమిస్టర్ లో 2798 మంది విద్యార్థులకు తాను 95.21 ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పూర్తి ఫలితాల కొరకు ఎంజియు వెబ్‌సైట్‌ని సందర్శించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి,డాక్టర్ జి లక్ష్మిప్రభ, డాక్టర్ సంధ్యారాణి, ప్రవళిక, కళ్యాణి పాల్గొన్నారు.



## ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ. 26,000

### మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జైపాల్ రెడ్డి డిమాండ్

### యాదగిరిగుట్ట మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేత




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం , అధికారులు వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. యాదగిరిగుట్టలోని సీపీఐ కార్యాలయంలో పేరబోయిన స్వామి అధ్యక్షతన మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జైపాల్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం కాపాడుతూ ప్రజలకు నిరంతరం మెరుగైన సేవలు అందిస్తున్న కార్మికుల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. అయితే, వారి హక్కులు , సంక్షేమం విషయంలో అధికారులు, యాజమాన్యాలు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. వీక్లీ ఆఫ్ & సెలవులు: కార్మికులకు వారానికి ఒకరోజు వీక్లీ ఆఫ్ (సెలవు), క్యాజువల్ లీవ్స్‌తో పాటు పండుగ , జాతీయ సెలవులను విధిగా అమలు చేయాలి. ప్రతి కార్మికుడికి నెలకు రూ. 26,000 కనీస వేతనం చెల్లించి, వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలి. దీర్ఘకాలంగా మున్సిపల్ సేవల్లో సేవలందిస్తున్న కార్మికులకు చట్టబద్ధంగా లభించాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించాలి.సమస్యలను పరిష్కరించడంలో అధికారులు సానుకూలంగా స్పందించాలని, లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో తీవ్రమైన కార్యాచరణ చేపడతామని ఆయన హెచ్చరించారు. అనంతరం కార్మికుల వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యాదగిరిగుట్ట మున్సిపల్ మేనేజర్ సుమిత్రకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోదా శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్, సిపిఐ పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మాజీ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి పేరబోయిన బంగారు, ఏఐటియుసి మండల కార్యదర్శి గోపగాని రాజు, గీతా పనుల సంఘం మండల కార్యదర్శి గుండు వెంకటేష్, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు జహంగీర్ పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయం కాపాడుకోవాలి

### మహిళా సమాఖ్య, ప్రజా నాట్య-మండలి కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో మహిళా సమాఖ్య, ప్రజా నాట్యమండలి కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు. ముందుగా సిపిఐ జిల్లా కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం నిర్వహించిన సభకు తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వాలు బతుకమ్మ ఆటపాటలు, కప్ప కాముడు, సంస్కృతి కళారూపాలు అంతరించిపోకుండా కావాల్సిన నిధులు కేటాయించి ప్రోత్సహించి సాంస్కృతిక కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కళ్లెం కృష్ణ, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు బుషపాక నరసింహ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండి నయీమ్ నాయకులు ఇంజా హేమలత, శోభన్ బాబు, పుట్ట రమేష్, మాటూరి జానమ్మ, యానాల సంధ్య, మంచాల రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పౌరుడి రక్షణ, భద్రత పోలీసు బాధ్యత

### సూర్యాపేట జిల్లా ఎస్పి కె. నరసింహ




**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రతి పౌరుని రక్షణ, భద్రత పోలీసు బాధ్యతని జిల్లా ఎస్పి కె. నరసింహ అన్నారు. సూర్యాపేట జిల్లాలో ప్రతి బుధవారం నిర్వహిస్తున్న సైబర్ జాగ్రత్త దినోత్సవంలో భాగంగా బుధవారం సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సైబర్ మోసాల నివారణ, సైబర్ సెక్యూరిటిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పౌరుల రక్షణలో అనుక్షణం పనిచేస్తున్నామన్నారు. సమాజంలో జరిగే ఆర్థిక నేరాలు, దొంగతనాల్లో ప్రస్తుతం సైబర్ మోసాలే అత్యధికంగా 80 శాతం నమోదవుతున్నాయన్నారు. ప్రజల అత్యాశ, అవగాహన లోపాన్ని ఆయుధంగా చేసుకున్న సైబర్ మోసగాళ్లు సుదూర ప్రాంతాల్లో ఉండి ఆర్థిక నష్టాన్ని కలిగిస్తున్నారని చెప్పారు. నిరుపేదలు, పండ్లు, కూరగాయలు నడుపుకునే వారి పేర్లతో నకిలీ, అద్దె బ్యాంక్ ఖాతాలను తెరచి, పెద్ద మొత్తంలో లావాదేవీల కోసం కరెంట్ ఖాతాలను కూడా కొనుగోలు చేస్తున్నారని వివరించారు. ఒక దగ్గర ఉండి బ్యాంక్ ఖాతాలు ఆపరేట్ చేస్తూ, మరో ప్రాంతంలో డబ్బులు విత్ డ్రా చేస్తుండటం వల్ల వారిని గుర్తించడం కష్టమవుతుందని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ ట్రేడింగ్, ఆన్‌లైన్ పెట్టుబడులు పెట్టేటప్పుడు లేదా అపరిచిత వ్యక్తులతో లావాదేవీలు జరిపేటప్పుడు ఒక్క నిమిషం ఆగి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. విద్యార్థులు సైబర్ మోసాలపట్ల అవగాహన పెంచుకొని వారియర్లుగా మారాలని, తమ తల్లిదండ్రులను, సమాజాన్ని చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. కళాశాలల్లో ర్యాగింగ్ అనేది విష సంస్కృతని, తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం తీవ్రమైన నేరమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెడికల్ వైద్యాధికారి డాక్టర్ వెంకట్‌రాములు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాలతి, మెడికల్ సూపరింటెండెంట్ శ్రవణ్ కుమార్, స్థానిక డిఎస్‌పి ప్రసన్న కుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, స్థానిక ఎస్ఐలు యాదవేందర్ రెడ్డి, అజయ్ కుమార్, షీ టీమ్ ఎస్ఐ నీలిమ, పోలీసు కళాబృందం, కళాశాల వైద్య ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## తెలంగాణ జన సమితి రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడిగా ధర్మార్జున్



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణ జన సమితి రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడిగా సూర్యాపేటకు చెందిన న్యాయవాది సీనియర్ తెలంగాణ జన సమితి నాయకుడు తెలంగాణ ఉద్యమకారుడు కుంట్ల ధర్మార్జున్ పార్టీ రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ఉత్తర్వులు జారీ చేశారు. విప్లవ విద్యార్థి ఉద్యమ నాయకుడిగా ప్రయాణం మొదలెట్టి విప్లవోద్యమ నాయకుడిగా ఎదిగి పౌర ప్రజాస్వామ్య ఉద్యమంలో క్రియాశీలకంగా కొనసాగిన ధర్మార్జున్ తదుపరి మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక డివిజన్ కమిటి స్థాయి నుండి రాష్ట్ర కార్యదర్శి వరకు అంచలంచెలుగా ఎదిగారు. తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భాగస్వామిగా ఉంటూ అరెస్టులను, జైలును ఎదుర్కొంటూ తన సహచర ఉద్యమకారులను కాపాడుకుంటూ క్రియాశీలక పాత్ర పోషించారు. 2018లో ఆనాడు ఉన్న ప్రత్యేక పరిస్థితుల్లో ఏర్పడిన తెలంగాణ జన సమితి పార్టీ ఆవిర్భావ సభ్యుడిగా కొనసాగుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సూర్యాపేట నియోజకవర్గ ఇంచార్జిగా పార్టీ పలు అంతర్గత కమిటిలకు బాధ్యుడిగా వ్యవహరిస్తూ వచ్చారు. ఇటీవల జరిగిన రాష్ట్ర ప్లీనరీ నిర్ణయం మేరకు కొత్త కమిటిని ప్రకటించిన కోదండరాం మొదట నుండి తనకు తోడుగా వెన్నుదన్నుగా ఉన్న ధర్మార్జున్‌ని సీనియర్ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. తనను రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడిగా నియమించిన కోదండరాంకు కృతజ్ఞతలు తెలుపుతూ తెలంగాణ ఉద్యమం అమరవీరుల, ఉద్యమ ఆకాంక్ష సాధన కొరకు ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణం కొరకు నిరంతరం ప్రజా ఉద్యమాలతో మమేకమవుతూ ముందుకు సాగుతానని ధర్మార్జున్ అన్నారు.

## పదేళ్లుగా స్లాబ్ దశలోనే.. పంచాయతీ భవనం పూర్తయ్యేది ఎప్పుడు?



### రేవెల్లి పంచాయతీ భవనం ఇకనైనా పూర్తి చేయండి సారూ

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని రేవెల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు పదేళ్లు గడుస్తున్నా పూర్తికాకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2014లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు స్లాబ్ దశ వరకు పూర్తయి, అనంతరం నిలిచిపోయాయని వారు తెలిపారు.గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు సగంలోనే నిలిచిపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణానికి వేసిన గోడలు, స్లాబ్ సైతం ఏళ్ల తరబడి ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో పాత భవనం మాదిరిగా మారిపోయాయని తెలిపారు. పనులు నిలిచిపోవడానికి కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమా అధికారుల నిర్లక్ష్యమా అని ప్రశ్నిస్తున్నారు.

**పంచాయతీ భవనం లేక ఇబ్బందులు**

గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం లేకపోవడంతో ప్రజలు, గ్రామ పంచాయతీ అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామ సభలు, ప్రజలకు సంబంధించిన సమావేశాలు, ఇతర పంచాయతీ కార్యక్రమాలు నిర్వహించేందుకు సరైన వసతి లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి, అవసరమైన నిధులు విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని రేవెల్లి గ్రామస్తులు కోరుతున్నారు.



## పత్తి కొనుగోలుకు సంసిద్ధం

### కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులకు ఆదేశం

**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు 2026/27 సీజన్‌లో మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మార్కెటింగ్,వ్యవసాయ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 5,93,795 ఎకరాల్లో పత్తి సాగు కాగా,3,56,257 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. జిల్లాలో 26 జిన్నింగ్ మిల్లులు ఉండగా,సీసీఐ ఆధ్వర్యంలో 10 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.కేంద్రం క్వింటాకు రూ.8667 మద్దతు ధర ప్రకటించింది.తేమ 8 శాతం వరకు ఉంటే మద్దతు ధర లభిస్తుందని తెలిపారు.కిసాన్ కపాస్ యాప్, నాణ్యత ప్రమాణాలపై విస్తృత ప్రచారం చేయాలని, ప్రతి రైతుకు కొనుగోలు కేంద్రాలు,తేదీలు,సెలవుల వివరాలు ముందుగానే తెలియజేయాలని సూచించారు.ప్రతి కేంద్రంలో నెల రోజుల షెడ్యూల్,మద్దతు ధర, తేమ శాతం వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు,టాయిలెట్లు,నీడ,రాత్రి వసతి,మైకు, లసీసీ కెమెరాలు, పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని,రైతులకు తక్షణ చెల్లింపులు చేయాలని ఆదేశించారు. కొనుగోలు ముగిసే వరకు మార్కెటింగ్ సిబ్బందికి సెలవులు ఉండవని స్పష్టం చేశారు.జిన్నింగ్ మిల్లర్లు మద్దతు ధరకు మించి కొని రైతులకు లాభం చేకూర్చాలని, మానవతా దృక్పథంతో సహకరించాలని కోరారు.సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, అడిషనల్ ఎస్పి రమేష్, సీసీఐ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ దిలీప్,మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ పాల్గొన్నారు.

## అమర్‌నాథ్‌గౌడ్‌పై ఎస్‌సి, ఎస్‌టి కేసు

### అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు....

### వివరాలు వెల్లడించిన డిఎస్‌పి శ్రీనివాస్‌రావు




**ప్రజాపక్షం/దేవరకొండ :** నల్గొండ జిల్లా చింతపల్లి మండలం పి.కే.మల్లేపల్లి గ్రామంలో మహిళా వివోఏ గనిపల్లి మాధవిపై అక్టోబర్ 02 గాంధీ జయంతి సాక్షిగా జరిగిన గ్రామ సభలో అదే గ్రామానికి చెందిన అమర్‌నాథ్‌గౌడ్ భౌతికదాడికి పాల్పడటంతో పాటు కులం పేరుతో తీవ్రంగా దూషించిన సంఘటనలో కొప్పుల అమర్‌నాథ్‌గౌడ్ అనే వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో దేవరకొండ డిఎస్పి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ వివోఏగా పనిచేస్తున్న మాధవి పై అక్టోబర్ 02వ తేదిన నిర్వహించిన గ్రామసభలో అదే గ్రామానికి చెందిన కొప్పుల అమర్‌నాథ్‌గౌడ్ అనే వ్యక్తి అక్కడికి వచ్చి వివోఏ మాధవిపై నీచమైన పదజాలంతో, కులం పేరుతో బహిరంగంగా దూషించాడని, ఆమేపై దాడి చేశాడని తెలిపారు. ఇట్టి విషయమై చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన దర్యాపు చేపట్టి బుధవారం కులం పేరుతో దూషించి, దాడి చేసిన కొప్పుల అమర్‌నాథ్‌ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. మహిళలపై దాడులు, అణగారిన వర్గాలపై వేధింపులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని దేవరకొండ డిఎస్పి శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో సిఐ రాజు, ఎస్ఐ రామ్మూర్తి పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యకర సమాజం




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్టార్ బ్లాంకెట్ హాల్‌లో 9వ పోషణ మాసం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి కుటుంబంలో పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, వైస్ చైర్మన్ షఫీఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, సిడిపిఓ సుబ్బలక్ష్మి, కౌన్సిలర్లు జహీర్, తాహెర్, అంజలి, వీరమ్మ, నాగమ్మ, కళావతి, జ్యోతి, ఝాన్సీ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో విద్యుత్ పనులు ఆపాలి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మహమ్మదాబాద్ గ్రామ రెవెన్యూ పరిధిలో 239 సర్వేనెంబర్ గల ప్రభుత్వ భూమిలో విద్యుత్ మరమతులను ఆపాలని మహమ్మదాబాద్ గ్రామ ప్రజలు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వ్యక్తులకు ట్రాన్స్ఫార్మర్ నిర్మాణాన్ని నిలిపివేసి గ్రామానికి సంబంధించిన దేవర గుట్ట (మల్లన్న దేవుని గుట్ట) సమీపంలో ఉన్న భూములను కాపాడాలని యాదవ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో రెవిన్యూ అధికారులకు ఇదే విషయంపై తెలుపగా గతంలో హెచ్చరిక బోర్డులను నాటించి ప్రభుత్వ భూమిలోకి ఎవరు ప్రవేశించవద్దని హెచ్చరించినారు. ఆంధ్ర ప్రదేశ్ శ్రీకాకుళం వాస్తవ్యులు పచ్చిగోళ్ళ రాజకుమార్ సాయితో విద్యుత్ డీడీలు తీయించి అక్రమంగా ప్రభుత్వ భూమిలో విద్యుత్ మరమ్మత్తులు చేపడుతున్నారు. గతంలో గ్రామస్తులు అడ్డుకోగా గ్రామ సర్పంచ్ ముత్యాల అంజయ్య, మరి కొంత మంది గ్రామస్తులపై దాడి చేసి స్థానిక పోలీస్ స్టేషన్లో కూడా కేసు పెట్టినారు. ఇదే విషయంపై శాసనమండలి సభ్యుడు నెల్లికంటి సత్యం ఓ కార్యక్రమానికి హాజరైన ఆయనకు తెలుపగా వెంటనే విద్యుత్ సంబంధిత ఏసి, ఏడి, డిఈలతో చరవాణి ద్వారా మాట్లాడారు. యాదవ కులదైవమైన మల్లన్న దేవర గుట్ట సమీపంలో ఉన్న భూమిలో ఎటువంటి విద్యుత్ మరమ్మతులు చేపట్టవద్దని అధికారులను ఆదేశించారు. ప్రజా అవసరాల కోసం ఏదైనా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుడితే అభ్యంతరాలు ఏముండవని తెలిపారు. ప్రైవేటు వ్యక్తులకు వారి సొంత భూములు విద్యుత్ మరమ్మతులు చేయించుకోకుండా దేవాలయం భూముల్లో నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముత్యాల అంజయ్య, వార్డు సభ్యులు దంటిక అశోక్, యాదవ సంఘం నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మైనర్ బాలికల అదృశ్యంపై దర్యాప్తు ముమ్మరం

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** మండల కేంద్రంలోని మంగళవారిపేట ప్రభుత్వ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ఇద్దరు గిరిజన మైనర్ బాలికల అదృశ్యం ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని ఈస్ట్‌జోన్ డిసిపి అనిల్‌కుమార్ తెలిపారు. వారం రోజుల క్రితం అదృశ్యమైన బాలికలను హైదరాబాద్‌లో గుర్తించి తిరిగి తీసుకువస్తుండగా అస్వస్థతకు గురికావడంతో ఎంజిఎం ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసులో అనుమానితుల గుర్తింపునకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు డిసిపి తెలిపారు. దర్యాప్తు పూర్తయిన అనంతరం అనుమానితుల పాత్రను నిర్ధారించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఘటనకు సంబంధించి ఎలాంటి వదంతులను నమ్మవద్దని, వాస్తవాలను మాత్రమే విశ్వసించాలని ప్రజలకు సూచించారు.

## బస్సు చక్రాల కింద పడి బాలుడు మృతి

● యజమాన్యాల నిర్లక్ష్యంపై ఆగ్రహం

**ప్రజాపక్షం/నెక్కొండ :** పాఠశాల బస్సు కింద పడి ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన నెక్కొండ మండలంలో కలకలం రేపింది. పాఠశాలకు వెళ్ళాల్సిన వయసులో తల్లిదండ్రుల తీరని శోకాన్ని మిగిల్చింది. పిట్టకానుతోపు గ్రామ పంచాయతీ పరిధిలోని మత్తడితండాలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. నెక్కొండ మండల కేంద్రంలోని విద్యోదయ పాఠశాల బస్సు ప్రతి రోజు మాదిరిగానే విద్యార్థులను ఎక్కించుకునేందుకు తండాకు చేరుకుంది. ఈ క్రమంలో బస్సు వెనుక టైర్ కింద బాధావత్ రాహుల్ 3 సంవత్సరాల చిన్నారి పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. క్షణమందే చిన్నారి ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు అఖిల, రమేష్‌తో పాటు కుటుంబసభ్యులు, బంధువులు, తండా వాసులు కన్నీరుమున్నీరయ్యారు. కష్టమొచ్చే బస్సు బిడ్డ మృతి రోజూ పాఠశాలకు వెళ్లే చిన్నారి బస్సు చక్రాల కింద పడి మృతి చెందడంతో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఉదయం పాఠశాలకు వెళ్ళాల్సిన చిన్నారి విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు స్థానికులను కలిచివేసింది. కుటుంబానికి ఆధారంగా ఉండాల్సిన బాలుడిని కోల్పోవడంతో తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డా.దోలి సత్యనారాయణ

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమ నేత డాక్టర్.దోలి సత్యనారాయణ నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో పార్టీ కార్యాలయంలో అధికారికంగా ఎంఎల్‌సి ఆచార్య కోదండరామ్ ప్రకటించారు. ఈ సందర్భంగా గా డా.దోలి సత్యనారాయణ మాట్లాడుతూ ఈరోజు టిజెఎస్‌లో ఇంత కీలక భాద్యతలు రావడం సంతోష దాయకమని, తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యత అప్పజెప్పిన ఆచార్య కోదండరాం సార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇందుకు సహకరించిన రాష్ట్ర పార్టీ నాయకత్వానికి తెలంగాణ ఉద్యమకారులకు, తనకు వెన్నంటి ఉండి తన ఎదుగుదలకు సహకరించిన మీడియా మిత్రులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలులు తెలిపారు.

## ఆశ్రమ పాఠశాలలో ఐటిడిఏ పిఒ తనిఖీ



**ప్రజాపక్షం/ములుగు :** మండలంలోని బూర్గుపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి సౌకర్యాలను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన పిఓ విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన స్థాయి, విద్యా ప్రగతిని తెలుసుకున్నారు. నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలను పరిశీలించి చదువుపై మరింత శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం డార్మిటరీ, పాఠశాల రికార్డులు, విద్యా సంబంధిత పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు క్రమశిక్షణ, హాజరు, ఆరోగ్యం, వసతి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అనుకూలమైన వాతావరణం కల్పించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## స్వయం ఉపాధితో మహిళలు ఎదగాలి




● కుట్టు మిషన్‌లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని

**ప్రజాపక్షం/హనుమకొండ :** అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన 200 మంది అర్హులైన ముస్లిం మైనారిటీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరా మహిళా మైనారిటీ యోజన పథకం కింద వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 55 మంది ఒంటరి ముస్లిం మైనారిటీ మహిళలకు 100 శాతం సబ్సిడీతో ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున చెక్కులు అందించే కార్యక్రమాన్ని త్వరలో చేపడుతామని ఎమ్మెల్యే నాయిని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మైనారిటీ మత పెద్దలు, మైనారిటీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఐఎఫ్ఎం భోపాల్ బృందం మేడారం సందర్శన

**ప్రజాపక్షం/తాడ్వాయి :** గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, అటవి అధారిత జీవనోపాది తదితర అంశాలపై క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా ఐఐఎఫ్ఎమ్ భోపాల్‌కు చెందిన ప్రొఫెసర్ శరదిందు పాండే బృందం మేడారంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ మ్యూజియయాన్ని సందర్శించారు.పర్యటనలో భాగంగా గిరిజనుల అభివృద్ధి, అటవీ ఉత్పత్తుల సేకరణ, విలువ జోడింపు, ఎకోటూరిజం, గిరిజన సంస్కృతి పరిరక్షణ వంటి అంశాలను అధ్యయనం చేస్తుంది. ఈ పర్యటన ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను పరస్పరం పంచుకునే అవకాశం లభించింది. పర్యటన ఏర్పాట్లను ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో పర్యవేక్షించారు.

# ఓటుహక్కు హరిస్తే ప్రమాదంలో ప్రజాస్వామ్యం



● ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, కెఆర్.నాగరాజు

**ప్రజాపక్షం/హనుమకొండ :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందించిన ఓటు హక్కును కూడా హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనపై ఢిల్లీలో పోలీసులు అరెస్ట్ చర్యలను నిరసిస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు పాల్గొన్నారు. హనుమకొండ డిసిసి కార్యాలయం నుంచి అశోక్ జంక్షన్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కును కూడా కాపాడుకోలేని పరిస్థితి రావడం దురదృష్టకరం. ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న సమయంలో ఎన్నికల్లో గెలవడానికి ఓటర్లనే తొలగించే పరిస్థితి వస్తే ప్రజాస్వామ్యం ఎక్కడ మిగులుతుంది అని ప్రశ్నించారు. అక్టోబర్ 6న ఢిల్లీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడం పట్ల మండిపడ్డారు. విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు ఈ అంశాలపై ఆలోచించి ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలి అని ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు పిలుపునిచ్చారు.




## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**ప్రజాపక్షం/గణపురం :** డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం కావాలని మత్తు పదార్థాల నియంత్రణలో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం గణపురం మండల కేంద్రంలో ఎబివిపి ఆధ్వర్యంలో విద్యార్థులతో మత్తు పదార్థాల వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా విద్య, క్రీడలు, సామాజిక సేవలపై దృష్టి సారించాలని సూచించారు. మత్తు పదార్థాల వలన వ్యక్తి ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి నాయకులతో పాటు గణపురం ఎస్ఐ బొరగల అశోక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి చోటే మియా, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టిక అల్పాహారం

● సిఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కలెక్టర్ చాహత్ బాజ్ పాయితో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టిక అల్పాహారాన్ని అందించాలనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారని, తద్వారా ప్రతిరోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉదయం పూట ఆకలితో పాఠశాలకు వస్తున్నారనే విషయాన్ని తెలుసుకొని, సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని అన్నారు. హసన్‌పర్తిలోని ఇదే పాఠశాలను రూ.6.80 కోట్ల నిధులతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా మార్చుకోబోతున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా 35 ఎకరాలలో స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభం కాబోతుందని, త్వరలో నిర్మాణానికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఫౌండేషన్ వేయనున్నట్లు తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ మంజూరు కాగా ఉప్పరపల్లి క్రాస్‌లో నిర్మాణ దశలో ఉందని, వచ్చే సంవత్సరం నాటికి పూర్తవుతుందన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి విద్యాభ్యాసానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం పూట సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం ద్వారా పౌష్టికమైన అల్పాహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే, కలెక్టర్ పాఠశాల విద్యార్థులకు అల్పాహారాన్ని వడ్డించారు. పాఠశాల తరగతి ఆవరణలో ఉన్న మెట్లపై విద్యార్థులతో కలిసి కూర్చొని ఎమ్మెల్యే, కలెక్టర్‌లు అల్పాహారాన్ని భుజించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, ఎంఈఓ శ్రీనివాస్, తహసిల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమన వాణి, బాలికల, బాలుర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుమాదేవి, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

## భద్రకాళీ ఆలయ సమీపంలో అక్రమ కట్టడాల కూల్చివేత

● ముందు జాగ్రత్తగా మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ నిర్బంధం



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** హనుమకొండ జిల్లాలో సుప్రసిద్ధ భద్రకాళి ఆలయ సమీపంలో చెరబండ రాజు కాలనీ పేరిట ఏర్పరచుకున్న తాత్కాలిక గుడిసెలను, ఇండ్లను ప్రభుత్వాధికారులు భారీ బందోబస్తు మధ్య బుధవారం కూల్చివేశారు. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా మాడవీధుల విస్తరణ దృష్ట్యా ఆలయ చుట్టుపక్కల ఉన్న అడ్డంకులను తొలగించే క్రమంలో ఈ కూల్చివేతలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. తాత్కాలిక గుడిసెలను తొలగించే క్రమంలో కొందరు కాలనీవాసులు విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందిపై తిరగబడ్డారు. అయితే ఈ ఘటన పూర్వాపరాల్లోకి వెళితే గతంలో ఆలయ భూముల్లో వేసుకున్న సుమారు 70 నుంచి 80 గుడిసెలను నివాసులు తమకు తాము స్వచ్ఛందంగా ఆలయానికి, ప్రభుత్వానికి అప్పగించారు. దానికి ప్రత్యామ్నాయంగా వారికి ఉపాధి దృష్ట్యా అర్హత ఉన్న కాలనీవాసులకు మూడు నెలలకు క్రితమే భద్రకాళి ఆలయంలో తాత్కాలిక ఉద్యోగాలు కల్పించారని, మరికొందరికి డబుల్ బెడ్రూంలను కేటాయించడం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. స్వచ్ఛందంగా అప్పగించిన వారి ఇళ్లను తొలగించే సందర్భంలో కొందరు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణంలోకి చేరుకుంది. కొందరు మాత్రమే తాము వేసుకున్న అక్రమ గృహాలను, గుడిసెలను ప్రభుత్వానికి అప్పగించకుండా ఇబ్బంది పెడుతున్నట్లు సమాచారం. వీరిలో కొందరు కాలనీవాసులు సీఐ కరుణాకర్‌తో వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బాధితులకు మద్దతుగా వస్తారన్న సమాచారం మేరకు వరంగల్ వెస్ట్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను గృహనిర్బంధం చేశారు. అక్రమ కట్టడాల కూల్చివేత సమయంలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వాధికారులను అడ్డుకున్న వారిని అదుపులోకి తీసుకొని మట్టెవాడ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మోదీ పాలనలోనే అన్ని రంగాల్లో ముందంజ



● పెద్దపల్లి మాజీ ఎంపి వెంకటేష్ నేత

● మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని సేవా జ్యోతి యాత్ర

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం ప్రధాని మోదీ తీసుకుంటున్న నిర్ణయాలు దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నాయని పెద్దపల్లి మాజీ ఎంపి వెంకటేష్ నేత, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బిజెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా భూపాలపల్లిలో సేవా జ్యోతి యాత్రను ఘనంగా నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా బిజెపి అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్ నేత, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి పాల్గొన్నారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని బిజెపి నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ నుంచి పోచమ్మ గుడి వరకు సేవా జ్యోతి యాత్రను నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్ద వికసిత్ భారత్ సంకల్ప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్ నేత మాట్లాడుతూ, నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 సంవత్సరాల ప్రజాసేవను పూర్తి చేసుకోవడం దేశ ప్రజలకు గర్వకారణమన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ, నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా ప్రజల్లో సేవా భావాన్ని మరింత పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి అరుట్ల దశమంత రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి పాపన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి ప్రసాదరావు, జన్నె మొగిలి, ఎరుకల గణపతి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెండ్యాల రాజు, తాటికొండ రవికిరణ్, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, మండల నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓయూకు వెయ్యి కోట్లు ఎందుకు విడుదల చేయలేదు?

● జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు




**ప్రజాపక్షం/జనగామ :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం జనగామలోని బిఆర్ఎస్ కార్యాలయంలో పట్టభద్రుల ఓటర్ల నమోదుపై పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వయించారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే బాధ్యత పట్టభద్రులదే అన్నారు. బిఆర్ఎస్ హయాంలో 1.60లక్షల ఉద్యోగాలు భర్తీ చేశామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం 12వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందన్నారు. ఉద్యోగాల భర్తీలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైన విషయాన్ని పట్టభద్రులు గుర్తించాలన్నారు. ఉస్మానియాకు వెయ్యి కోట్ల హామీ ఇచ్చి నిధులు ఎందుకు విడుదల చేయలేదని పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. మూడేళ్లుగా విశ్వ విద్యాలయాల్లో ఉద్యోగాల భర్తీ లేదన్నారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టభద్రులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. బిఆర్ఎస్ శ్రేణులు ప్రతి గ్రామంలో నమోదు ప్రక్రియ పకడ్బందిగా నిర్వహించాలన్నారు. కొందరు బిఆర్ఎస్ సర్పంచ్‌లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, బెదిరింపులకు భయపడొద్దన్నారు. ఆర్‌టిసి కార్మికులకు బిఆర్ఎస్ అండగా ఉంటుందని, ఆర్‌టిసి కార్మికులు సైతం ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. యువతకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గతంలో ప్రతి నియోజకవర్గంలో 10వేల నుండి 15వేల గ్రాడ్యుయేట్ ఓట్లు నమోదు అయ్యాయని ఈ దఫా కూడా అలానే నమోదు చేయించాలన్నారు. ఈ సమావేశంలో స్టేషన్‌ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, గద్దల నర్సింగరావు, రాకేష్‌రెడ్డి, పల్లా సుందర్‌రాంరెడ్డి, తాళ్ల సురేష్‌రెడ్డి, బాల్నె సిద్దిలింగం పాల్గొన్నారు.

**సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం 63 మంది లబ్దిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. జనగామ పట్టణానికి చెందిన 12 మందికి, రూరల్‌కు చెందిన నలుగురు, బచ్చన్నపేటకు చెందిన 12 మంది, నర్మెటకు చెందిన ఐదుగురు, తరిగొప్పులకు చెందిన ఆరుగురికి చెక్కులు పంపిణీ చేశారు. అనారోగ్యంలో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయ నిధి అందాలన్నారు.



## 33వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** 33వ వార్డు ఆదర్శంగా తీర్చిదిద్ది అభివృద్ధికి కృషి చేస్తానని వార్డు కౌన్సిలర్, సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి హామీ ఇచ్చారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 33 వ వార్డు లెంకలపల్లి అప్పయ్య గల్లీలో నేడు 10 లక్షల రూపాయలతో సిసి రోడ్డు ప్రారంభమైంది ఈ సందర్భంగా స్థానిక వార్డు కౌన్సిలర్ సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి స్థానిక వార్డు ప్రజలతో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 33వ వార్డులో సిసి రోడ్లు డ్రైనేజీలు ఏర్పాటు చేయించడం జరుగుతుందని అందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సిపిఐ ఆధ్వర్యంలో ఎంతో పోరాటం చేసి ప్రజల అండతో, పార్టీ కార్యకర్తలు వెన్నంటి ఉండడం వల్ల ఇటీవల గాంధీ పార్కు అభివృద్ధికి కృషి చేశామని, గాంధీపార్కులో ఉన్న మార్కెన్‌ను సమీకృత మార్కెట్‌లోకి రావడంలో తన వంతు పాత్ర పోషించానని పోషించానని, భవిష్యత్తులో మానుకోట మున్సిపాలిటీలోనే 33వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తానని అజయ్‌సారథిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ ముందడ, శ్యామ్ లోయ, సూర్య ప్రకాష్ లోయ, గోవిందు జావర్, పెండ్యాల రఘునాథ్, గంధం భద్రయ్య, పార్వతి, మురళి, లెంక్కలపల్లి శ్రీనివాస్, వొబిలి శెట్టి రవి, చెరివిరాల ప్రభాకర్, శ్రవణ్ లోయ, చిధిరాల ఉమాశంకర్, పెనుగొండ సదాశివుడు, కాట్రపల్లి శ్రీనివాస్, నాగేంద్ర ప్రదీప్, ఫణిందర్, ఆలేటి శ్రీనివాస్, లక్ష్మణ్, రోషన్, సోమశేఖర్, వినోద్, నీలం వెంకటేశ్వర్లు, యూసుఫ్, పెరుగు కుమార్, నక్క నాగార్జున, గాదం శ్యాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మినీ గురుకులంలో న్యాయ విజ్ఞాన సదస్సు




**ప్రజాపక్షం/ములుగు:** జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాకారం గ్రామంలోని మినీ గురుకుల బాలికల విద్యాలయంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులకు 'మంచి స్పర్శ.. చెడు స్పర్శ'పై మాట్లాడే బొమ్మ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.చండీశ్వరి దేవి హాజరై బాలికల భద్రత, చిన్నారులపై వేధింపుల నివారణ, బాల్య వివాహ నిరోధక చట్టం, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాల కార్మికుల నిషేధ చట్టం, ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టంపై వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఉచిత న్యాయ సేవలను ఎలా పొందవచ్చో విద్యార్థినులకు వివరించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న భోజనం, వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, ఇన్‌చార్జి వైస్ ప్రిన్సిపల్ ఎస్ లత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తం అవసరం



**ప్రజాపక్షం/జనగామ :** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జనగామ డిసిపి రాజమహేంద్రనాయక్ అన్నారు. బుధవారం సైబర్ జాగృతి దివస్ కార్యక్రమంలో భాగంగా డిసిపి కార్యాలయంలో తెలుగు, ఇంగ్లీష్ బాషల్లో ఉన్న సైబర్ అవేర్‌నెస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రస్తుతం రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలు, అన్‌లైన్ మోసాలు, ఫిషింగ్ లింకులు, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆగండి, ఆలోచించబండి, అడుగు వేయండి అనే నినాధాలతో ఈ వాల్ పోస్టర్లు ముద్రించినట్లు తెలిపారు. ప్రజలు సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు అవగామన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి భీమ్‌శర్మ, సిఐ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
గురువారం
08-10-2026
www.prajapaksham.in


# ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం

మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచ స్థాయి పోటీ తత్వమే తెలంగాణకు ప్రధాన బలమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఈ ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు ప్ర ముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని పే ర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో బుధ వారం జరిగిన డిఇ షా ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. 1996లో హైదరాబాద్‌లో కేవలం 20 మందితో ప్రారంభ మైన డిఇ షా ప్రస్థానం ప్రస్తుతం హైద రాబాద్, బెంగళూరు, గురుగ్రామ్‌లలో 2,000 మందికి పైగా ఉద్యోగులతో విస్త రించడం నగరంపై సంస్థకు ఉన్న నమ్మకా నికి నిదర్శనమన్నారు. నియోపొలిస్‌లో డీ ఈ షా ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయా న్ని స్వాగతించిన శ్రీధర్‌బాబు.. హైదరా బాద్ భవిష్యత్తుపై సంస్థకున్న విశ్వాసానికి ఇది సంకేతమన్నారు. ప్రపంచ సంస్థలు తెలంగాణలో కార్యకలాపాలను విస్తరించ డంతోపాటు అత్యున్నత నైపుణ్య ఉద్యో గాలు, కొత్త ఆవిష్కరణలు అనుకూల వాతా వరణాన్ని కల్పిస్తోందని తెలిపారు. ప్రపంచ స్థాయి సంస్థల విస్తరణకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని స్పష్టం చేశారు.




## 'ఇందిరా మహిళా శక్తి భవనాలు' ఆత్మగౌరవానికి నిలయాలు : సిఎం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని జిల్లాల వారీగా నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభానికి ముస్తాబైన 'ఇం దిరా మహిళా శక్తి భవనాలు' 'మన ఆడబిడ్డల' ఆత్మగౌరవానికి, ఆర్థిక స్వావలంబనకు సరి కొత్త నిలయాలుగా మారబోతున్నాయని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళాలు వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో, శిక్షణ, ఉపాధి అవకాశాలు, ఉత్పత్తుల తయారీ నుంచి గ్లోబల్ మార్కెట్లలో విక్రయాల వరకు అవసరమైన ప్రతి అవకాశాన్నీ ఒకే వేదికపై అందించేందుకు ఈ భవ నాలు కీలక కేంద్రాలుగా నిలవనున్నాయన్నారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డి ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఒక ఆడబిడ్డకు అవకాశం లభిస్తే, ఒక కుటుంబ భవిష్యత్తు మారుతుందని, రాష్ట్రంలో మహిళలకు అవకాశాలు పెరి గితే, తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని వివ రించారు. 'మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి' అనే ఆశ యంతో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయా లనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికా రతకు మరింత ఊతమిస్తూ, తెలంగాణ ప్రగతి ప్రయా ణాన్ని మరింత వేగవంతం చేస్తోందన్నారు.
















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com